





www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★



మొంకడాపై దాడికి 72 ఏళ్లు : క్యూబన్ విప్లవంలో మలుపు

బంతి బిజెపి కోర్టులోకి..

ఇరాన్ ప్రజల కన్నీటి వీడ్కోలు

లోపలి పేజీల్లో



సంపుటి 08, సంచిక: 209 | ఆదివారం | 29 -06-2025 | మహబూబ్‌నగర్ | Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00


## రాష్ట్రానికొక రాజ్యాంగాన్ని అంబేద్కర్ సమర్ధించలేదు

- దేశానికంతటికీ ఒకే రాజ్యాంగం అవసరమన్నారు
- ఆర్టికల్ 370 రద్దు సమర్థనీయమే
- భారత ప్రధాన న్యాయమూర్తి బిఆర్.గవాయ్ స్పష్టీకరణ
- ఢిల్లీలో రాజ్యాంగ ప్రవేశిక పార్క్, అంబేద్కర్ విగ్రహావిష్కరణ ప్రారంభోత్సవంలో ప్రసంగం




**న్యూఢిల్లీ :** దేశాన్ని ఐక్యంగా ఉంచేందుకు డాక్టర్ బిఆర్.అంబేద్కర్ ఒకే రాజ్యాంగాన్ని ఊహించారు కానీ, ఒక రాష్ట్రం కోసం ఒక ప్రత్యేక రాజ్యాంగం అనే ఆలోచనను ఆయన ఎప్పుడూ సమర్థించలేదని భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) బిఆర్.గవాయ్ స్పష్టం చేశారు. బిఆర్.గవాయ్ శనివారం ఇక్కడ రాజ్యాంగ ప్రియాంబుల్ (ప్రవేశిక) పార్క్ ప్రారంభోత్సవంలో మాట్లాడుతూ జమ్ము కశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పించే ఆర్టికల్ 370ని రద్దు చేయాలనే కేంద్రం నిర్ణయాన్ని

తరువాయి 2లో

# హైదరాబాద్‌పై ఒత్తిడి తగ్గించేందుకే భారత్ ఫ్యూచర్ సిటీ



- వందేళ్ల అభివృద్ధికి డిసెంబర్ 9 లోపు విజన్ డాక్యుమెంట్ విడుదల
- ప్రపంచ నగరాలతో హైదరాబాద్ పోటీ పడాలి
- రైజింగ్ తెలంగాణ 2047 లక్ష్యసాధన కోసం ప్రభుత్వం యజ్ఞంలా పనిచేస్తోంది
- ఎంతమంది రాక్షసులు అడ్డుపడినా వెనుకాడేది లేదు
- 2029లో నియోజకవర్గాల పునర్విభజన జరగబోతోంది
- కంచ గచ్చిబౌలి భూముల విషయంలో బిఆర్‌ఎస్ తప్పుడు ప్రచారం చేసింది
- కొత్త పరిశ్రమల ఏర్పాటు ద్వారా ఐదు లక్షల కొత్త ఉద్యోగాలు వస్తాయి
- పిజెఆర్ ఫ్లై ఓవర్ ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



> చిన్న చిన్న నగరాలు అద్భుతంగా మెట్రోను విస్తరించుకుంటున్నాయి. మా నివేదికలో ఏమైనా లోపాలు ఉన్నాయా?, మేం ఏ పాపం చేశాం? రెండో స్థానంలో ఉన్న మెట్రో తొమ్మిదో స్థానానికి పడిపోయింది. మెట్రో, మూసీ, ట్రిపుల్ ఆర్ ప్రాజెక్టులకు కేంద్రం సహకరించడం లేదు. రాష్ట్రానికి వస్తున్న అమిత్ షాను మరోసారి కలిసి విజ్ఞప్తి చేస్తాం. నేను దాదాపు 35 సార్లు ఢిల్లీ వెళ్లాను. ప్రధాని సహా అనేకమంది కేంద్రమంత్రులను కలిశాను. కానీ రాష్ట్రానికి కేంద్రం నుంచి చెప్పుకోదగ్గ ప్రాజెక్టులు రాలేదు. హైదరాబాద్‌కు ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఏం ఇచ్చారు. ఈ విషయం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆలోచించుకోవాలి.
>
> – సిఎం రేవంత్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

హైదరాబాద్‌పై పెరుగుతున్న ఒత్తిడిని తగ్గించేందుకే 30 వేల ఎకరాల్లో 'భారత్ ఫ్యూచర్ సిటీ'ని నిర్మిస్తున్నట్లు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చెప్పారు. ఫ్యూచర్ సిటీని గొప్పగా నిర్మిస్తామని, నెట్ జీరో సిటీని నిర్మించాలనేదే మా ప్రయత్నమని అన్నారు. వందేళ్ల అభివృద్ధి కోసం డిసెంబర్ 9 లోపు విజన్ డాక్యుమెంట్ విడుదల చేస్తామని ప్రకటించారు. తనకు హైదరాబాద్ నగర అభివృద్ధిపై సంపూర్ణ అవగాహన ఉందని, నగరంతో నాకు 40 ఏళ్ల అనుబంధం ఉందని చెప్పారు. 65 శాతం ఆదాయం హైదరాబాద్ నుంచే వస్తుందని, హైదరాబాద్ ప్రపంచ నగరాలతో పోటీ పడాలన్నారు. ముంబై, చెన్నై, ఢిల్లీ నుంచి మనం ఎంతో నేర్చుకోవాలన్నారు. కాలుష్యమే ఇపుడు యమపాశం అయ్యిందన్నారు. రాబోయే తరాలను దృష్టిలో ఉంచుకుని ప్రణాళికలు రచిస్తున్నామన్నారు. హైదరాబాద్ నగరం న్యూయార్క్, టోక్యో వంటి ప్రపంచ స్థాయి నగరాలతో పోటీపడాలని ఆకాంక్షించారు. 'రైజింగ్ తెలంగాణ2047' లక్ష్య సాధన కోసం తమ ప్రభుత్వం ఒక యజ్ఞంలా పనిచేస్తోందన్నారు. దీనికి ఎంతమంది రాక్షసులు అడ్డుపడినా వెనుకాడేది లేదని స్పష్టం చేశారు. ఈ లక్ష్య సాధనలో అందరూ కలిసిరావాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గాల పునర్విభజన జరగబోతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. 2029లో జరగబోయే నియోజకవర్గాల పునర్విభజనలో శేరిలింగంపల్లి వంటి పెద్ద నియోజకవర్గాలు నాలుగుగా విడిపోయే అవకాశం ఉందని, దీనివల్ల అందరికీ అభివృద్ధిలో భాగస్వామ్యం లభిస్తుందన్నారు. రూ.182.72 కోట్ల వ్యయంతో ఓఆర్ఆర్ నుంచి కొండాపూర్ వరకు కొండాపూర్ –గచ్చిబౌలి మార్గంలో ఆరు లేన్‌లతో 1.2 కిలోమీటర్ల ఫ్లైఓవర్‌ను జిహెచ్‌ఎంసి నిర్మించింది. ఈ ఫ్లైఓవర్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్‌లతో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్ ప్రజల దాహార్తిని

తరువాయి 2లో



## గుండు గీయించి వివస్త్రను చేసి..

- మహిళపై విచక్షణా రహితంగా దాడి
- వివాహేతర సంబంధంపై ఆగ్రహించిన గ్రామస్థులు
- హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం తాటికాయలలో అమానవీయ ఘటన

ప్రజాపక్షం/ధర్మసాగర్

సభ్యసమాజం తలదించుకునే ఘటన వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం తాటికాయల గ్రామంలో చోటుచేసుకుంది. తాటికాయల గ్రామానికి చెందిన ఓ యువతిని దశాబ్దం క్రితం ములుగు మండలం బోలోనిపల్లి గ్రామానికి చెందిన వ్యక్తితో వివాహం చేశారు. దంపతులకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఆ వ్యక్తి తన సమీప బంధువైన మరో వివాహితతో వివాహేతర సంబంధం

తరువాయి 2లో

## 607 అసిస్టెంట్ ప్రొఫెసర్ల భర్తీకి నోటిఫికేషన్

జులై 10 నుంచి 17వ తేదీ వరకు దరఖాస్తులకు అవకాశం

ప్రజాపక్షం/హైదరాబాద్



రాష్ట్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల్లో వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 607 అసిస్టెంట్ ప్రొఫెసర్ల భర్తీకి మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు శనివారం నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందుకు సంబంధించి జూలై 10 నుంచి 17 తేదీ వరకు సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించనునున్నారు.. ఒకటి కన్నా ఎక్కువ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలనుకునే అభ్యర్థులు ఒక్కో ఒక్కో పోస్టుకు వెర్వేరుగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని నోటిఫికేషన్‌లో

తరువాయి 2లో

## 'మహా'న్యూస్ కార్యాలయంపై బిఆర్‌ఎస్ శ్రేణులు దాడి

> మహాటీవీ ఆఫీసుపై దాడి హేయమైన చర్య. తీవ్రంగా ఖండిస్తున్నా. ప్రజాస్వామ్యంలో ఇటువంటి దాడులు సమర్ధనీయం కాదు : సిఎం రేవంత్‌రెడ్డి





- కంప్యూటర్లు, ఫర్నీచర్లు, కెమెరాలు ధ్వంసం
- ఫోన్‌ట్యాపింగ్ కేసులో కెటిఆర్‌పై అనుచిత కథనాలు ప్రసారం చేశారంటూ ఆగ్రహం
- కేసు నమోదు చేసిన జూబ్లీహిల్స్ పోలీసులు
- ఛానల్ కార్యాలయాన్ని సందర్శించిన డిప్యూటీ సిఎం, మంత్రులు, నారాయణ, పలువురు నేతలు

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలుగు న్యూస్ ఛానల్ 'మహా న్యూస్' ప్రధాన కార్యాలయంపై బిఆర్‌ఎస్ శ్రేణులు దాడికి పాల్పడ్డారు. ఆఫీస్ డోర్లు, స్టూడియోతో పాటు కార్యాలయం బయట నిలిపి ఉంచిన కార్లపై బండరాళ్లు వేసి ధ్వంసం చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావుపై అనుచిత కథనాలు ప్రసారం చేశారని ఆరోపిస్తూ గురువారం మధ్యాహ్నం బిఆర్‌ఎస్‌పి అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ ఆధ్వర్యంలో సుమారు 50 మంది కార్యకర్తలు జూబ్లీహిల్స్‌లో ఉన్న మహా న్యూస్ ప్రధాన తెలుగు న్యూస్ కార్యాలయం వద్దకు చేరుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ నిరసన కాస్త ఉద్రిక్తతకు దారి తీసింది. ఈ నేపథ్యంలో బిఆర్‌ఎస్ శ్రేణులు ఒక్కసారిగా న్యూస్ చానల్ కార్యాలయంపై భౌతిక దాడికి పాల్పడ్డారు. కార్యాలయం ఆవరణలో ఉన్న కార్లను బండరాళ్లతో ధ్వంసం చేశారు. అక్కడితో ఆగకుండా సెక్యూరిటీ గార్డులపై దాడికి పాల్పడి కార్యాలయంలోకి చొరబడ్డారు. కార్యాలయంలోపల కంప్యూటర్లు, ఫర్నీచర్‌లను, కెమెరాలను, కిటికి అద్దాలను పగులగొట్టారు. సుమారు అరగంట పాటు బిఆర్‌ఎస్ కార్యకర్తలు వీరంగం సృష్టించారు. మహాన్యూస్ టివి సెక్యూరిటీగార్డులు, సిబ్బంది, కొంత మంది జర్నలిస్టులు బిఆర్‌ఎస్ కార్యకర్తలను నివారించేందుకు విఫలయత్నం చేశారు. సమాచారం

తరువాయి 2లో

### దాడి హేయం : సిపిఐ

మహాటివిపై బిఆర్‌ఎస్ కార్యకర్తలు దాడికి పాల్పడడం హేయకరమని సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ అన్నారు. ప్రజాస్వామ్యంలో కీలక పాత్ర మీడియాదే అన్నారు. బిఆర్‌ఎస్ ఉద్యమానికి ఊపిరి అద్దింది వార్త సంస్థలేనని ఆలాంటి వాటిపై దాడికి పాల్పడడం నీచపు ఆలోచన బిఆర్‌ఎస్‌కు రావడం శోచనీయమన్నారు. బిఆర్‌ఎస్ న్యాయకత్తం తక్షణమే స్పందించి దాడికి పాల్పడితే ఆ పార్టీ కార్యకర్తలతే తక్షణమే మహాటివికి క్షమాణలు చెప్పాలి, ఆ పార్టీ వారు కాకపోతే దానిని స్పష్టం చేయాల్సిన అవసరముందన్నారు. మౌనంగా ఉండడమంటే బిఆర్‌ఎస్ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే కాకుండా వారి ఉద్యమానికి ఊపిరి పోసిన మీడియా సంస్థల గొంతు నొక్కిన వారు అవుతారని

తరువాయి 2లో

## సమసమాజానికి పునాదులు వేసిన పివి

మాజీ ప్రధానిని కొనియాడిన ప్రముఖులు

104వ జయంతి సందర్భంగా ఘననివాళులు

ప్రజాపక్షం/హైదరాబాద్



బహుభాషా కోవిదుడు, ఆర్థిక సంస్కరణల పితామహుడు మాజీ ప్రధాన మంత్రి దివంగత భారత రత్న పి.వి.నరసింహారావుకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, మంత్రులు, ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు ప్రజా సంఘాల నేతలు ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన ప్రధానిగా దేశ ప్రజలకు అందించిన సేవలను స్మరించుకున్నారు. సిఎం రేవంత్‌రెడ్డి జూబ్లీ హిల్స్‌లోని తన నివాసంలో పివి నరసింహారావు చిత్ర పటానికీ పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. మాజీ ప్రధాని పి.వి.నరసింహారావు 104వ జయంతి సందర్భంగా హైదరాబాద్ నెక్లెస్‌రోడ్‌లోని పివి ఘాట్ వద్ద శనివారం ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, గడ్డం వివేక్ వెంకటస్వామి, మాజీ మంత్రి కె.జానారెడ్డి, ఎంపి మల్లు రవి, బిజెపి ఎంపిలు డాక్టర్ కె.లక్ష్మణ్, ఈటల రాజేందర్, పలువురు పార్లమెంట్ సభ్యులు, ఎంఎల్‌సిలు, ఎంఎల్‌ఎలు,మాజీ ఎంపిలు, మాజీ మంత్రులు, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపి కెవిపి రామచంద్రరావు, మాజీ ఎంఎల్‌సి పొంగులేటి సుధాకర్‌రెడ్డి,పివి కుటుంబ సభ్యులు, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన, తదితరులు నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా పి వి సప్తాహం పోస్టర్‌ను మంత్రులతో కలిసి డిప్యూటీ సిఎం ఆవిష్కరించారు.

**సంఘసంస్కర్త పి.వి : ఉపముఖ్యమంత్రి**

ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ సమ సమాజానికి పునాదులు వేసిన సంఘ సంస్కర్త పివి నరసింహారావు

తరువాయి 12లో

## అధికారుల అలసత్వం... కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం

- ఆధునీకరణ పేరుతో అస్తవ్యస్తంగా మారిన పెద్దపల్లి రైల్వే స్టేషన్
- నిలువ నీడ లేక అల్లాడుతున్న ప్రయాణికులు
- అధికారులు ప్రజాప్రతినిధులు పలుమార్లు సందర్శించినా అభివృద్ధి పనులలో పురోగతి శూన్యం
- పాత బిల్డింగ్ పడగొట్టడానికే సంవత్సరం పట్టింది.. మరి కొత్త బిల్డింగ్ నిర్మాణం పూర్తయ్యేదెన్నడో?






ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి

అమృత్ భారత్ రైల్వే స్టేషన్ల ఆధునీకరణలో భాగంగా పెద్దపల్లి రైల్వే స్టేషన్‌లో అభివృద్ధి పనులను దేశ ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభించి సంవత్సరకాలం దాటుతున్నా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా అమృత్ భారత్ స్కీం కాస్త కాంట్రాక్టర్ల స్కామ్ అయింది. పెద్దపల్లి రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు అటకెక్కాయి. అధికారుల నిర్లక్ష్యమో, కాంట్రాక్టర్ల అలసత్వమో ఆధునీకరణ పనుల పేరుతో పెద్దపల్లి రైల్వే స్టేషన్ అస్తవ్యస్తంగా మారింది. నిలువ నీడ లేక ప్రయాణికులు అల్లాడుతున్నారు. జిల్లా కేంద్రంలోని పెద్దపల్లి రైల్వే జంక్షన్ లో నిత్యం వేలాదిమంది ప్రయాణికులు రైళ్లలో రాకపోకలు

తరువాయి 12లో

## బంగ్లాదేశ్ జనపనార దిగుమతులపై ఆంక్షలు


అక్రమ వాణిజ్యానికి పాల్పడడంతో భారత్ చర్యలు

జనపనార అనుబంధ ఫైబర్ ఉత్పత్తుల దిగుమతులపైనా ఆంక్షలు కొనసాగింపు




**న్యూఢిల్లీ :** బంగ్లాదేశ్‌కు చెందిన సరఫరాదారులు న్యాయబద్ధంకాని అక్రమ వాణిజ్య చర్యలకు పాల్పడుతూ ఉండటంతో జనపనార దిగుమతులపై భారత్ ఆంక్షలు విధించింది. జనపనా అనుబంధ ఫైబర్ ఉత్పత్తుల దిగుమతులపై కూడా కేంద్రం ఆంక్షలు అమలు చేసింది. భారత రైతాంగానికి హానిచేసే యాంటీ–డంపింగ్ సుంకాలు చెల్లించకుండా ఎగవేసేందుకు అన్యాయమైన పద్ధతులలో ఎగుమతిదారులు వ్యవహరిస్తున్నందుకు గాను కేంద్ర ప్రభుత్వం ఆ ఆంక్షలు పెట్టిందని ఈ వ్యాపారంతో సన్నిహిత సంబంధాలున్న వర్గాలు శనివారంనాడు

తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## ఫ్రాన్స్‌లో నేటి నుండీ ధూమపాన నిషేధం



ప్యారిస్ : బహిరంగ ప్రదేశాల్లో ధూమపానాన్ని ఫ్రాన్స్ నిషేధించింది. ఆదివారం నుండీ ఈ నిషేధం అమలులోకి వస్తుంది. ఈ మేరకు ప్రభుత్వం శనివారంనాడు అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. ఉద్యానవనాలు, సముద్రతీర ప్రాంత పర్యాటక ప్రదేశాలు, బస్ స్టాప్‌లలో ధూమపాన నిషేధం అమలు చేస్తారు. అదే విధంగా చిన్న పిల్లల ఆరోగ్యాన్ని కాపాడేందుకుగాను పాఠశాలల వెలుపలా, ఈతకొలనుల వెలుపలా, గ్రంథాలయాల వెలుపలా కూడా ధూమపాన నిషేధం విధించారు. ఐతే ఎలక్ట్రానిక్ సిగరెట్‌లపై నిషేధం ఉందా?లేదా? అనే విషయాన్ని ఈ ఉత్తర్వులలో స్పష్టంగా చెప్పలేదు. ''పిల్లలు తిరిగే ప్రదేశాలనుండి పొగాకును పూర్తిగా నిర్మూలించాలి'' అని ఫ్రాన్స్ కుటుంబ, ఆరోగ్యశాఖా మంత్రి కేథరీన్ వౌత్రిన్ చెప్పారు. ఐతే కేఫ్‌లలో టెర్రాస్ ప్రాంతాలను మాత్రం ఈ ఉత్తర్వులనుండి మినహాయించారు. ఫ్రాన్స్‌లో ప్రతి పదిమందిలోనూ ఆరుగురు పౌరులు (62 శాతం మంది) ధూమపానంపై నిషేధం విధించేందుకు సుముఖత వ్యక్తం చేశారని ఇటీవల ఒక అధ్యయనం వెల్లడించింది.

# ఇరాన్ ప్రజల కన్నీటి వీడ్కోలు

### ఇరాన్ సైనిక జనరల్స్,సైంటిస్టులు సహా 60 మందికి ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు



టెహ్రాన్ : ఇరాన్‌పై ఇజ్రాయెల్ చేసిన 12 రోజుల యుద్ధంలో మరణించిన ఐఆర్‌జిసి (ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ కోర్) ఉన్నతస్థాయి సైనిక జనరల్స్,అణుశాస్త్రవేత్తలు సహా మొత్తం 60 మందికి శనివారంనాడు ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు జరిగాయి. వీరిలో నలుగురు పిల్లలు, నలుగురు మహిళలు ఉన్నారు. కాల్పుల విరమణ తర్వాత ప్రశాంత వాతావరణం మధ్య ఈ ఖనన కార్యక్రమాలు నిర్వహించారు. రాజధాని టెహ్రాన్‌లో భారీస్థాయిలో అంతిమయాత్ర కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఇరాన్‌లో వేలాదిమంది ప్రజలు వీధుల్లోకి వచ్చి అమెరికా, ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ రెండు దేశాలకు మరణశిక్ష విధించాలని నినాదాలు చేశారు. నల్లదుస్తులు ధరించి ప్రజలు ఈ అంతిమయాత్రలో పాల్గొన్నారు.

ఇజ్రాయెల్ గగనతల దాడుల్లో మరణించిన ఐఆర్‌జిసి సైనిక దళాల ప్రధానాధిపతి జనరల్ అమిర్ అలీ హజిటాదేహ్, ఇతర నాయకుల భౌతిక దేహాలను ట్రక్కులపై ఉంచి ఊరేగింపుగా తీసుకువెళ్ళి ప్రభుత్వ లాంఛనాలతో ఖననం చేశారు. ఈ అంతిమయాత్ర ప్రయాణమార్గంలో ఆజాదీ వీధుల్లో వేలాదిమంది ప్రజలు గుమిగూడి ''డెత్ ఆఫ్ అమెరికా...డెత్ ఆఫ్ ఇజ్రాయెల్....'' అంటూ నినాదాలు చేశారు. జూన్ 13వ తేదీన ఇజ్రాయెల్ చేసిన మొదటిరోజు దాడుల్లోనే ఐఆర్‌జిసి టాప్ కమాండర్స్ సలామి, హజిజదేహ్‌లు మరణించారు. టెహ్రాన్ అణు కార్యక్రమ కేంద్రాలను ధ్వంసం చేసే లక్ష్యంగా దాడులు చేసినట్లు ఐ డి ఎఫ్ ప్రకటించింది. ఈ అంతిమయాత్ర గురించి ఇరాన్ సర్వాధినేత ఖమేనీ నుండి ఎలాంటి అధికారిక ప్రకటనా వెలువడలేదు. జూన్ 11 యుద్ధం ప్రారంభం కావడానికి రెండు రోజులముందుగా ఖమేనీ ప్రజలకు కనిపించారు. ఈ అంత్య క్రియల కార్యక్రమానికి విదేశీ మంత్రిత్వశాఖ, విదేశీమంత్రి అరాఘ్చి నాయకత్వం వహించారు. ఖమేనీ ఇప్పటికీ నేలమాళిగలో అజ్ఞాతంలో ఉన్నారని భావిస్తున్నారు. రివల్యూషనరీ గార్డ్స్ కోర్‌కు చెందిన విదేశీశాఖాధిపతి జనరల్ ఎస్మాయిల్ ఖ్వానీ, ఖ్యుడ్స్ ఫోర్స్ జనరల్ అలీ షంఖానీలు ఈ అంతిమయాత్రలో పాల్గొన్నారు. అలీ ఖమేనీకి షంఖానీ ప్రధాన సలహాదారుడు. మొదటిరోజు ఇజ్రాయెల్ చేసిన దాడుల్లో ఆయన గాయపడ్డారు. 1979లో ఇరాన్‌లో ఇస్లాం మత విప్లవం వచ్చిన తర్వాత ఐఆర్‌జిసి ఆవిర్భవించింది. అప్పటినుండీ దేశీయ భద్రత, విదేశీ ప్రమాదాల నుండి దేశానికి భద్రత ఇవ్వడంలో ఐఆర్‌జిసి కీలకపాత్ర వహిస్తోంది. ఇరాన్‌లోని అత్యంత కీలకమైన విధ్వంస ఆయుధాలు దీని అధీనంలోనే ఉంటాయి. గాజా స్ట్రిప్‌లో ఇజ్రాయెల్–హమాస్ మధ్య రెండుసార్లు జరిగి యుద్ధంలో ఈ ఆయుధాలను ఇరాన్ ఉపయోగించింది. మొత్తం 30 మంది ఇరానియన్ కమాండర్లను యుద్ధంలో హతమార్చినట్లు ఇజ్రాయెల్ ప్రకటించింది. 720 సైనిక వ్యవస్థల లక్ష్యాలను ధ్వంసం చేశామని, 1000 మందికిపైగా ఇరానీయులు యుద్ధంలో మరణించారని, వీరిలో 450 మంది సామాన్య ప్రజలు కూడా ఉన్నారని వాషింగ్టన్ కేంద్రంగా పనిచేసే మానవహక్కుల కార్యకర్తల గ్రూపు ఒక ప్రకటనలో తెలియజేసింది. ఈ యుద్ధంలో ఇరాన్ 550 క్షిపణులు ప్రయోగించగా, వీటిల్లో చాలావాటిని గాల్లోనే ఇజ్రాయెల్ ధ్వంసం చేసింది. ఇజ్రాయెల్‌లో యుద్ధంవల్ల 28 మంది మరణించారు.

**ఐఎఇఎ అధిపతి గ్రాస్సీ బహిష్కరణ**

ఐఎఇఎ (అంతర్జాతీయ అణుశక్తిసంస్థ) డైరెక్టర్ జనరల్ రాఫెల్ గ్రాస్సీకి ఇరాన్ బహిష్కారం విధించింది. ఇంకెప్పటికీ ఆయనను ఇరాన్ దేశంలోకి ప్రవేశించనీయకూడదని ఆ దేశ పార్లమెంటు అధికారి ప్రకటించారు. ది. అమెరికాకు అనుకూలంగా వారి అడుగులకు మడుగులొత్తేవిధంగా ఐఎఇఎ కూడా వాస్తవాలు మరచి ప్రకటనలు చేసిందని, ఏకపక్ష విధానాలను అవలంబించిందని ఇరాన్ తప్పుపట్టింది. అదేవిధంగా ఇరాన్‌లోని అణు కేంద్రాలలో ఇకమీదట నిఘా కెమేరాలను ఏర్పాటు చేయకూడదనీ, వాటిని అనుమతించబోమనీ ఇరాన్ పార్లమెంటు డిప్యూటీ స్పీకర్ హమీద్ రెజీ హాజీ బాబాయ్ ఒక ప్రకటన చేశారు. ఇరాన్ అన్ని అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించిందని యుద్ధానికి రెండు రోజుల ముందుగా గ్రాస్సీ ఒక ప్రకటన చేశారు. ఇజ్రాయెల్ పాలనా వ్యవస్థల నుండి అతి సున్నితమైన సమాచారాన్ని సేకరించినందుకుగాను గ్రాస్సీకి ఇరాన్ ఈ బహిష్కరణ విధించింది.

## వాణిజ్య వివాదాల పరిష్కారానికి
# డబ్ల్యుటిఓకు ప్రత్యామ్నాయ సంస్థ!

### యూరప్ దేశాల మల్లగుల్లాలు





బ్రస్సెల్స్: అమెరికాతో వాణిజ్య చర్చలకు గడువుతేదీ దగ్గరపడుతున్నప్పటికీ యూరోపియన్ యూనియన్ నాయకుల మధ్య ఇంకా విభేదాలు పరిష్కారం కాలేదు. సుంకాలకు సంబంధించి ఇ.యు నాయకుల భిన్నాభిప్రాయాలు కొనసాగుతూనే ఉన్నాయి. దిగుమతులలో ఆటోమొబైల్స్‌పై సుంకాలు వివాదాస్పదాంశంగానే ఉంది. ఐతే వాణిజ్య వివాదాలను పరిష్కరించడానికి డబ్ల్యుటిఎఫ్‌కు ప్రత్యామ్నాయంగా మరొక ప్రపంచ వాణిజ్య సంస్థను ఏర్పాటు చేయాలన్న ఆలోచన యూరప్ ముందుకు వచ్చింది. యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వోండర్‌లేయన్ గురువారం నాటి బ్రస్సెల్స్ ఇ.యు కౌన్సిల్ సమావేశంలో ఈ ప్రతిపాదన చేసినట్లు జర్మన్ ఛాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్ చెప్పారు. జపాన్,బ్రిటన్ సహా ఇతర ఆసియా ఆర్థిక వ్యవస్థలను కూడా ఏకం చేసి ఒక సిపిటిపిపి (ట్రాన్స్–పసిఫిక్ భాగస్వామ్యదేశాలతో సమగ్ర వాణిజ్య,ప్రగతిశీల ఒప్పందం) సభ్యదేశాలమధ్య వాణిజ్య కూటమి ఏర్పాటు చేస్తే బాగుంటుందని ఒక కొత్త ఆలోచనను వోండర్‌లేయన్ అందరి ముందూ ఉంచారు. యూరప్‌లో వాణిజ్యం చేసేందుకు కొత్త ఆశలు పెంచుకుంటున్న చైనా కూడా బహుశా ఇలాంటి ఆలోచనలకు ఊతం ఇచ్చే అవకాశం ఉంది. 2016లో చేసిన సిపిటిపిపిని కొన్ని కారణాలవల్ల అమెరికా ఆమోదించలేదు.

పెంచిన సుంకాల అమలుకు ట్రంప్ ఇచ్చిన గడువు పది రోజులే ఉండటంతో యూరప్ వాణిజ్యానికి ఎలాంటి విఘాతం కలగకుండా తక్షణ ఒప్పందం చేసుకోవాలా? లేక మరింత భద్రతతో కూడిన ఒప్పందం చేసుకోవడానికి మరోమార్గాన్ని అవలంబించాలా? అని నాయకులు ఆలోచనలో పడ్డారు. ఇప్పటికే అనేకసార్లు అమెరికా–యూరోపియన్ యూనియన్ మధ్య చర్చలు జరిగాయి. యూరప్ నుండి అమెరికాకు దిగుమతయ్యే షాంపైన్‌సహా అనేక వస్తువులపై ట్రంప్ భారీస్థాయిలో సుంకాలు వేశారు. ఐతే జూలై 9వ తేదీతో ట్రంప్ ఇచ్చిన గడువు ముగియనున్నది. ఇ.యు కౌన్సిల్ సమావేశంలో ఇ.యు నాయకులమధ్య అమెరికాతో వాణిజ్య చర్చలకు సంబంధించి భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. యూరోపియన్ యూనియన్‌పై 50 శాతం సుంకాలు విధిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించిన తర్వాత ఆ పెనుభారాలను వాయిదా వేస్తున్నట్లు ప్రకటన చేశారు. ఈ విధంగా ట్రంప్ రెండుసార్లు టారిఫ్‌లను వాయిదా వేశారు. ట్రంప్ అనుసరిస్తున్న వైఖరివల్ల ట్రాన్స్–అట్లాంటిక్ మధ్య దూరం పెరిగి యూరప్ దేశాలలో అమెరికాపై విశ్వసనీయత తగ్గుముఖం పడుతున్నది. విపరీతంగా సుంకాలు పెంచడం, మళ్ళీ వాయిదా వేయడం, మారు ప్రకటనలు చేయడం గందరగోళంగా మారింది.

## మీకు ఒప్పందం కావాలా? అయితే..
## ఖమేనీని గౌరవంగా సంబోధించండి

### అమెరికాకు ఇరాన్ హెచ్చరిక



**టెహ్రాన్ :** అమెరికాతో అణు ఒప్పంద చర్చలు జరపడానికి ఇరాన్ తాజా మెలిక పెట్టింది. ''మీకు అణు ఒప్పందం కావాలా? ఐతే మా నాయకుడు ఆయెతుల్లా సయ్యద్ అలీ ఖమేనీని గౌరవంగా సంబోధించండి, ఆయనకు మర్యాద ఇచ్చి మాట్లాడండి'' అని ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ అరాఘ్చి ఎక్స్ వేదికగా శనివారంనాడు ప్రకటించారు. ''అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తమ సర్వోన్నత నాయకుడిపట్ల చాలా అమర్యాదకరంగా, అగౌరవంగా మాట్లాడుతున్నారు, ఆయనకు ఏ మాత్రం గౌరవం ఇవ్వకుండా మాట్లాడుతున్నారు, ఒప్పందం కావాలంటే సమాన గౌరవం ఉండాలి'' అని అరాఘ్చి తెగేసి చెప్పారు. ట్రంప్ స్వరంలో మార్పు రావాల్సిన అవసరం ఉందన్నారు. ఒక బలమైన ఒప్పందం కోరుకున్నప్పుడు గౌరవం ఉండాలి, రెండు దేశాలమధ్య పరస్పర గౌరవం, సమాన మర్యాదలుండాలన్నారు. వచ్చేవారం ఇరాన్‌తో అణు ఒప్పందంపై చర్చలు ఉంటాయని ట్రంప్ రెండు రోజుల క్రితం ప్రకటించారు. వెంటనే అరాఘ్చి కూడా ఒక ప్రకటన చేస్తూ ఇప్పట్లో అణు ఒప్పందంపై చర్చల ప్రశ్నేలేదని స్పష్టం చేశారు. కానీ తాజాగా ఖమేనీని మర్యాదగా సం బోధిస్తే ఒప్పంద చర్చలకు అవకాశం ఉంటుందని కొత్త మెలిక పెట్టారు.యుద్ధ సమయంలో ఖమేనీ నేలమాళిగలో ఎక్కడ దాక్కున్నారో తనకు చాలా ఖచ్చితంగా తెలుసుననీ, ఇజ్రాయెలీ సైనిక దళాలు ఆయనను వెతికి పట్టుకుని అత్యంత అవమానకరమైన పద్ధతులలో, దారుణంగా చంపకుండా తానే అడ్డుకున్నానని ట్రంప్ శుక్రవారంనాడు చేసిన ప్రకటించారు. అదేవిధంగా ఇరాన్ గను కమితమీరినస్థాయిలో ఇంకా ఇంకా యురేనియం శుద్ధి కార్యక్రమాలను కొనసాగించినట్లయితే మరో మాట లేకుండా ఇరాన్‌పై బాంబులు కురిపిస్తామని కూడా ట్రంప్ చెప్పడంతో ఇరాన్ తీవ్రస్థాయిలో మండిపడింది.

# కెనడాతో వాణిజ్య చర్చలూ రద్దు చేసిన అమెరికా

వాషింగ్టన్ : కెనడాతో అన్నిరకాల వాణిజ్యచర్చలను అమెరికా రద్దు చేసింది. అమెరికా టెక్ కంపెనీలమీద డిజిటల్ టాక్స్ విధించినందుకుగాను ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నారు. ఉభయతారకంగా చర్చలకు వీలుగా ఈ పన్నును 30 రోజులు వాయిదా వేయాలని అమెరికా కోరినప్పటికీ, కెనడా తిరస్కరించింది. దీంతో వైట్‌హౌస్‌లో నేషనల్ ఎకనామిక్ కౌన్సిల్ డైరెక్టర్ కెవిన్ హాస్సెట్ ఒక ప్రకటన చేస్తూ,ఈ విధంగా భారీ పన్నులు విధించిన తర్వాత అమెరికా కంపెనీలు ఇక కెనడాలో ఉండాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ప్రత్యక్ష వాణిజ్య దాడికి తెరతీసేవిధంగా అమెరికా టెక్నాలజీ కంపెనీలపై డిజిటల్ పన్నును అమలు చేస్తున్నట్లు కెనడా ప్రకటించింది. అమెజాన్, గూగుల్, మెటా, ఊబెర్ తదితర కంపెనీలు ఈ డిజిటల్ టాక్స్ జాబితాలో ఉన్నాయి. అమెరికాపై దారుణమైన పన్నులు విధించినందువల్ల అన్ని వాణిజ్య చర్చలనూ తమ ప్రభుత్వం రద్దు చేసుకుందని ట్రంప్ చెప్పారు. యూరోపియన్ యూనియన్ అనుసరిస్తున్న విధానాలను కెనడా కూడా కాపీ కొడుతోందని ఆయన విమర్శించారు. ఐతే ఈ పరిస్థితులు సంభవించడానికి ముందుగా కెనడా ప్రధానమంత్రి మార్క్ కార్నీ, ట్రంప్ ఇద్దరూ జులై 16 నాటికి ఒక సురక్షితమైన ఒక కొత్త ఆర్థిక ఒప్పందం చేసుకోవాలని మాట ఇచ్చిపుచ్చుకున్నారు. ఇంతలోనే ఈ పరిణామాలు సంభవించాయి.కార్నీ మే నెలలో వైట్‌హౌస్‌ను సందర్శించారు. గతవారం జి–7 సదస్సు నిమిత్తం కెనడాలోని ఆల్బెర్టాలో ట్రంప్ కూడా గతవారం పర్యటించారు. వాణిజ్య చర్చలు, ఇతర సంప్రదింపులకు 30 రోజులు గడువును ఆ ఇద్దరు నాయకులూ అంగీకరించారు కూడా.

## భారత్ ఫ్యూచర్ సిటీ

(మొదటి పేజీ తరువాయి)

తీర్చడంలో దివంగత మాజీమంత్రి పి.జనర్ధన్ రెడ్డి (పిజెఆర్) కీలక పాత్ర పోషించారని అని కొనియాడారు. పిజెఆర్ కృషి వల్లే హైదరాబాద్‌కు గోదావరి, కృష్ణా జలాలు వచ్చాయని తెలిపారు. పేదల నాయకుడిగా పిజెఆర్ గొప్పపేరు సంపాదించారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. ప్రజలు ఎప్పుడు పిలిచినా పలికే నాయకుడు పిజెఆర్ అన్నారు. గతంలో పిజెఆర్ ఇల్లు ఒక జనతా గ్యారేజ్‌లా కనిపించేదని గుర్తుచేసుకున్నారు. జంటనగరాల్లో 25 ఏళ్ల పాటు పిజెఆర్ శకం నడిచిందన్నారు. పిజెఆర్ మంత్రిగా ఉన్నప్పుడే హైటెక్ సిటీకి పునాది పడిందన్నారు. హైటెక్ సిటీగా చెప్పుకునే ఈ ప్రాంతం అభివృద్ధి పథం వైపు నడుస్తూ ప్రపంచ దిగ్గజ కంపెనీలకు వేదికగా మారిన శేరిలింగంపల్లి, గచ్చిబౌలి ప్రాంతం గతంలో ఖైరతాబాద్ నియోజకవర్గంలో ఒక భాగమని, పిజెఆర్ కృషితోనే హైటెక్ సిటీ గచ్చిబౌలికి మంజూరైందన్నారు. నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి పునాది వేస్తే చంద్రబాబు దాన్ని మరోస్థాయికి తీసుకెళ్లారన్నారు. కాలక్రమంలో దీన్ని మహారాష్ట్రకు తరలించాలని కుట్రలు జరిగినా పిజెఆర్ అడ్డుపడ్డారని గుర్తు చేసుకున్నారు. భాగ్యనగర అభివృద్ధికి ఎవరూ అడ్డుపడినా ఊరుకునేది లేదని సిఎం రేవంత్ రెడ్డి హెచ్చరించారు. ఎన్నికల వరకే రాజకీయాలు, ఆ తర్వాత అభివృద్ధిపైనే తమ దృష్టి అని స్పష్టం చేశారు. హైదరాబాద్‌ను కాలుష్య రహితంగా మార్చాలని కోరారు. అభివృద్ధిలో స్పష్టమైన ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నామని అన్నారు. రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులను తెచ్చేందుకు కృషి చేస్తున్నామని వెల్లడించారు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను కొందరూ అడ్డుకునే కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. రాజకీయం ముసుగులో అవాంతరాలు కల్పిస్తున్నారని ముఖ్యమంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

**మాకు మెట్రో ఇవ్వరా?, ఏం పాపం చేశాం.. ఎందుకీ వివక్ష..**

తెలంగాణపై కేంద్రానికి ఎందుకీ ఈ వివక్ష అని సిఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. చెన్నై, బెంగళూరుకు మెట్రో ఇచ్చారని, తాము మెట్రో, మూసీ, ట్రిపుల్ ఆర్ అడిగితే కేంద్రం వివక్ష చూపుతోందన్నారు. తమ నివేదకలో ఏమైనా లోపాలు ఉన్నాయా?, ఏం పాపం చేశామో చెప్పాలని రేవంత్ రెడ్డి నిలదీశారు. తెలంగాణ ప్రజలు బిజెపికి 8 మంది ఎంపిలను ఇచ్చారన్నారు. కేంద్రం నుంచి బిజెపి నేతలు ఏం తెచ్చారో చెప్పగలరా అని సిఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. చిన్న చిన్న నగరాలు అద్భుతంగా మెట్రోను విస్తరించుకుంటున్నాయన్నారు. మా నివేదికలో ఏమైనా లోపాలు ఉన్నాయా?, మేం ఏ పాపం చేశామని, రెండో స్థానంలో ఉన్న మెట్రో తొమ్మిదో స్థానానికి పడిపోయిందన్నారు. మెట్రో, మూసీ, ట్రిపుల్ ఆర్ ప్రాజెక్టులకు కేంద్రం సహకరించడం లేదని సిఎం రేవంత్ రెడ్డి కేంద్రంపై అసహనం వ్యక్తం చేశారు. రేపు అమిత్ షా తెలంగాణకు వస్తున్నారని, మరోసారి కలిసి విజ్ఞప్తి చేస్తామన్నారు. రాజకీయాలు వదిలేసి హైదరాబాద్ అభివృద్ధికి కలిసి పనిచేద్దామని సిఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. తాను దాదాపు 35 సార్లు ఢిల్లీ వెళ్లానని, ప్రధాని సహా అనేకమంది కేంద్ర మంత్రులను కలిశానని, కానీ రాష్ట్రానికి కేంద్రం నుంచి చెప్పుకోదగ్గ ప్రాజెక్టులు రాలేదన్నారు. హైదరాబాద్‌కు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఏం ఇచ్చారని ప్రశ్నించారు. ఈ విషయం కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆలోచించుకోవాలన్నారు.



**హైదరాబాద్‌లో ఎలక్ట్రిక్ వాహనాలకు పన్ను మినహాయింపు..**

భవిష్యత్ హైదరాబాద్ కోసం తమ ప్రభుత్వం స్పష్టమైన ప్రణాళికతో ఉందని రేవంత్ రెడ్డి వివరించారు. ఢిల్లీలో కాలుష్యం, చెన్నైలో వరదలు, బెంగళూరులో ట్రాఫిక్ సమస్యల నుంచి పాఠాలు నేర్చుకొని హైదరాబాద్‌ను తీర్చిదిద్దుతామని అన్నారు. ఇందులో భాగంగా నగరంలో కాలుష్యాన్ని తగ్గించేందుకు డీజిల్ బస్సుల స్థానంలో 3 వేల ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెడతామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ, ఎలక్ట్రిక్ వాహనాలు కొనుగోలు చేసే వారికి పన్ను మినహాయింపు ఇస్తున్నట్లు తెలిపారు. డీజిల్ బస్సులను జిల్లాలకు తరలించాలని ఆదేశించామని తెలిపారు. ఆటోలు కూడా సిఎన్‌జి, ఎలక్ట్రిక్ వెర్షన్‌లోకి మారాలని సూచించారు. హైదరాబాద్ నగరంలో అనేక నాలాలు, చెరువులు కబ్జాకు గురయ్యాయని చెప్పారు. బతుకమ్మకుంటను కొందరు బిఆర్‌ఎస్ నేతలు కబ్జా చేస్తే తమ ప్రభుత్వం దానిని విడిపించిందన్నారు. కేవలం అక్రమ నిర్మాణాలను మాత్రమే హైడ్రా ద్వారా కూల్చివేసినట్లు స్పష్టం చేశారు. ఎన్ కన్వెన్షన్‌లో రెండెకరాలను ప్రభుత్వానికి స్వచ్ఛందంగా అప్పగించి, సినినటుడు నాగార్జున నిజమైన హీరో అనిపించుకున్నారని ప్రశంసించారు. రంగారెడ్డి జిల్లాకు శ్రీధర్‌బాబును ఇన్‌చార్జి మంత్రిగా చేశామని, రంగారెడ్డి జిల్లా అభివృద్ధిని మరింత ముందుకు తీసుకెళ్లాలన్నారు.

**కంచె గచ్చిబౌలి భూముల విషయంలో తప్పుడు ప్రచారం..**

కంచె గచ్చిబౌలి భూముల విషయంలో తప్పుడు ప్రచారం చేశారని సిఎం రేవంత్ అన్నారు. కంచ గచ్చిబౌలిలో కొత్త పరిశ్రమల ఏర్పాటు ద్వారా సుమారు 5 లక్షల కొత్త ఉద్యోగాలు అందుబాటులోకి వస్తాయని హామీ ఇచ్చారు. తమ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి, పెట్టుబడులను అడ్డుకోవాలని బిఆర్‌ఎస్ కుట్ర చేస్తోందని మండిపడ్డారు. హైదరాబాద్ నగరానికి కాలుష్యమే ఇపుడు యమపాశం అయ్యిందని ఆవేదన వ్యక్తం చేశారు.

## భర్తీకి నోటిఫికేషన్

(మొదటి పేజీ తరువాయి)

వెల్లడించారు. ఈ మొత్తం 607 పోస్టుల భర్తీ చేయనుండగా మల్టీ జోన్–1లో 379 పోస్టులు .. మల్టీ జోన్ –2లో 228 పోస్టులు ఉన్నాయి. పోస్టకు ఎంపికైన అభ్యర్థులకు నెలవారీ జీతం యూనివర్సిటీ గ్రాండ్ కమిషన్ నిబంధనల ప్రకారం రూ.68,900 నుంచి రూ.2,05,500 ఉంటుందని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థుల నుంచి http://mhsrb.telangana.gov.in వెబ్‌సైట్ లో జూలై 10వ తేదీ నుంచి 17 తేదీ సాయంత్రం 5 గంటల వరకు కేవలం ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని వెల్లడించారు.

## బిఆర్‌ఎస్ శ్రేణులు దాడి

(మొదటి పేజీ తరువాయి)

అందుకున్న జూబ్లీహిల్స్ పోలీసులు హుటాహుటీనా ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళన కారులను చెదరగొట్టారు. పోలీసుల రాకను గమనించిన కొంతమంది ఆందోళన కారులు అక్కడి నుంచి పారిపోగా మరికొందరిని పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. దాడి ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. సంఘటన స్థలాన్ని పోలీసు ఉన్నతాధికారులు సందర్శించి వివరాలు సేకరించారు.

**చంద్రబాబు ఖండన..**

మహాన్యూస్‌పై జరిగిన దాడిని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, మంత్రి లోకేశ్ తీవ్రంగా ఖండించారు. మీడియా సంస్థపై భౌతిక దాడులకు పాల్పడటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని వారు అభిప్రాయపడ్డారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ మహా న్యూస్ యాజమాన్యానికి, సిబ్బందికి తమ మద్దతు ప్రకటించారు.

**వ్యక్తిత్వాన్ని కించపరచవద్దు: కెటిఆర్**


బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కొన్ని మీడియా సంస్థలు, జర్నలిస్టుల వ్యవహారశైలిపై తీవ్రంగా మండిపడ్డారు. తనపై, తమ పార్టీ నాయకత్వంపై ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపిస్తూ, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు ఆయన స్పష్టం చేశారు.

కొన్ని నెలలుగా కొందరు వ్యక్తులు జర్నలిస్టుల ముసుగులో తన వ్యక్తిత్వాన్ని కించపరిచేలా పదేపదే ఆరోపణలు చేస్తున్నారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. 'జర్నలిస్టుల ముసుగులో కొందరు దుర్మార్గులు గత కొన్ని నెలలుగా నాపైనా, మా పార్టీ నాయకత్వంపైనా విషం చిమ్ముతున్నారు' అని ఆయన అన్నారు. ఇలాంటి వారి అభిప్రాయాలను, ఉనికిని తాను ఏమాత్రం ఖాతరు చేయనని ఆయన తేల్చి చెప్పారు.

**కాంగ్రెస్, బిజెపి నేతల ఖండన..**

హైదరాబాద్‌లోని మహాన్యూస్ కార్యాలయంపై దాడి ఘటన అనంతరం, శుక్రవారం పలువురు రాజకీయ ప్రముఖులు కార్యాలయాన్ని సందర్శించారు. వీరిలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఉన్నారు. వీరితో పాటు బిజెపి నాయకులు కూడా ఛానెల్‌కు మద్దతుగా తరలివచ్చారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ దాడిని తీవ్రంగా ఖండించారు. ఇది అత్యంత హేయమైన చర్య అని ఆయన అభివర్ణించారు. ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభమైన మీడియాపై ఇలాంటి దాడులు జరగడం దురదృష్టకరమని అన్నారు. అనంతరం, దాడిలో ధ్వంసమైన ఫర్నిచర్, పగిలిపోయిన కిటికీల అద్దాలు, దెబ్బతిన్న కార్లను ఆయన ఇతర నేతలతో కలిసి పరిశీలించారు. దాడి వల్ల జరిగిన నష్టం గురించి ఛానెల్ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. మరోవైపు, ఈ దాడి ఘటనపై పోలీసుల దర్యాప్తు ముమ్మరంగా కొనసాగుతోంది. ప్రముఖ తెలుగు న్యూస్ ఛానెల్ 'మహా న్యూస్' కార్యాలయంపై జరిగిన దాడి ఘటన తీవ్ర దుమారం రేపుతోంది. ఇది బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన గూండాల పనేనని, పత్రికా స్వేచ్ఛను అణచివేసే ప్రయత్నమేనని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్రంగా విమర్శించారు. దాడికి పాల్పడిన వారిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

### ఛానెల్‌ని సందర్శించిన టియుడబ్ల్యుజె



ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై ఓ కథనాన్ని ప్రసారం చేసిన మహా న్యూస్ ఛానెల్‌పై బిఆర్‌ఎస్ పార్టీకి చెందిన కొందరు దాడి జరిపి, విధ్వంసం సృష్టించిన సంఘటనను తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టియుడబ్ల్యుజె) తీవ్రంగా స్పందించింది. యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె. విరాహత్ అలీ, ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్(ఐజెయు) జాతీయ కార్య వర్గ సభ్యులు కల్లూరి సత్యనారాయణలు జూబ్లీహిల్స్ లోని మహా న్యూస్ ఛానెల్ కార్యాలయాన్ని సందర్శించి విధ్వంసం జరిగిన తీరును పరిశీలించారు. అనంతరం విరాహత్ అలీ మీడియాతో మాట్లాడుతూ, హింసకు దూరంగా, శాంతియుత పోరాటాలతో సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో ఇలాంటి హింసాత్మక ఘటనలు దురదృష్టకరమన్నారు. మీడియా సంస్థపై ఇనుప రాడ్లు, కర్రలు, బండరాళ్లతో హింసాత్మకంగా ఇలాంటి దాడులు జరపడం ఇది ప్రథమం అన్నారు. తెలంగాణ రాష్ట్రం మానవ హక్కుల పరిరక్షణలో, భావ ప్రకటన స్వేచ్ఛకు దేశంలో ఆదర్శంగా ఉండేలా చూడాలి కానీ, ఇలాంటి పాశవిక దాడులతో కాదని అన్నారు. ఈ సంఘటనను తమ సంఘం తీవ్రంగా ఖండిస్తుందని, పోలీసులు సమగ్ర విచారణ జరిపి చట్టపరంగా కఠిన చర్యలు చేపట్టాలని సూచించారు.

## అంబేద్కర్ సమర్థించలే

(మొదటి పేజీ తరువాయి)

సుప్రీంకోర్టు సమర్థిస్తూ ఒకే రాజ్యాంగం కింద ఐక్య భారత దేశం అనే డాక్టర్ అంబేద్కర్ దార్శనికత నుండి సుప్రీంకోర్టు స్ఫూర్తి పొందిందన్నారు. ఆర్టికల్ 370ను రద్దు చేయాలనే కేంద్ర ం నిర్ణయాన్ని ఏకగ్రీవంగా సమర్థించిన అప్పటి ప్రధాన న్యాయమూర్తి డివై.చంద్రచూడ్ నేతృత్వంలోని ఐద్యుగురు న్యాయమూర్తులతో కూడిన రాజ్యాంగ బెంచ్‌లో బిఆర్. గవాయ్ ఒకరుగా ఉన్నారు. ఆర్టికల్ 370సవాల్ చేయబడి మా ముందు ఆ పిటిషన్ విచారణ జరుగుతోంది. నేను అప్పుడు డాక్టర్ బిఆర్.అంబేద్కర్ మాటలు గుర్తు చేసుకున్నాను. 'ఒకవేళ మనం దేశాన్ని ఐక్యంగా ఉంచాలనుకుంటే మనకు ఒకే ఒక్క రాజ్యాంగం అవసరం' అని డాక్టర్ అంబేద్కర్ కార్యక్రమానికి హాజరైన మరాఠీలను ఉద్దేశించి ప్రసంగించారు.2019 ఆగష్టు 5న జమ్ము కశ్మీర్‌కు ప్రత్యేక హోదాను తొలగించి దానిని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించాలని కేంద్రం నిర్ణయించింది. సిజెఐ బిఆర్.గవాయ్ మాట్లాడుతూ రాజ్యాంగం చాలా సమాఖ్యవాదాన్ని కల్పిస్తుందని, యుద్ధ సమయాలలో దేశం సమైక్యంగా ఉండకపోవచ్చని డాక్టర్ అంబేద్కర్‌ను విమర్శించారని ఆయన చెప్పారు. అయితే రాజ్యాంగం సవాళ్లను ఎదుర్కొని, దేశాన్ని ఐక్యంగా ఉంచుతుందని ఆయన చెప్పారని భారత ప్రధానన్యాయమూర్తి బిఆర్.గవాయ్ ఈ సందర్భంగా తెలియజేశారు. 'మన పొరుగుదేశాలలో పరిస్థితిని చూడండి. అది పాకిస్థాన్, బంగ్లాదేశ్ లేదా శ్రీలంక అయినా మన దేశం సవాళ్లను ఎదుర్కొన్నప్పుడల్లా అది ఐక్యంగా ఉంది' అని సిజెఐ గవాయ్ చెప్పారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీ మాట్లాడుతూ రాజ్యాంగ ప్రవేశిక పార్క్‌ను, డాక్టర్ అంబేద్కర్ విగ్రహాన్ని భారత ప్రధానన్యాయమూర్తి బిఆర్.గవాయ్ ఆవిష్కరించడం తనకు తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ మాట్లాడుతూ భారత ప్రధాన న్యాయమూర్తిగా గవాయ్ తన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించారని ప్రశంసించారు. మనం ప్రవేశిక విలువలను అంగీకరిస్తే ఎప్పటికీ ఈ దేశంలోని 90శాతం సమస్యలు సమస్యలు పరిష్కారం అవుతాయని ఫడ్నవీస్ చెప్పారు.

## గుండు గీయించి వివస్త్రను చేసి..

(మొదటి పేజీ తరువాయి)

కొనసాగిస్తూ.. ఆమెతో కలిసి పది రోజుల క్రితం అజ్ఞాతంగా వెళ్లిపోయినట్లుగా సమాచారం. ఈ వ్యవహారాన్ని తెలుసుకున్న మొదటి భార్య, తనకు జరిగిన అన్యాయాన్ని తల్లిదండ్రులకు వివరించేందుకు స్వగ్రామమైన తాటికాయలకు చేరుకుంది. ఆమె చెప్పిన విషయాలపై ఆగ్రహించిన కుటుంబసభ్యులు, గ్రామ పెద్దలు స్పందనగా మానవత్వాన్ని మరిచి ఘోరంగా వ్యవహరించారు.

**మంచానికి కట్టేసి వివస్త్రం.. జననాంగంపై జీడిపోసి హింస**

సుమారు ఐదు రోజుల క్రితం మహిళా దంపతులను తాటికాయల గ్రామానికి తీసుకువచ్చి ప్రజల ముందు పెట్టారు. గ్రామస్థుల సమక్షంలో వాళ్లిద్దరినీ విచక్షణారహితంగా దాడి చేశారు. మొదటగా ఇద్దరికీ అర గుండు గీయించి అవమానించగా.. అనంతరం బాధిత మహిళను మంచానికి కట్టేసి పూర్తిగా వివస్త్రను చేశారు. ఇంతటితో ఆగకుండా ఆమె జననాంగంపై పురాతన కాలంలో ఉపయోగించే జీడిని దారుణంగా పోసి శారీరకంగా హింసించారు. బాధిత మహిళ ఎంత వేడుకున్నా.. తప్పు చేశాను, క్షమించండి అని కేకలు వేసినా ఎవరూ కనికరించలేదు. గ్రామస్థులంతా కలిసి మూకుమ్మడిగా దాడికి పాల్పడ్డారు.

**తీవ్ర రక్తస్రావం.. ఆ తర్వాత ఆచూకీ లేదు**

ఈ దాడిలో తీవ్ర గాయాలైన మహిళకు రక్తస్రావం ప్రారంభమయినా ఆమెకు చికిత్స కల్పించలేదు. అనంతరం ఆమెను, ఆమె భర్తను ఎక్కడికి తీసుకెళ్లారన్నది ఇప్పటివరకు తెలియరాలేదు. కుటుంబ సభ్యులు, పోలీసులకు గానీ వారి ఆచూకీ లభించలేదు. ప్రాణాలతో ఉన్నారా.. లేక ఏదైనా ప్రమాదం జరిగిందా అన్న సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.

## దాడి హేయం

(మొదటి పేజీ తరువాయి)

నారాయణ పేర్కొన్నారు. ఇది ముమ్మాటికీ మీడియా స్వేచ్ఛపై తీవ్రమైన దాడి అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని వ్యాఖ్యానించారు. హైదరాబాద్ నగరం నడిబొడ్డులో ఛానల్ ప్రధాన కార్యాలయంలో జర్నలిస్టులు పని చేస్తున్న సమయంలోనే బిఆర్‌ఎస్ నాయకులు రాళ్ళతో విధ్వంసానికి పాల్పడి బీభత్సం సృష్టించడం దుర్మార్గమన్నారు. దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని కూనంనేని డిమాండ్ చేశారు.

**యాంకర్ స్వేచ్ఛ మృతికి సంతాపం :**

యాంకర్ కవయిత్రి స్వేచ్ఛ విషాద మరణం పట్ల కూనంనేని సాంబశివరావు సంతాపం వ్యక్తం చేశారు. ఆమె అర్థాంతరంగా మరణించడం దిగ్భ్రాంతి కలిగించిందన్నారు. స్వేచ్ఛ కుటుంబసభ్యులకు కూనంనేని సాంబశివరావు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## ఎసిబికి చిక్కిన అవినీతి ఉద్యోగులు



ప్రజాపక్షం/సుల్తానాబాద్:పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా ఎసిబి అధికారులు నిత్యం దాడులు నిర్వహిస్తున్న కొందరి ఉద్యోగుల్లో మాత్రం ఎలాంటి చలనం లేకుండా పోయింది. అక్రమ సంపాదనే ధ్యేయంగా వివిధ పనుల నిమిత్తం కార్యాలయాలకు వస్తున్న బాధితులను పట్టిపీడిస్తున్నారు. శనివారం సుల్తానాబాద్ మున్సిపల్ పట్టణ పరిధిలో ఆర్నకొండ రాజు అనే వ్యక్తి తన ఇంటి నెంబర్ మంజూరుకై ఏడాది నుండి సుల్తానాబాద్ మున్సిపల్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నాడు. సదరు బాధితుడు అవసరాన్ని ఆసరాగా చేసుకుని సుల్తానాబాద్ మున్సిపల్‌లో ఇన్‌ఛార్జిగా ఆర్‌ఐ విధులు నిర్వహిస్తున్న వినోద్, బిల్ కలెక్టర్ నాంపల్లి విజయ్ బాధితుడి వద్ద డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. ఆర్‌ఐ వినోద్ బిల్ కలెక్టర్ విజయ్ చేష్టలకు విసిగి వేసారి పోయిన ప్రసాద్ ఎసిబిని ఆశ్రయించాడు. ఆర్‌ఐవినోద్, బిల్ విజయ్ ఇద్దరూ పూసాల రోడ్‌లో గల ప్రసాద్ ఫోటోషాప్‌లో ప్రసాద్ వద్ద నుండి రూ.5000/– డబ్బులు తీసుకుంటుండగా ఎసిబి అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

# నీటి భద్రతే ప్రభుత్వ ధ్యేయం

### మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, వాకిటి శ్రీహరి



ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల ప్రతినిధి: రాష్ట్రంలోని ప్రతి నీటిపారుదల ప్రాజెక్టుకు పూర్తి సామర్థ్యంలో వినియోగించేందుకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా, ప్రణాళిబద్ధంగా ముందుకు సాగుతున్నదని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.

శనివారం జోగులాంబ గద్వాల జిల్లాలో రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి పశు సంవర్ధక, యువజన క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి ప్రియదర్శిని జురాల ప్రాజెక్టు ర్యాలంపాడు రిజర్వాయర్‌లను సందర్శించి జురాల ప్రాజెక్టు ఏర్పడిన సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ జురాల ప్రాజెక్టు సాంకేతికంగా పూర్తి భద్రంగా కొనసాగుతుందని తెలిపారు. 62 గేట్లలో 58 గేట్లు నిర్విరామంగా పనిచేస్తున్నాయని తాత్కాలికంగా నాలుగు గేట్లకు రోప్ సమస్య తలెత్తినప్పటికి, దానివల్ల ప్రాజెక్టుకు ఎలాంటి ప్రమాదం లేదని తెలిపారు. గతంలో ఎన్నో భారీ వరదలను జురాల డ్యామ్ విజయవంతంగా ఎదుర్కొందని, ఇప్పుడు కూడా అన్ని భద్రతా చర్యలు తీసుకుంటూ ప్రభుత్వం జాగ్రత్తలు పాటిస్తుందని తెలిపారు. గత దశాబ్దకాలంలో తెలంగాణలో జరిగిన పాలనలో ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్వహణ పూర్తిగా నిర్లక్ష్యం చేయబడిందని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే ప్రస్తుతం వచ్చిన కొత్త ప్రభుత్వం గత పాత తప్పిదాలను సరిచేసే దిశగా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టిందని తెలిపారు. కేవలం 18 నెలల్లోనే ఇరిగేషన్ లో ఆపరేషన్ మెయింటెన్స్ పట్ల ప్రత్యేక దృష్టి సారించి, ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. జురాల డ్యాంపై నుండి భారీ వాహనాలు వెళ్లడాన్ని పూర్వంలోనే నిషేధించేలా సాంకేతిక నివేదికలు ఇచ్చినప్పటికి, గత ప్రభుత్వ పాలనలో వాటిని పట్టించుకోలేదన్నారు. కానీ ఇప్పుడు సమస్య తీవ్రతను గుర్తించి, జురాల ఆవరణలో ఆల్టర్నేట్ రోడ్డు, వాహనాల వంతెన కోసం రూ.100కోట్లు మంజూరు చేయడం జరిగిందని వెల్లడించారు. అంతేకాకుండా జురాల, మంజీరా, నాగార్జున సాగర్ వంటి ప్రధాన ప్రాజెక్టులన్నీంటికి రొటీన్ మెయింటెనెన్స్ చేపట్టి భవిష్యత్తులో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందుగానే సాంకేతికంగా సమర్ధవంతంగా నిర్వహించ డం జరుగుతుందని తెలిపారు. జురాలకు అదనం గా గ్యాంట్రీ కోసం రూ.3.5కోట్లు నిధులు మంజూ రు చేస్తున్నట్లు తెలిపారు. ర్యాలంపాడు రిజర్వాయర్ సామర్థ్యాన్ని నాలుగు టిఎంసిల వరకు పెంచేందుకు వెంటనే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రస్తుతం రెండు టిఎంసిల వరకు మాత్రమే నీరు నిల్వ అవుతుంది. మిగతా రెండు టీఎంసీల సామర్థ్యం అమలు అయితే రైతులకు గణనీయమైన లాభం చేకూరుతుందని అన్నారు. రాష్ట్ర పశు సంవర్ధక, క్రీడల, యువజన శాఖ మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ జురాల ప్రాజెక్టు ఎంత మాత్రం ఒడిదుడుకులు వచ్చినా తట్టుకుని నిలబడిన విశ్వసనీయ ప్రాజెక్టు అని పేర్కొన్నారు. 2009 లో వచ్చిన భారీ వరదలు సమయంలోనూ రోజుకి 12 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేసినప్పటికి, ప్రాజెక్టు ఎంతమాత్రం నష్టాన్ని ఎదుర్కొనలేదని అన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్, వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి, నారాయణపేట ఎమ్మెల్యే పర్ణికరెడ్డి, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, అదనపు కలెక్టర్ లక్ష్మి నారాయణ, ఇంజనీర్ ఇన్ చీఫ్ ఓ అండ్ ఏం.శ్రీనివాస్, డ్యామ్ సేఫ్టీ చీఫ్ ఇంజనీర్ టి.ప్రమీలా, వనపర్తి చీఫ్ ఇంజనీర్ ఎ.సత్యనారాయణరెడ్డి, గద్వాల సూపరింటెండింగ్ ఇంజనీర్ రహీంఉద్దీన్, తదితరులు ఉన్నారు.

# త్వరలో సమగ్ర విత్తన సవరణ చట్టం

* రైతులు, విత్తన కంపెనీలు, అధికారులు, ఇతర రాష్ట్రాల వ్యవసాయ అధికారులతో సంప్రదింపులు దాదాపు పూర్తి
* త్వరలో మంత్రివర్గానికి ముసాయిదా సమర్పణ



ప్రజాపక్షం/హైదరాబాద్: విత్తనం విత్తడం మొదలు... పంట చేతికి వచ్చే వరకు ఆరుగాలం కష్టపడుతున్న రైతు ఆదిలోనే మోస పోకుండా నాణ్యమైన విత్తనాన్ని అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం దృఢచిత్తంతో ముందుకు సాగుతున్నది. అందులో భాగంగా రాష్ట్రంలో నకిలీ విత్తన కంపెనీలను కట్టడి చేసేందుకు నూతన సమగ్ర విత్తన చట్టం రూపకల్పన ప్రక్రియను ప్రభుత్వం వేగవంతం చేసింది. ప్రతి ఏటా నకిలీ విత్తనాలతో ఒకవైపు రైతులు, విత్తన కంపెనీల మోసాలతో మరోవైపు విత్తన ఉత్పత్తి రైతులు తీవ్రంగా నష్టపోతున్న నేపథ్యంలో నకిలీ విత్తనాలకు సంబంధించి రైతు కమిషన్‌కు ఫిర్యాదులు అందాయి. దీంతో రైతు కమిషన్ క్షేత్ర స్థాయిలో పరిశీలించడం ద్వారా విత్తన కంపెనీల మోసాలను వెలుగులోకి తెచ్చింది. నకిలీ విత్తన సంస్థలను ఆరికట్టేందుకు సమగ్ర చట్టం తీసుకురావాలని తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. నకిలీ విత్తానాల కంపెనీల మోసాలను అరికట్టేందుకు సమగ్ర విత్తన చట్టం ముసాయిదా రూపకల్పనకు సంబంధించి ఇప్పటికే ప్రభుత్వం వ్యవసాయశాఖ డైరెక్టర్ బి.గోపి కన్వీనర్‌గా, విత్తన కార్పొరేషన్ ఛైర్మన్ అన్వేష్‌రెడ్డి, రైతు కమిషన్ సభ్యు లు భూమి సునీల్, రైతు కమిషన్ సలహాదారు దొంతి నర్సింహ్మారెడ్డి తదితరులతో ఓ కమిటీని ఏర్పాటు చేసింది. ముసాయి దా రూపకల్పనకు పూర్తి స్థాయి కసరత్తు మొదలు పెట్టిన కమిటీ సాధ్యమైనంత తర్వలో రాష్ట్రంలో నూతన విత్తన సవరణ చట్టం తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టింది.

విత్తన చట్టం ముసాయిదా డ్రాఫ్ట్‌లో భాగంగా ఇప్పటికే రాష్ట్రంలోని వరంగల్, హనుమకొండ, ఖమ్మం, కరీంనగర్, ఆదిలాబాద్, గద్వాల్, నిజామాబాద్ జిల్లాల్లో పర్యటించి ముసాయిదా కమిటీ వివిధ జిల్లాలోని గ్రామాల్లో రైతుల నుంచి అభిప్రాయాలను సేకరించింది. అదేవిధంగా విత్తన కంపెనీల ప్రతినిధులు, డీలర్లు, వ్యవసాయ శాఖ అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలతో సైతం పలు సమావేశాలు నిర్వహిం చి సలహా, సూచనలు తీసుకుంది. అంతేకాకుండా విత్తన చట్టం రూప కల్పనలో భాగంగా హర్యానాలోపర్యటించిన విత్తన ముసాయిదా రూపకల్పన కమిటీ అక్కడ విత్తన చట్టం అమలవుతున్న తీరు ను, రైతుల అభిప్రాయాలు, అక్కడి చట్టంలోని అంశాలపై అధ్యయనం చేశారు.

ఇదే క్రమంలో ఇప్పటికే పలుమార్లు సమావేశమైన విత్తన చట్టం ముసాయిదా కమిటీ తెలంగాణాలో సమగ్రమైన విత్తన చట్టం రూపకల్పనలో పొందపర్చాల్సిన అంశాలు, ఇందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తదితర అంశాలను ఇప్పటికే కొలిక్కి తీసుకువచ్చారు. అయితే డ్రాఫ్ట్ తయారీ మరింత పారదర్శకంగా ఉండేవిధంగా విత్తన రంగంలో అనుభవం ఉన్న వారి అభిప్రాయాలు, సలహాలు సూచనలను మరిన్ని తీసుకుని వాటిని కూడా క్రోడీకరించుకుని తుది ముసాయిదాను సిద్ధం చేసింది. ఈ ముసాయిదాపై తుది చర్చల అనంతరం త్వరలో జరిగే మంత్రివర్గ సమావేశంలో ఆమోదం పొంది అనంతరం జరిగే అసెంబ్లీ సమావేశాల్లో చట్టం తీసుకురానున్నది.

## కవితను కలవడంలో రాజకీయ ప్రాధాన్యం లేదు


### సిపిఐ ఎంపి సందోష్ కుమార్



ప్రజాపక్షం / హైదరాబాద్: బిఆర్‌ఎస్ మాజీ ఎంపి కవితను తాను కలవడంలో ఎలాంటి రాజకీయ ప్రాధాన్యత లేదని, ఆమె ఆహ్వానంపై మర్యాద పూర్వకంగా కలిసిన ట్లు సిపిఐ రాజ్య సభ సభ్యులు పి.సందోష్ కుమార్ తెలిపారు. రాజకీయ, ఇతర అంశాలపై తమ మధ్య చర్చ జరగలేదని ఆయన స్పష్టం చేశారు. తమ భేటీని రాజకీయంగా తప్పుగా అన్వయించడం పట్ల ఆయన విచారం వ్యక్తం చేశారు. తనకు హైదరాబాద్‌లో అనేకమంది రాజకీయ మిత్రులున్నారని, వ్యక్తిగత పర్యటనలో భాగంగా హైదరాబాద్‌కు వచ్చానని, ఈ సందర్భంగా కవిత ఆహ్వానం మేరకు మర్యాద పూర్వకం గా వారి ఇంటికి వెళ్ళినట్లు ఆయన ఒక ప్రకటనలో వివరించారు.

# సింగరేణి ఉద్యోగి కుటుంబానికి రూ.1.2కోట్ల ప్రమాద బీమా చెక్కు

### ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అందజేత



ప్రజాపక్షం/హైదరాబాద్:సింగరేణిలో అమలు జరుపుతున్న ఉచిత ప్రమాద బీమా పథకం కింద ఇటీవల ప్రమాదంలో మృతి చెందిన ఒక కార్మికుని కుటుంబానికి రూ.1.20కోట్ల బీమా సొమ్ము చెక్కు ను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అందజేశారు.

మహాత్మా జ్యోతి రావ్ పూలే ప్రజాభవన్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో ఈ చెక్కును మృతి చెందిన రామగుండం 1 ఏరియాకు చెందిన సపోర్టు మెన్ పెంద్రి రంజిత్ కుమార్ భార్య లతకు అందజేశారు. సింగరేణి కార్మికుడు పెంద్రి రంజిత్ కుమార్‌కు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో వేతన ఖాతా ఉంది. ఇటీవల ఆయన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ నేపథ్యంలో మృతుడి నామినీగా ఉన్న భార్య లతకు రూ.1.2 కోట్ల ప్రమాద బీమా కింద చెల్లించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ అనుకోని ప్రమాదంలో కార్మికుడు మృతి చెందినట్లయితే అతని కుటుంబం వీధిన పడకుండా ఆర్థిక భరోసా కల్పించడం కోసం ఈ పథకాన్ని అమలు చేయడం అభినందనీయమన్నారు. మృతుని కుటుంబానికి త్వరలో కారుణ్య నియామక పత్రాలు అందచేస్తామని ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్, సింగరేణి సిఎండి ఎన్.బలరామ్, రెడ్‌కో వైస్ చైర్మన్, ఎండి ఆనీలా, ఎస్‌బిఐ డిజిఎం నీలాక్షి సింగ్, రీజనల్ మేనేజర్ సురేష్ కుమార్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కోల్ మూమెంట్) ఎస్‌డిఎం.సుభాని తదితరులు పాల్గొన్నారు.

## 44 మంది 'డిఎస్‌పిల బదిలీ'

ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్రంలో 44 మంది డిఎస్‌పిలను బదిలీ చేస్తూ శనివారం డిజిపి డాక్టర్ జితేందర్ ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన వారి వివరాలు ఇలా ఉన్నాయి.

| అధికారి పేరు | బదిలీ అయిన స్థానం |
|---|---|
| వై.నాగేశ్వర్‌రావు | సైబరాబాద్ సిసిఎస్ |
| ఆకుల చంద్రశేఖర్ | రాచకొండ ట్రాఫిక్ |
| సాయిరెడ్డి వెంకట్‌రెడ్డి | కల్వకుర్తి |
| పల్లె వెంకటేశ్వర్లు | డిజిపి కార్యాలయం |
| కొంతం చంద్రశేఖర్‌రెడ్డి | మాదాపూర్ ట్రాఫిక్ |
| కందుల సత్యనారాయణ | డిజిపి కార్యాలయం |
| వి.కిరణ్‌కుమార్ | రామగుండం ఎస్‌బి |
| వై.నర్సింహ్మారెడ్డి | జిహెచ్‌ఎంసి |
| పద్మనాబుల శ్రీనివాస్ | డిజిపి కార్యాలయం |
| ఎన్.సి.రంగస్వామి | రాచకొండ ఎస్‌ఒటి |
| పి.సతీష్ | సిఐడి |
| కాపుగాని శ్రీనివాస్ | సంగారెడ్డి డిఎస్‌పి |
| జి.రానవీర్‌రెడ్డి | హైదరాబాద్ ఎస్‌బి |
| సిహెచ్.శ్రీనివాస్‌జి | కరీంనగర్ సిసిఆర్‌బి |
| జి.విజయ్‌కుమార్ | యాదగిరిగుట్ట |
| అనుమల శ్రీనివాస్ | హైదరాబాద్ ట్రాఫిక్ |
| ఎస్.సంపత్‌కుమార్ | రాచకొండ కమాండ్ కంట్రోల్ |
| ఎన్.ప్రవీందర్‌రావు | ఇంటెలిజెన్స్ |
| పి.రమేష్‌కుమార్ | నార్కోటిక్ బ్యూరో |
| కె.మనోజ్‌కుమార్ | సిఐడి |
| కె.శంకరయ్య | సైబర్ సెక్యూరిటీబ్యూరో |
| కె.రాంమోహన్‌రెడ్డి | హెచ్‌ఎండిఎ |
| ఎ.రవిందర్‌రెడ్డి | సైబరాబాద్ సైబర్ క్రైమ్ |
| బి.బిక్షపతి | ఇంటెలిజెన్స్ |
| జి.రాంమోహన్‌రెడ్డి | ఇంటెలిజెన్స్ |
| వి.సతీష్ | కరీంనగర్ టాస్క్‌ఫోర్స్ |
| పి.శివభాస్కర్ | హైదరాబాద్ ఎస్‌బి |
| జె.నర్సింహులు | కరీంనగర్ సిసిఎస్ |
| కె.రాములు | హెచ్‌ఆర్‌సి |
| టి.మహేష్ | ఖమ్మం ఎస్‌బి |
| డి.దుర్గాప్రసాద్ | రాజన్నసిరిసిల్లా ఎస్‌బి |
| సర్దార్‌సింగ్ | సిఐడి |
| కె.సత్యనారాయణ | నిజామాబాద్ ఎస్‌బి |
| జి.శ్యామ్‌సుందర్ | మీర్‌చౌక్ |
| వెంకటేశ్వర్‌రావు | డిజిపి కార్యాలయం |
| భీమ్‌రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి | నల్గొండ ఎస్‌బి |
| పిల్లా రవిందర్‌రెడ్డి | రామగుండం సిసిఎస్ |
| జి.రవి | నల్గొండ డిసిఆర్‌బి |
| కె.పురుషోత్తంరెడ్డి | ఇంటెలిజెన్స్ |
| టి.సత్యనారాయణ | ఖమ్మం టాస్క్‌ఫోర్స్ |
| ఆర్.సత్యనారాయణరాజు | రాచకొండ పిడి సెల్ |
| ఎ.సూర్యనారాయణ | భూపాల్‌పల్లి (కాటారం) |
| బి.కిషన్‌కుమార్ | ఆసీఫ్‌నగర్ |
| బి.నందిరామ్ నాయక్ | డిజిపి కార్యాలయం |


తెలంగాణ ప్రభుత్వం
రెవెన్యూ (భూసేకరణ)శాఖ
ఫారం - VI
(చట్టం 30/2013 యొక్క సెక్షన్-11(1) మరియు రూల్-19 ప్రకారం)
ప్రాథమిక నోటిఫికేషన్

భూ.సే.అ.& ఆర్.డి.ఓ.,కోరుట్ల ఫైల్.నెం.E/395/2025 తేది: 20.06.2025
జిల్లా కలెక్టర్, జగిత్యాల ఫైల్ నెం.G1/671/2025 తేది: 25.06.2025

జగిత్యాల జిల్లా, కోరుట్ల డివిజన్, ఈ దిగువ షెడ్యూల్ నందు చూపబడిన కథలాపూర్ మండలంలోని కలికోట గ్రామంలోని మొత్తం **ఎ.2.38గు. భూమి,** రుద్రంగి ట్యాంక్ (కలికోట సూరమ్మ చెరువు), శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్ట్ స్టేజ్-II ఫేజ్-I కలికోట సూరమ్మ చెరువు కట్ట పొడిగింపు చేయుట కొరకు మొత్తం **ఎ.2.38గు.** అవసరమున్నదని, తెలంగాణ ప్రభుత్వం / జిల్లా కలెక్టర్, జగిత్యాల గారు భావిస్తున్నారు.

సదరు భూసేకరణ, నష్టపరిహారం, పునరావాస పునరుపాధి కల్పనా చట్టం, 2013 లోని సెక్షన్-10-A(b) క్రింద ఇవ్వబడిన అధికారాల అమలులో, తెలంగాణ ప్రభుత్వం జి.ఓ.యం.ఎస్.నెం.47, I&CAD (LA.R&R/A2) శాఖ, తేది: 25.07.2017 ద్వారా శ్రీపాద యెల్లంపల్లి ప్రాజెక్ట్ స్టేజ్-II ఫేజ్-I మరియు కెనాల్ నెట్ వర్క్ ప్యాకేజీలకు RFCTLA&RR చట్టం, 2013 యొక్క అధ్యాయం-II & III యొక్క దరఖాస్తును మినహాయించింది. I, II & III మంథని లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ మరియు కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ నిభందనల నుండి మినహాయింపు ఆదేశాలను జారీచేయనైనది.

షెడ్యూల్

గ్రామము: కలికోట మండలం: కథలాపూర్ జిల్లా: జగిత్యాల

| క్ర.సం. | సర్వే నం. | భూమి వివరణ | భూమి రకము / తరి / ఖుష్కి | భూసేకరణ చేయు విస్తీర్ణం | ఆసక్తిగల వ్యక్తుల పేరు & వివరాలు | సరిహద్దులు ఉత్తరం | దక్షిణం | తూర్పు | పడమర | చెట్లు / నిర్మాణములు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | | | | 8 |
| 1 | 90/1 | పట్టా | ఖుష్కి | 1.00 | మునిగంటి రాజ్ కుమార్ తండ్రి నడ్పన్న | 89 | 138 | 91 | 93 | |
| 2 | 91/1 | పట్టా | ఖుష్కి | 0.22 1/2 | మునిగంటి రాజనర్సయ్య తండ్రి నర్సింలు | 90, 93 | 138 | 138 | 92 | |
| 3 | 91/2 | పట్టా | ఖుష్కి | 0.22 1/2 | మునిగంటి రాజ్ కుమార్ తండ్రి నడ్పన్న | 90, 93 | 138 | 138 | 92 | |
| 4 | 92/3 | పట్టా | ఖుష్కి | 0.09 | గాధనవేణి మల్లేశం తండ్రి కొమురయ్య | 93 | 91 | 138 | 138 | |
| 5 | 92/1 | పట్టా | ఖుష్కి | 0.03 | మునికోట గంగారాం తండ్రి హన్మయ్య | 93 | 91 | 138 | 138 | |
| 6 | 92/2 | పట్టా | ఖుష్కి | 0.03 | మునికోట కళావతి భర్త బ్రహ్మయ్య | 93 | 91 | 138 | 138 | |
| 7 | 93/2 | పట్టా | ఖుష్కి | 0.09 | మార్కం మల్లేష్ తండ్రి నర్సయ్య | 94, 96 | 90, 91 | 92 | 98 | |
| 8 | 93/1 | పట్టా | ఖుష్కి | 0.09 | మార్కంహన్మాండ్లు తండ్రి నర్సయ్య | 94, 96 | 90, 91 | 92 | 98 | |
| | మొత్తం విస్తీర్ణం | | | 2.38 | | | | | | |

6 X 25

ఇట్టి ప్రకటన భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు భూసేకరణ, నష్టపరిహారం, పునరావాస పునారుపాధి కల్పనా చట్టం, 2013లోని సెక్షన్ 11(1) (చట్టం, 30/2013) ప్రకారం సంబందిత భూ యజమానులకు తెలియచేయుటకు గాను నోటిఫికేషన్ జారిచేయనైనది. భూమి యొక్క ప్లాన్, మరియు వివరములు జిల్లా కలెక్టర్, జగిత్యాల / భూసేకరణ అధికారి &రెవెన్యూడివిజినల్ అధికారి, కోరుట్ల వారి కార్యాలయములో ఉంచనైనది. సంబందిత వ్యక్తులు ఏదైనా పనిదినములలో కార్యాలయ పని వేళలో తనిఖీ చేసుకోవచ్చును.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం / జిల్లా కలెక్టర్, జగిత్యాల గారు భూసేకరణ అధికారి & రెవెన్యు డివిజినల్ అధికారి, కోరుట్ల గారిని మరియు వారి సిబ్బంది ఇట్టి భూసేకరణకు సంబందిత సెక్షన్-12 ప్రకారం పై తెలిపిన భూములలో ఏదేని ప్రదేశంలో ప్రవేశించి సర్వేజరిపి భూకమతాన్ని కొలిచే అధికారం, భూమిని తవ్వడానికి లేదా భూ స్వరూపం తెలుసుకొనుటకుబోర్ వెయ్యడానికి మరియు అవసరమైన ఇతర చర్యలు చేపట్టడానికి అనుమతించనైనది.

సదరు సెక్షన్ 11(4) ప్రకారం భూసేకరణకు ప్రతిపాదించబడిన భూమి విషయములో జిల్లా కలెక్టర్, జగిత్యాల గారి అనుమతి లేకుండా ప్రాథమిక నోటిఫికేషన్ జారి చేసిన తేది నుండి ఆ నోటిఫికేషన్ లో ఉదహరింపబడిన భూములకు సంబందించి ఎవరు ఎటువంటి కొనుగోలు / అమ్మకాలు / తాకట్టుకు సంబందించిన చర్యలు లేదా ఏ విధమైన లావాదేవీలు జరుపరాదని తెలియచేయనైనది.

ఇట్టి ప్రాథమిక నోటిఫికేషన్ జారీ అనంతరం పైన చూపిన భూములలో ఏలాంటి సంబందం ఉన్న వ్యక్తులైన భూసేకరణపై సెక్షన్-15 ప్రకారం అభ్యంతరాలు ఉన్నచో, ఇట్టి నోటిఫికేషన్ జారీ చేసిన (60) దినములలో జిల్లా కలెక్టరు, జగిత్యాల / భూసేకరణ అధికారి & రెవెన్యు డివిజనల్ అధికారి, కోరుట్లగారి ముందు వారి అభ్యంతరాలను వ్రాతపూర్వకంగా తెలియజేయవచ్చును.

సం/- భూసేకరణ అధికారి & రెవెన్యూ డివిజనల్ అధికారి కోరుట్ల | సం/- అదనపు కలెక్టర్ జగిత్యాల | సం/- జిల్లా కలెక్టర్ జగిత్యాల

DIPR RO NO. 322/LA/PP/Advt/Pub/2025-26


# ఆయిల్ పామ్ సాగుతో లాభాలు

### రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు



ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి: ఆయిల్ ఫామ్ పంటల వల్ల అధిక లాభాలు ఆర్జించవచ్చని, రైతులు ఆయిల్ ఫామ్ పంట సాగుకు అధిక ప్రాధాన్యత నివ్వాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు సూచించారు.శనివారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు స్థానిక శాసన సభ్యులు కాలే యాదయ్యతో కలిసి చేవెళ్ల మున్సిపాలిటీ పరిధి దేవుని ఎర్రవల్లి గ్రామంలో పామాయిల్ మెగా ప్లాంటేషన్ తోటను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతులు వైవిధ్యమైనటువంటి ఆయిల్ పామ్ పంటలను ఎక్కువ సంఖ్యలో వేయాలని తెలిపారు. ఆయిల్ పామ్ సాగుకోసం సబ్సిడీపై డ్రిప్ ఇస్తున్నామని, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో మాత్రం ఎన్ని ఎకరాలు సాగుచేసినా ఇస్తామని తెలిపారు.రైతుకు మొక్కల దగ్గరి నుంచి, మార్కెటింగ్ వరకు ప్రభుత్వం సహకరిస్తుందన్నారు. ఈ మేరకు ప్రతి జిల్లాకు ఆయిల్ ప్యాక్టరీ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు.

అనంతరం మంత్రి పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబర్ చింపుల సత్యనారాయణ రెడ్డి పొలంలో ఫామాయిల్ మొక్కలను నాటి, రైతులకు యూరియాను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, రాష్ట్ర ఉద్యానశాఖ సంచాలకులు యాస్మిన్ బాషా, జిల్లా ఉద్యానశాఖ అధికారి కె.సురేష్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నరసింహారావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## విజయనగరం ఉగ్ర కేసు ఎన్‌ఐఎకు బదిలీ



ప్రజాపక్షం/హైదరాబాద్:ఇటీవల సచలయం రేపిన విజనగరంలో వెలుగు చూసిన ఉగ్ర కేసు శనివారం జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఎ) హైదరాబాద్‌కు బదిలీ చేశారు. గత నెలలో వెలుగుచూసిన ఈ కేసులో విజనగరంకు చెందిన సిరాజ్ ఉర్ రహ్మాన్, హైదరాబాద్‌కు చెందిన సయ్యిద్ సమీర్ లను విజయనగరం పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. పోలీసుల విచారణలో వీరిద్దరు హైదరాబాద్‌తో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల్లో బాంబు దాడులకు కుట్ర పన్నినట్లు, అందుకు కావాల్సిన నిధులను హవాలా ద్వారా వచ్చినట్లు వెల్లడించారు. ప్రస్తుతం ఈ ఇద్దరు నిందితులు విశాఖపట్నం జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు. సిరాజ్ తండ్రి పోలీసు శాఖలో ఎస్‌ఐగా పనిచేస్తున్నాడు. సిరాజ్, సమీర్‌లకు చెందిన బ్యాంక్ ఖాతాలను విజయనగరం పోలీసులు సీజ్ చేశారు. ఈ కేసులో మరికొందరు అనుమానితులను కూడా విచారించారు. అయితే ఇది ఉగ్ర కేసు అవ్వడంతో కేసును ఎన్‌ఐఎకు బదిలీ చేశారు. విశాఖపట్నం జైలులో ఉన్న ఈ ఇద్దరు ఉగ్రవాదులను విచారణ నిమిత్తం త్వరలో హైదరాబాద్‌కు తీసుకువచ్చి ఎన్‌ఐఎ అధికారులు విచారించనున్నారు. ఇందుకోసం విజయనగరం కోర్టులో కస్టడీ పిటిషన్ కూడా ఒకటి రెండు రోజు ల్లో ఎన్‌ఐఎ అధికారులు దాఖలు చేసే అవకాశాలు ఉన్నాయి.

## చిల్లర రాజకీయాలు మానుకోవాలి

### హరీష్‌రావుపై చనగాని దయాకర్ విమర్శ



ప్రజాపక్షం/హైదరాబాద్:నిరుద్యోగ యువతను మళ్లీ రెచ్చగొట్టి, ఓట్లు పొందాలని బిఆర్‌ఎస్ పార్టీ, మాజీ మంత్రి హరీష్‌రావు చిల్లర రాజకీయాలు చేయడం మానుకోవాలని టిపిసిసి జనరల్ సెక్రటరీ చనగాని దయాకర్ అన్నారు. బిఆర్‌ఎస్ పార్టీ పదేళ్ళు పాలించి ఉద్యోగాలు భర్తీ చేయకుండా మోసం చేయడం పట్ల మొదట క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పదేండ్లు పాలించి, నిరుద్యోగులను నిలువునా ముంచి, నేడు రాజకీయ డ్రామాలు అడడం సిగ్గుచేటని విమర్శించారు. గాంధీభవన్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బిఆర్‌ఎస్ పార్టీ నిరుద్యోగులను రెచ్చగొట్టే ప్రయత్నాలను తప్పకుండా తిప్పి కొడతామని ఆయన హెచ్చరించారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వం నిరుద్యోగుల జీవితాలతో చెలగామాడిందని, చివరకు వారు ఆత్మహత్యలకు పాల్పడానికి కారణమైందని ఆయన ఆరోపించారు. నిరుద్యోగుల గురించి కానీ, ఉద్యోగాల భర్తీ గురించి బిఆర్‌ఎస్ నేతలకు మాట్లాడే అర్హత లేదన్నారు.

# అస్తవ్యస్తంగా విద్యావ్యవస్థ

### ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి

ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి: తెలంగాణ రాష్ట్రంలో విద్యారంగం పూర్తిగా అస్తవ్యస్తంగా మారిందని, సిఎం రేవంత్‌రెడ్డి విద్యాశాఖ తన వద్దే పెట్టుకున్నా విద్యార్థుల సమస్యలు పరిష్కారం కావడం లేదని ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 18 నెలలైనా ప్రజా ప్రభుత్వంలో విద్యార్థులకు ఇచ్చిన హామీలు ఇంకెప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు?. విద్యా రంగ సమస్యలు సంబంధిత అధికారులకు చెప్పినా పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. సిఎం తన వద్ద విద్యాశాఖ పెట్టుకుని సమస్యల పరిష్కారం కోసం ప్రజాదర్బార్ నిర్వహించడం లేదన్నారు. విద్యార్థులకు 5లక్షల భరోసా కార్డు, ప్రతి విద్యార్థికి ఎలక్ట్రిక్ స్కూటీ, ప్రతి విద్యార్థి ఇంటింటికీ ఉచిత ఇంటర్నెట్, విద్యా జ్యోతి పథకం హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందన్నారు. కెజీ పాఠశాల నుంచి ప్రైవేట్ యూనివర్సిటీ వరకు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, తాము అధికారంలోకి వస్తే ఫీజు బకాయిలు ఒకేసారి విడుదల చేస్తామన్న సిఎం రేవంత్‌రెడ్డి నేడు విద్యార్థుల జీవితాలతో, బడ్జెట్ కళాశాల టీచింగ్ స్టాఫ్ కుటుంబాలతో చెలగాటమాడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలు విడుదల చేస్తే విద్యార్థులకు ఇబ్బందులు ఉండవన్నారు. ప్రభుత్వ పాఠశాల కళాశాలలో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గురుకులాలు, కెజిబివి, సంక్షేమ హాస్టళ్లలో ఆహార నాణ్యత పాటించేలా ప్రభుత్వం టాస్క్‌ఫోర్స్ టీం నియమించి నిత్యం తనిఖీలు నిర్వహించాలని, పెరిగే నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా విద్యార్థుల మెస్ చార్జీలు మరింత పెంచాలని, రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ బస్సులలో విద్యార్థులకు ఉచిత రవాణా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

## పసుపు బోర్డును ఎన్నిసార్లు ప్రారంభిస్తారు?

### జాగృతి అధ్యక్షురాలు కవిత

ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి: జిల్లా పసుపు బోర్డును ఇదివరకే రెండుసార్లు ప్రారంభించారని, కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఇప్పుడు మూడోసారి ప్రారంభించేందుకు వస్తున్నారని జాగృతి అధ్యక్షురాలు బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. మీడియాతో ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ పసుపు బోర్డుకు పదేపదే ప్రారంభోత్సవాలు చేయడం కాదు. ఎన్‌డిఎ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే పసుపు బోర్డుకు చట్టబద్ధత కల్పించాలన్నారు. పసుపు బోర్డుకు ఇదివరకే ప్రారంభోత్సవాలు చేసిన సంగతి ఎంపి అరవింద్ హోంమంత్రికి చెప్పకపోవచ్చన్నారు. నిజామాబాద్ లోనే పసుపునకు క్వింటాలుకు రూ.15 వేల మద్దతు ధర ప్రకటించి వెళ్లాలని డిమాండ్ చేశారు. పసుపు బోర్డుకు చట్టబద్ధత కల్పించలేదు. కాబట్టే మొన్నటి బడ్జెట్‌లో ఒక్క రూపాయి కూడా కేటాయించలేదన్నారు. జిల్లా రైతులు సంతోషపడేలా అమిత్‌షా మద్దతు ధరపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.


గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్
సూపరింటెండింగ్ ఇంజనీర్ కార్యాలయం, శేరిలింగంపల్లి జోన్, జిహెచ్‌ఎంసి.
మెయిల్: sew.ghmc@gmail.com, సెల్ నెం. 7331186858
NIT No. 13/SE/SLPZ/GHMC/2025-26 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన తేది: 28.06.2025
పని పేరు: జిహెచ్‌ఎంసి, ఎస్‌ఎల్‌పిజెడ్, సర్కిల్-20లో ఎంపిపి స్కూల్ భవనం నిర్మాణం (01 ఐటమ్). అంచనా విలువ / ఇసివి: రూ.200.00లక్షలు, బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం: 30.06.2025న మ.1.00గం.ల నుండి 07.07.2025న మ.1.30గం.ల వరకు, అధికారి పేరు & చిరునామా: ఎస్‌ఇ, ఎస్‌ఎల్‌పిజెడ్, జిహెచ్‌ఎంసి. సెల్ నెం. 7331186858.
సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, శేరిలింగంపల్లి జోన్ : జిహెచ్‌ఎంసి.
DIPR R.O. No. : 4341-PP/CL/ADVT/1/2025-26, Date: 28-06-2025



hmda
హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ, చీఫ్ ఇంజనీర్ కార్యాలయం.
ఈస్ట్ వింగ్, 7వ అంతస్తు, స్వర్ణ జయంతి కమర్షియల్ కాంప్లెక్స్, అమీర్‌పేట్, హైదరాబాద్ - 500038
NIT No. HMDA/DEV/CE/14/2025-26 ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన తేది: 27.06.2025
''ప్యారడైజ్ జంక్షన్ నుండి శామీర్‌పేట్ వద్ద ఓఆర్‌ఆర్ జంక్షన్ రాజీవ్ రహదారి (SH-01) (కి.మీ 0/00-18/300) మరియు ప్యారడైజ్ ఇన్ నుండి డైరీ ఫామ్ రోడ్ (NH-44)) (కి.మీ 0/00-4/200) వరకు ఎలివేటెడ్ కారిడార్ అలైన్‌మెంట్ పరిధిలోకి వచ్చే ప్రభావిత డిఫెన్స్ బౌండరీ గోడలు, ప్రహరి గోడ మరియు ఫెన్సింగ్ నిర్మాణ పనుల కోసం చెల్లుబాటు అయ్యే రిజిస్టర్డ్ కాంట్రాక్టర్ల నుండి ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు ఆహ్వానించడమైనవి''. బిడ్ల సమర్పణకు చివరి తేదీ: 10.07.2025. మరిన్ని వివరాల కోసం https://tender.telangana.gov.inని సందర్శించండి.
సం/- చీఫ్ ఇంజనీర్, హెచ్‌ఎండిఎ.
DIPR R.O. No. : 4355-PP/CL/ADVT/1/2025-26, Date: 28-06-2025


# పాప్‌కార్న్

## ఏనుగు పిల్ల.. అరటి పండ్లు..




రెండు పెద్ద ఏనుగుల మధ్యలో జాగ్రత్తగా నడుస్తున్న ఓ ఏనుగు పిల్ల హఠాత్తుగా వేగాన్ని తగ్గించి, పక్కనే ఒక తోపుడు బండిపై అరటిపండ్లను ఒడిసి పడుతున్న వీడియా ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది. ఐఎఫ్ఎస్ మాజీ అధికారిణి సుశాంతా నందా తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేసిన వీడియో గున్న ఏనుగు అరటి పండ్లను తీసుకోవడం స్పష్టంగా కనిపిస్తున్నది. అరటి పండ్ల వ్యాపారి, పక్కనే ఉన్న ఒక మహిళ తొలుత భయపడ్డారు. తర్వాత ఏనుగు పిల్లను చూసి ముచ్చటపడుతూ, అరటి పండ్లను అందించారు. ఆ ఏనుగు పిల్ల దర్జాగా వాటిని తీసుకొని, తనదారిన తాను వెళ్లింది. ఈ ఘటనలపై కొంత మంది సరదగా రియాక్ట్ అవుతుండగా, మరికొంత మంది అటవీ ప్రాంతాలను విచక్షణారహితంగా కొట్టివేయడం వల్లే ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటన్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏనుగు పిల్ల కాకుండా, పెద్ద ఏనుగులే వస్తే పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. గ్రామీలు, పట్టణాలు... చివరికి నగరాల్లోకి కూడా వణ్యప్రాణులు చొరబడే దుస్థితి నెలకొనడాన్ని ప్రభుత్వాల వైఫల్యంగా విమర్శిస్తున్నారు. అది కూడా నిజమే.

## డ్రెస్ కోడా.. స్కూల్ యూనిఫామా?



ఇదెక్కడి విడ్డూరం అంటూ, పేరు తెలియని కంపెనీపై నెటిజన్లు విమర్శలు గుప్పిస్తున్నారు. వివరాల్లోకి వెళితే, ప్రముఖ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'రెడిట్'లో దర్శనమిచ్చిన ఓ స్క్రీన్‌షాట్ ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నది. తన స్నేహితుడికి ఓ కంపెనీలో ఉద్యోగం వచ్చిందని స్క్రీన్ షాట్‌ను షేర్ చేసిన వ్యక్తి పేర్కొన్నాడు. అయితే, ఆ కంపెనీ పేరునుగానీ, అది ఎక్కడ ఉన్న విషయాన్నిగానీ ప్రస్తావించలేదు. కానీ, అందులో పేర్కొన్న విషయాలు చర్చనీయాంశమయ్యాయి. మహిళా ఉద్యోగస్తులంతా తప్పనిసరిగా చున్నీ వేసుకొని, దానికి పిన్నులు తప్పక పెట్టుకోవాలని ఆ కంపెనీ షరతుల్లో ఉంది. అదే విధంగా, జుట్టుకు కనీసం రబ్బర్ బ్యాండ్ పెట్టుకోవాలని స్పష్టం చేసింది. అలాగే, పురుషులు టీ షర్టులు వేసుకోవడానికి వీల్లేదని నిబంధన విధించింది. జీన్స్ ప్యాంట్‌ను అనుమతించినప్పటికీ, చొక్కాని ఇన్‌షర్ట్ చేసుకొని తీరాలని తేల్చిచెప్పింది. కాగా, డ్రెస్‌కోడ్ పేరుతో స్కూల్ యూనిఫామ్ ప్రవేశపెడుతున్నారంటూ కొంత మంది నెటిజన్లు విమర్శిస్తుండగా, పనిచేసే ప్రాంతాలను గౌరవించాలని, ఇష్టానుసారంగా రావడం అక్కడి సానుకూల వాతావరణాన్ని దెబ్బతీస్తుందని మరికొందరు వాదిస్తున్నారు. ఎలాంటి బట్టలు వేసుకోవాలి.. జట్టు ఏ విధంగా ఉండాలి అనే విషయాల్లోనూ యాజమాన్యాల జోక్యం అనవసరమని కొందరి అభిప్రాయం. వర్క్ ప్లేస్ అన్నతర్వాత కొంతైనా డిసెన్సీ అవసరమని ఇంకొందరి నమ్మకం. ఏదిఏమైనా, ఒక కంపెనీ ఈ విధంగా డ్రెస్, అప్పీయరెన్స్ కోడ్ విధించడంపై సర్వత్రా చర్చ కొనసాగుతున్నది.

## కుక్కలతో వాకింగ్ ప్రమాదకరం!



కుక్కలను తీసుకొని వాకింగ్‌కు వెళ్లడం చాలా మందికి అలవాటు. అయితే, అవి హఠాత్తుగా పరుగులు తీసినప్పుడు లేదా ఇష్టం వచ్చినట్టు నడుస్తున్నప్పుడు, దానిని పట్టుకున్న వారు చిన్నచిన్న ప్రమాదాలకు గురవుతుంటారు. ఇలాంటి గాయాలకు చికిత్స తప్పనిసరి అవుతుంది. ప్రపంచ వ్యాప్తంగా ఇలాంటి చికిత్స విలువ 269.62 కోట్ల రూపాయలు. అమెరికా, సింగపూర్ సంస్థలు నిర్వహించిన అధ్యయనం ప్రకారం, ఏటా కనీసం ఐదు లక్షల మంది కుక్కలను వాకింగ్‌కు తీసుకెళుతూ గాయపడుతున్నారు. వీరిలో మూడు వంతుల మంది మహిళలే. 65 లేదా అంతకంటే ఎక్కువ వయసుగల వారు 31 శాతం. కాబట్టి, కుక్కలతో వాకింగ్‌కు వెళ్లడం ఎంత ప్రమోదమైనదో, అంత ప్రమాదకరమైనది కూడా. ఇక కుక్కలు వెంటపడినప్పుడు కిందపడడం, దాడిలో తీవ్రంగా గాయపడడం తరచు జరుగుతునే ఉంటాయి. వాకింగ్ సమయంలో జరుగుతున్న ప్రమాదాలకు దాదాపు సమానమైన సంఖ్యలో ఇలాంటి ప్రమాదాలు కూడా చోటు చేసుకుంటున్నాయి. ఏ విధంగా చూసినా కుక్కలతో జాగ్రత్తగా ఉండాలి. లేకపోతే, ఆసుపత్రులపాలుకావడం ఖాయం.

## అనుకోని ఆవిష్కరణ



అనుకోకుండా వచ్చిపడే ప్రమాదాలేకాదు... ఒక్కోసారి ఊహించని మంచి కూడా జరుగుతుంది. ఇందుకు సిరియన్ కాంట్రాక్టర్ చేసిన ఓ గొప్ప ఆవిష్కరణే నిదర్శనం. ఇడ్లిబ్ ప్రావిన్స్‌లోని మారత్ అల్‌నుమాన్‌లో, ఒక శిథిలమైన ఇంటిని పూర్తిగా తొలగించి, దాని స్థానంలో కొత్త భవనాన్ని నిర్మించేందుకు సిరియన్ కాంట్రాక్టర్ పనులు మొదలు పెట్టాడు. అలెప్పో–డెమాస్కస్ నగరాల మధ్య ఈ ప్రాంతం ఉంది. దెబ్బతిన్న భవనానికి ఆనుకొని కనిపించిన ఒక గొయ్యి అతని దృష్టిని ఆకర్షించింది. అక్కడ తవ్వి చూసినప్పుడు, బైజాంటైన్ కాలానికి చెందిన సమాధుల సముదాయం ఒకటి కన్పించడంతో దిగ్భ్రాంతికి గురయ్యారు. వెంటనే ఈ విషయాన్ని పురవస్తు శాఖ అధికారులకు చెప్పాడు. వారు అక్కడ పూర్తిస్థాయిలో తవ్వకాలు జరిపి, ఆ సమాధులు కనీసం 1,500 సంవత్సరాల క్రితం నాటివని ప్రకటించారు. అక్కడ లభించిన కుండలు, గాజు ముక్కలు, ఎముకలు, ఇతర వస్తువుల ఆధారంగా వారు ఈ నిర్ణయానికి వచ్చారు. సిరియాలోని స్మారక చిహ్నాల్లో కనీసం మూడో వంతు ఇడ్లిబ్‌లోనే ఉండడం విశేషం. అక్కడ ఇప్పటి వరకూ ఒక పురాతన నగరంతోపాటు, 800 చారిత్రక ప్రదేశాలను గుర్తించారు. తాజా ఆవిష్కరణ మాత్రం ఎవరూ ఊహించకుండానే జరిగింది. అయినప్పటికీ, చరిత్ర పరిశోధకులకు కావాల్సినంత సమాచారాన్ని అందిస్తున్నది.

— బిఎస్ఎస్ మైత్రేయి

# ఎస్‌సిఒలో భారత్ దౌత్యవైఫల్యం

పహల్గామ్‌లో టూరిస్టులపై టెర్రరిస్టు హత్యాకాండ, పాకిస్థాన్ నుంచి సీమాంతర ఉగ్రవాదం పాత్రగూర్చి వివరించి మన దేశ వైఖరికి సానుకూల అభిప్రాయం రూపొందించటానికై మోదీ ప్రభుత్వం అరడజను 'అఖిలపక్ష పార్లమెంటరీ బృందాలను' 32 దేశాలకు పంపింది. కాని తను సభ్యునిగా ఉన్న షాంఘై సహకార సంస్థ (ఎస్‌సిఒ) సభ్య దేశాలను విస్మరించింది. దీని దుష్ఫలితం జూన్ 25, 26 తేదీల్లో చైనాలోని క్వింగ్డావోలో ఎస్‌సిఒ రక్షణ మంత్రుల సమావేశం సంయుక్త ప్రకటన ముసాయిదాలో వ్యక్తమైంది. పహల్గామ్‌లో టెర్రరిస్టుదాడి ప్రస్తావనలేని ముసాయిదా ప్రకటనను మన రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ సబబుగానే తిరస్కరించారు, సంతకం చేయటానికి నిరాకరించారు, పహల్గాం ప్రస్తావనలేకపోగా 'బెలూచీస్థాన్‌లో అలజడులు' ఆ ప్రకటనలో చోటు చేసుకోవటం భారత్‌కు పుండు మీద కారం చల్లినట్లయింది. అంటే టెర్రరిజానికి అడ్డాగా ఉన్న, టెర్రరిజాన్ని ఆర్థికంగా, శిక్షణ, ఆయుధాల పరంగా ప్రోత్సహిస్తున్న పాకిస్థాన్ వాదన (బెలూచిస్థాన్‌లో తిరుగుబాటుదారులకు భారత్ అండదం డలనే ఆరోపణ) అందులో చోటుచేసుకుంది. ఏతీర్మానమైనా ఏకాభిప్రాయంతో ఆమోదించబడాలన్న నియమాన్ని 10 దేశాలతో కూడిన ఎస్‌సిఒ పాటిస్తున్నందున, భారత్ వ్యతిరేకించిన కారణంగా సంయుక్త ప్రకటన లేకుండా నే సమావేశం ముగిసింది. ఇది తీవ్రమైన దౌ త్యం వైఫల్యం, భారత్ ఏకాకి అయింది. ప్ర భుత్వం పునరాలోచించాలి. దిద్దుబాటు చర్య లు తీసుకోవాలి. ఒక దేశం –పాకిస్థాన్ అభ్యంతరం చెప్పటం వల్లనే పహల్గాం దాడి ముసాయిదా ప్రకటనలో చోటు చేసుకోలేదని చెప్పబడుతున్నది. మన ప్రభుత్వం సీమాంతర ఉగ్రవాదంపై ధ్వజమెత్తుతున్నా పాకిస్థాన్‌కు ప్రపంచ బ్యాంకు రుణాన్ని అడ్డుకోలేకపోయింది. ఆపరేషన్ సిందూర్ సందర్భంలో వాణిజ్యం ఆశ చూపి భారత్ – పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణ సాధించానని అధ్యక్షుడు ట్రంప్ ఇప్పటికి 18సార్లు పునరుద్ఘాటించారు. ఎవరి జోక్యం లేదని ప్రధాని మోదీ ఎట్టకేలకు ఫోన్ సంభాషణలో ట్రంప్‌కు చెప్పినా ఆయన పదే పదే అదే అంటున్నారంటే మోదీ ప్రభుత్వ బలహీనతపై ఆయన జూదమాడుతున్నారు.

ప్రజాపక్షం
29-06-2025, ఆదివారం

ఇదిలా ఉండ గా ట్రంప్ ఏకంగా పాకిస్థాన్ సైన్యాధిపతి , స్వయం ప్రకటిత ఫీల్డ్ మార్షల్ మునీర్‌కు వైట్‌హౌస్‌లో విందు ఇచ్చారు. మన బాధ ప్ర పంచ బాధ కాదని ఈ ఉదంతాలు తెలియజేస్తున్నాయి. టెర్రరిజం అది ఏరూపంలో ఉన్నా – టెర్రరిస్టులపై , దానికి మద్దతు ఇచ్చే, ప్రోత్సహించే, ఆర్థిక తోడ్పాటు ఇచ్చేవారిపై ప్రపంచం ఏకోన్ముఖంగా పోరాటం చేయాలని, ద్వంద ప్రమాణాలు పనికిరావని కొన్ని సంవత్సరాలుగా అంతర్జాతీయ వేదికలపై మోదీ విజ్ఞప్తులు చేస్తున్నారు. కానీ టెర్రరిజం పట్ల ఎవరి అభిప్రాయాలు, అవసరాలు వారివి. అంతర్జాతీయ వ్యవహారాల్లో తమ ప్రయోజనాలను బట్టి అమెరికా టెర్రరిజాన్ని ఖండిస్తుంటుంది లేదా బలపరుస్తుంటుంది. ఇప్పు డు గాజాపై ఇజ్రాయెల్ సాగిస్తున్నది బరితెగించిన టెర్రరిజం కాదా? మోదీ ప్రభుత్వం సైతం దాన్ని ఖండించిన పాపాన పోలేదు. ఆపరేషన్ సిందూర్ సందర్భంలో చైనా పాకిస్థాన్‌కు అండగా ఉందనో, చైనా ఆయుధాలను పాకిస్థాన్ ఉపయోగించిందనో చైనా పట్ల వ్యతిరేకత పెంచుకుంటే ఏమిలాభం? దక్షిణ చైనా సముద్రంపై చైనా ఆధిపత్యాన్ని అడ్డుకోవటం కోసం అమెరికా, ఆస్టేలియా, జపాన్‌లతో కూడిన క్వాడ్‌లో భారత్ చేరలేదా? భూగోళ రాజకీయాల్లో ఎవరి ప్రయోజనాలు వారివి? అంతమాత్రాన ఎవర్నీ శత్రువులుగా నిందించకూడదు. మన దేశ వైఖరిని నచ్చజెప్పటానికి ప్రయత్నిస్తూనే ఉండాలి. ఎస్‌సిఒలో ప్రస్తుత సభ్యులు:చైనా, రష్యా, ఇండియా, పాకిస్థాన్, ఇరాన్, బెలారుస్, కజకిస్థాన్, కిర్గిస్థాన్, తజకిస్థాన్, ఉజ్జెకిస్థాన్. కాగా ఇరాన్ ఎస్‌సిఒ సభ్యదేశమైనప్పటికీ దానిపై ఇజ్రాయిల్, అమెరికా బాంబుదాడులను అది ఖండించకపోవటం గమనార్హం. గాజాపై ఇజ్రాయెల్ దాడులను ఖండించే తీర్మానంపై ఐరాసలో ఓటింగ్ నుంచి భారత్ గైరుహాజరైనప్పుడే అది పూర్వ ప్రతిష్ఠను కోల్పోయింది. ఇంతటితో అయిపోలేదు. ఈ సంవత్సరాంతంలో చైనాలోని తియాన్‌జిన్‌లో ఎస్‌సిఒ శిఖరాగ్ర సభ ఉంది. అంతకు ముందు జులై 6న బ్రిక్స్ శిఖరాగ్ర సభ బ్రెజిల్‌లో ఉంది. ఈ రెండింటిలో ప్రధాని మోదీ పాల్గొంటారు. దేశాల అధినేతలతో సంభాషిస్తారు. టెర్రరిజంపై విస్తృతమైన ఏకాభిప్రాయ సాధనకు ప్రయత్నాలు కొనసాగించవచ్చు.

# మోంకడాపై దాడికి 72 ఏళ్లు : క్యూబన్ విప్లవంలో మలుపు

అమెరికా ఖండంలో ఫైడల్ కాస్ట్రో నాయకత్వంలో క్యూబా విప్లవం పలు విధాల చరిత్రకెక్కింది. అమెరికన్ సామ్రాజ్యవాదులు ఎన్ని ఆంక్షలు కొనసాగిస్తున్నా, బెదిరింపులకు పాల్పడుతున్నా క్యూబాలో 67 సంవత్సరాలుగా సోషలిజం దిశగా సమాజ పునర్నిర్మాణం జరుగుతోంది. క్యూబా విప్లవ చరిత్ర అమెరికా ఖండానికే కాదు భూగోళంమీది విప్లవ, ప్రగతిశీల శక్తులందరికీ స్ఫూర్తిదాయకం. క్యూబా విప్లవ చరిత్రలో మోంకడా బ్యారక్స్ (మిలటరీ స్థావరం)పై కాస్ట్రో సోదరుల నాయకత్వంలో 1953 జులై 26న జరిగిన దాడి విఫలమైనా అది చరిత్రను మలుపుతిప్పిన సంఘటన.

సూక్ష్మ ంగా చరిత్రలోకి తొంగిచూస్తే – ఫుల్జెన్సియో బాటిస్టా 1952 నుంచి 1959 వరకు డిక్టేటర్‌గా పరిపాలన సాగించారు. ఆ పాలనలో క్యూబా అన్ని రకాల నేరాలు, అవినీతికి ఆలవాలమైంది. 1952లో సైనిక తిరుగుబాటుద్వారా అధికారంలోకి వచ్చిన బాటిస్టా చేబట్టిన తొలి చర్య, సమాజ ప్రజాస్వామిక వ్యవస్థను రద్దు చేసి అధికారాన్ని తన చేతిలోకి తీసుకున్నాడు. ప్రజలు ఎంతో కాలం సహించలేదు, తిరుగుబాటు చేశారు. 1958–59లో అతన్ని అధికారంనుంచి తొలగించారు. ఆ ప్రజావెల్లువ సాయుధపరమైనది, రాజకీయమైనది కూడా. దాని నాయకుడు యువ లాయర్ ఫైడల్ కాస్ట్రో.

1953 జులై 26న మోంకడా బ్యారక్స్‌పై దాడి విఫలమైనాక, ఫైడల్ కాస్ట్రో, ఆయన గ్రూపును అరెస్టు చేశారు. వారు నిర్బంధంలో ఉండగానే ''ఎం–26–7 (జులై 26వ తేదీ ఉద్యమాన్ని ఆ విధంగా పిలుస్తారు) ఏర్పడింది. కేసు విచారణలో కాస్ట్రో అనర్గళంగా 2 గంటలపాటు మాట్లాడారు. జనామోదంకోసం బాటిస్టా మోంకడా బ్యారక్‌పై దాడిలో సజీవంగా ఉన్నవారందరికీ క్షమాభిక్ష ప్రకటించాడు. కాస్ట్రో సోదరులు (ఫైడల్, రాల్) అజ్ఞాత జీవితంలోకి వెళ్లిపోయారు. మెక్సికో వెళ్లిపోయిన వారు తమ వ్యూహాలు పటిష్టం చేసుకుని 1956లో క్యూబా తిరిగి వచ్చారు. వారిని మెక్సికోలో కలుసుకున్న చేగువేరా కూడా వారితోపాటు వచ్చారు. కాస్ట్రో సోదరులు, చేగువేరా ప్రయాణిస్తున్న గ్రాన్మా ఓడపై బాటిస్టా సైనికులు దాడి చేశారు. వారు తప్పించుకుని సీరా మీస్ట్రా చేరుకున్నారు. అక్కడ వారు ''ఎం–26–7'' తిరుగుబాటు దళాలను పునః సమీకరించుకుని, పట్టణ ప్రాంతాల్లో విద్రోహకృత్యాలు చేస్తూ, రహస్యంగా రిక్రూట్‌మెంట్ చేబట్టారు. బాటిస్టాను వ్యతిరేకిస్తున్న అతిపెద్ద, అత్యంత శక్తిమంతంగా ఉండిన పాపులర్ సోషలిస్ట్ పార్టీ కాలక్రమంలో ప్రభావం కోల్పోతున్నది. దాని శ్రేణులను 26 జులై ఉద్యమం ఆకర్షించింది. బాటిస్టాపై అడపాదడపా తిరుగుబాట్లు జరుగుతుండగా, తిరుగుబాటు శక్తులు గెరిల్లా యోధుల స్థితినుంచి సుశిక్షితులైన సైన్యంగా తయారై బాటిస్టు సైన్యంతో తలపడుతున్నారు. బాటిస్టాను అధికారం నుంచి తొలగించాక, పాపులర్ సోషలిస్టు పార్టీ, జులై 26 ఉద్య మం, 13 మార్చి రివల్యూషనరీ డైరెక్టరేట్‌లతో కూ డిన సంక్షిర్ణం పరిపాలన చేబట్టింది. జులై 26 ఉద్యమ తిరుగుబాటు దారులు అంతిమంగా డిసెంబర్ 31, 1958 రోజున బాటిస్టాను కూలదోశారు, ఆయన దేశం వదిలి పారిపోయాడు.



కాస్ట్రో విప్లవశక్తులకు అత్యంత ముఖ్యమైన నాయకునిగా ఎదిగారు. అటుతర్వాత జులై 26 ఉద్యమం అనధికార ప్రభుత్వం అయింది. బాటిస్టా ను తొలగించాక కాస్ట్రో అత్యంత ప్రజాదరణ కలిగిన నాయకుడై అధికారాన్ని పటిష్టం చేసుకున్నా రు. అది దేశీయంగా, అంతర్జాతీయంగా ఉద్రిక్తతల కు దారితీసింది. 26 జులై 1953ను క్యూబాలో విప్లవదినంగా పాటిస్తారు. ఆ విధంగా ఏర్పడిన పార్టీ మార్క్సిస్టు–లెనినిస్టు పంథాలో సంస్కరణపొంది 1965 అక్టోబర్‌లో కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ క్యూబా గా అవతరించింది. కాస్ట్రో దాని ప్రధానకార్యదర్శిగా ఎన్నుకోబడ్డారు.

క్యూబాలో ప్రారంభమైన విప్లవ క్రమానికి దేశీయంగా, అంతర్జాతీయంగా ప్రాముఖ్యతగల పర్యవసానాలున్నాయి. ప్రత్యేకించి క్యూబా – అమెరికా సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. సర్దుబాటుకు క్యూబా ప్రయత్నాలు ఫలించలేదు. అంతేగాక క్యూబా విప్లవం అనేక లాటిన్ అమెరికా దేశాల్లో గాఢమైన ప్రకంపనలు సృష్టించింది. అది ప్రతిఘటనకు నమూనాగా మాత్రమేగాక విజయవంతమైన విప్లవం ఎలా ఉండాలో బ్లూప్రింట్ అయింది. లాటిన్ అమెరికా విప్లవానికి క్యూబా సైద్ధాంతిక, వ్యూహాత్మక ఉత్తేజమైంది. అదేసమయంలో, అసమ్మతి రూపంలో వ్యక్తీకరణ పొందుతున్న నూతనోత్తేజంపై అమెరికాస్‌లోని పలు పచ్చిమితవాద ప్రభుత్వాలు విరుచుకుపడ్డాయి. ''మరో క్యూబాను నిరోధించటం'' వాటి ఆశ.

విప్లవం తర్వాత కాస్ట్రో ప్రభుత్వం జాతీయకరణ కార్యక్రమం చేబట్టింది. ప్రభుత్వ ఆధ్వర్యంలో మీడియా ఏర్పాటుచేసింది. రాజకీయ అధికారాన్ని పటిష్టం చేసుకుంది. దేశ ఆర్థిక వ్యవస్థను, పౌరసమాజాన్ని పరివర్తన గావించింది. క్యూబా జనాభాలోని సంపన్నులను, అమెరికాను దూరం పెట్టింది. ఈ ఆర్థిక పరివర్తనను సహించలేని క్యూబన్ సంపన్నులు అమెరికాకు వలసవెళ్లిపోయారు. విదేశాల్లో – ఆఫ్రికాలో, అమెరికాస్‌లో, ఆగ్నేయాసియాలో, మధ్యప్రాచ్యం వివాదాల్లో క్యూబా జోక్యానికి కూ డా విప్లవం నాంది పలికింది. క్యూబా విప్లవ ప్రభుత్వాన్ని సవాలు చేస్తూ అమెరికా 1959–1965 మధ్య ప్రధానంగా ఎస్కాంబ్రె పర్వతాల్లో అనేక తిరుగుబాట్లు ప్రోత్సహించింది.



**చే గువేరా:** ఎర్నెస్టో చే గువేరా దోహదాలను ప్రస్తావించనిదే క్యూబన్ విప్లవగాథ సంపూర్ణం కాదు. చే 1928, జూన్ 14న జన్మించారు. క్యూబా విప్లవంలో, సోషలిజం నిర్మాణానికి అనంతరం జరిగిన కృషిలో చే కీలకమైన పాత్ర పోషించారు. మార్క్సిస్టు భావాలు జీర్ణించుకున్న చే గువేరా క్యూబా విప్లవానంతరం సోషలిజం దిశగా దేశాన్ని మరల్చటానికి నిర్దిష్టమైన విధానాలు అభివృద్ధి చేశారు. అమలు జరిపారు. అర్ధవలస పరాధీనత నుంచి విముక్తి పొందిన క్యూబాను ఒక స్వతంత్ర రాజ్యంగా సోషలిస్టు శిబిరంలో సమైక్యం చేసేందుకు గాఢమైన వ్యవస్థాగత మార్పులు ప్రవేశపెట్టారు. మార్క్సిజానికి ఆయన విలక్షణమైన దోహదాలను – సోషలిస్టు పరివర్తన దశలో రాజకీయ అర్థశాస్త్రంపై ఆయన ప్రత్యేక దృష్టి, సోషలిస్టు నిర్మాణం ద్వారా ''కొత్త మానవుణ్ణి'' రూపొందించటానికున్న ప్రాముఖ్యత, ఆయన 'ఫోకో' థియరీ (పేద దేశాలకు విప్లవ వ్యూహం)లో చూడవచ్చు.

చే గువేరాలోని విప్లవోత్సాహం ఆయన్ను ఆఫ్రికా దేశం కాంగోకు తీసుకెళ్లింది. అక్కడ కార్యక్ర మం అంతిమంగా విఫలమై క్యూబా తిరిగి వచ్చారు. త్వరలోనే క్యూబా నుంచి బొలివియా వెళ్లారు. చే బోలీవియాలో ఉన్నట్లు తెలుసుకున్న బొలీవియా ప్రభుత్వం అతన్ని సజీవంగా లేదా శవంగా పట్టుకునేందుకు ప్రత్యేక ఆర్మీ యూనిట్‌ను ఏర్పాటు చేసింది. ఈ ఆపరేషన్‌లో అమెరికన్ సిఐఎ కూడా బొలీవియాకు సహాయపడింది. చే, కొద్దిమం ది ఆయన అనుచరులు బొలీవియా నుంచి బయటకు వెళ్లబోతుండగా, సిఐఎ సహాయంతో బొలీవియా సైనిక యూనిట్ అడవిలో వారిని చుట్టుముట్టింది. చే బృందం సైన్యంతో తీవ్రంగా తలపడింది. కాల్పుల్లో చే గాయపడ్డారు. ఆయన తుపాకీ కూడా పనిచేయలేదు. బొలీవియా సైనికులు వారి సమీపానికి వచ్చారు. 1967 అక్టోబర్ 9న ఆయన్ను పట్టుకుని తుపాకీ తూటాలు దించారు. ''పిరికి పందలారా! కాల్చండి.. మీరు మనిషిని మాత్రమే చంపగలరు''. అవే చే గువేరా ప్రసిద్ధమైన చివరి మాటలు..

– కృష్ణ ఝా
అసోసియేట్ ఎడిటర్, న్యూఏజ్

# బంతి బిజెపి కోర్టులోకి..





## రాజధాని సందడి

– బొమ్మగాని కిరణ్‌కుమార్

ఇప్పుడు రాష్ట్ర అభివృద్ధికి సంబంధించి బంతి బిజెపి కోర్టులోకి చేరింది. ముఖ్యంగా తెలంగాణలో అధికారంలోకి రావాలని కలలుగంటున్న రాష్ట్ర బిజెపి నాయకులపై గురుతర బాధ్యత నిలబడింది. బిజెపి యేతర ప్రభుత్వం కొలువై ఉన్న తెలంగాణ విషయంలో కేంద్ర ప్రభుత్వం అనేక ముఖ్య అంశాలలో ప్రదర్శిస్తున్న వివక్ష. అందుకు తాజా ఉదాహరణ, మూడు రోజుల క్రితం సమావేశమైన కేంద్ర క్యాబినెట్ పూణె మెట్రో రైలు రెండవ దశకు ఆమోదముద్ర వేసి, ఎంతో కాలంగా రెండవ దశ విస్తరణ కోసం ఎదురుచూస్తున్న హైదరాబాద్ మెట్రోకు మాత్రం నిరాశ మిగల్చడమే. సుమారు కోటిన్నర జనాభా కలిగి, నిత్య వలసలతో మరింత పెరిగిపోతున్న హైదరాబాద్ మహానగర జనాభాలో సగాని కన్నా కొద్ది ఎక్కువ మంది ఉంటారు పూణెలో. దేశంలోని అత్యధిక జనాభా కలిగిన మొదటి పది నగరాలలో పూణె కంటే రెండు, మూడు స్థానాలలో హైదరాబాద్ ముందున్నది. అంతమాత్రాన పూణెలో మెట్రో విస్తరణకు అభ్యంతర పెట్టాల్సిన అవసరం లేదు. కానీ, హైదరాబాద్ నగరంపై ఎందుకు వివక్ష అనేది ప్రశ్న. ఇదే విషయాన్ని హైదరాబాద్‌లో ప్రముఖ నాయకుడిగా వెలుగొందిన పి.జనార్ధన్‌రెడ్డి(పిజెఆర్) పేరిట కొత్త ఫ్లైఓవర్ ప్రారంభోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు లేవనెత్తడం సమంజసమే. దేశంలోనే మెట్రో రైలు నెట్‌వర్క్‌లో రెండవ స్థానంలో ఉన్న హైదరాబాద్ ఇప్పుడు తొమ్మిదో స్థానానికి వెళ్ళడం వెనుక బిజెపి వివక్ష లేదా? అని సిఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. రాష్ట్రంలో సగం మంది ఎంపిలను బిజెపికి ఇచ్చిన తెలంగాణ ప్రజలకు ప్రధాని మోదీ ఏమిచ్చారో చెప్పాలని తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రి, రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు కిషన్‌రెడ్డిని నేరుగానే అడిగారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ఎక్కడి రావడానికైనా సిద్ధమైనని కూడా ఆఫర్ చేశారు. దీంతో బంతి బిజెపి కోర్టులోకి వెళ్ళినట్లయింది. హైదరాబాద్ మహానగరం, దాని చుట్టుపక్కల ప్రాంతాలలోని లోక్‌సభ స్థానాలలో సికిందరాబాద్, చేవెళ్ళ, మల్కాజ్‌గిరిలో బిజెపినే గెలిచింది. వాటి పరిధిలోని మెట్రో విస్తరణను ఎందుకు చేపట్టడం లేదనే ప్రశ్న ఆ పార్టీ నేతలకు సహజంగానే ఎదరువుతుంది. దీనికి తోడు మూసీ రివర్ ఫ్రంట్, ట్రిపుల్ ఆర్ అనుమతులను గు రించి కూడా ప్ర స్తావించారు ము ఖ్యమంత్రి. ఇవన్నీ బిజెపిని ఇరుకునపెట్టేవే. రాష్ట్రానికి రొటీన్‌గా దక్కాల్సిన నిధులే తప్ప బిజెపి ఎం పిలు అదనంగా చెప్పుకోదగ్గ ఘనతను రాష్ట్రానికి ఏమి సాధించారని ప్రజల మదిలో కూడా మెదులుతుంది. అంతేగాక, తెలంగాణకు కొత్త రైల్వే లైన్‌లు పదకొండేళ్ళలో పెద్దగా దక్కిందేమి లేదు. ఇదే కాదు, విమానాశ్రయాల విషయం లో కూడా అడుగు ముందుకు పడడం లేదనే మాటలూ వినవస్తున్నాయి. మరీ ముఖ్యంగా పొరుగున ఎన్‌డిఏ ప్రభుత్వం ఉన్న ఆంధ్రప్రదేశ్ వైపు అన్ని రకాలుగా మొగ్గు చూపుతూ, తెలంగాణ పట్ల నిర్దయగా వ్యవహరించడం ప్రజల దృష్టికి చేరకపోదు.

### బుల్లెట్ రైలుపైనే మక్కువ

ఇదే సమయంలో సంపన్నులకు ఉపయోగపడే బుల్లెట్ రైలుపై కేంద్ర ప్రభుత్వం మక్కువ ప్రదర్శించడం కూడా చర్చనీయాంశమైంది. ఇటీవల ఆర్‌టిఐ యాక్టివిస్టు, సీనియర్ జర్నలిస్టు ఇనగంటి రవికుమార్ బుల్లెట్ రైలుకు సంబంధించి ఆర్‌టిఐ దరఖాస్తు చేసుకోవడం ద్వారా లభించిన సమాచారంలో ఆసక్తికరమైన అంశాలు వెల్లడయ్యాయి. ముంబాయి నుంచి అహ్మదాబాద్ నగరాల నడుమ బుల్లెట్ రైలు నడపడం కోసం రూ.1.08 లక్షల కోట్లు ఖర్చు చేస్తున్నాయి. నాలుగేళ్ళలో పూర్తి చేస్తామని 2017లో శంకుస్థాపన చేసిన బుల్లెట్ రైల్వే లైనుకు ఇప్పటి వరకు రూ.69,495 కోట్లు విడుదల చేయగా,గుజరాత్ ప్రభుత్వం రూ.5వేల కోట్లు మాత్రమే ఖర్చు చేసింది. దీనిని చేపట్టిన నేషనల్ హైస్పీడ్ రైల్వే కార్పొరేషన్ డిపిఆర్ లేకుండానే కేవలం ఫీజిబులిటీ రిపోర్టు (సాధ్యాసాధ్యాల నివేదిక) ఆధారంగానే దీనిని మొదలెట్టిందని చెబుతున్నారు రవికుమార్. బుల్లెట్ రైలు సాధ్యాసాధ్యాల నివేదిక ప్రకారం ముంబాయి–సూరత్–వడోదర –అహ్మదాబాద్ మధ్య విమానాల్లో రోజుకు 8170 మంది ప్రయాణికులు, రైలు మొదటి, రెండవ తరగతుల ఎసిలో 679, బెంజి బస్సుల్లో 782 మంది ప్రయాణించే సౌకర్యం ఉన్నది. అంటే మొత్తంగా 9631 నిత్యం రాకపోకలు చేస్తారు. కాగా, బుల్లెట్ రైలు కోసం 1.05 లక్షల కోట్లు కేటాయించగా, పూర్తయ్యే నాటికి వ్యయం రూ.1.50 కోట్లకు పెరిగే అవకాశం ఉంది. ఇది పూర్తయ్యేనాటికి 20 వేలు, 2050 నాటికి 50 వేల మంది ప్రయాణం చేయవచ్చునని అంచనా. ఇందులో ప్రయాణం సామాన్యులకు సాధ్యం కాదు. అలాంటి వారికి ఉపయోగపడే మెట్రో రైలు విషయంలో, అదీ ప్రత్యేకించి హైదరాబాద్ విషయంలో కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపుతుందనే వాదనను తప్పని నిరూపించే సదవకాశం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్రం నుంచి ఎన్నికైన బిజెపి ఎంపిల చేతుల్లో ఉంది. వారి స్పందన ఎలా ఉంటుంతో కాలమే చెప్పాలి.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## ఆవును చంపిందన్న కోపంతో పులిపై విషప్రయోగం..



**న్యూఢిల్లీ :** కర్ణాటక-కేరళ సరిహద్దుల్లో ఐదు పులులు మరణించాయి. మలై మహదేశ్వర వైల్ లైఫ్ డివిజన్‌లో తల్లి పులి, నాలుగు కూనలు మరణించిన విషయం తెలిసిందే. ఈ కేసు దర్యాప్తులో కీలక విషయం వెల్లడైంది. ఆవును పులి చంపిందన్న కోపంతో ఓ వ్యక్తి పులికి విషం పెట్టినట్లు అధికారులు గుర్తించారు. ఈ మేరకు ముగ్గురిని అరెస్ట్ చేశారు. కర్ణాటకకు చెందిన ముదురాజు అనే వ్యక్తికి చెందిన ఆవును ఇటీవలే పులి వేటాడి చంపింది. ఎంతో అపురూపంగా పెంచుకుంటున్న ఆవును పులి చంపడంతో ముదురాజు కోపంతో రగిలిపోయాడు. ఎలాగైనా పులి పని పట్టాలని పథకం వేశాడు. మరో ఇద్దరితో కలిసి చనిపోయిన తన ఆవు కళేబరంలో విషం చల్లి.. పులికి ఎర వేశాడు. విషం పెట్టిన ఆవు కళేబరాన్ని తిని పులి, దాని నాలుగు కూనలు మరణించినట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనలో ముదురాజుతోపాటు ఆయనకు సహరించిన నాగరాజు, కోనప్పని పోలీసులు అరెస్ట్ చేశారు.

## న్యాయవిద్యార్థి అనికేత్‌ను
# తక్షణమే విడుదల చేయండి

సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీ

బేతుల్ జిల్లా మెజిస్ట్రేట్

జారీచేసిన డిటెన్షన్ ఆదేశాన్ని

తప్పుపట్టిన 'సుప్రీమ్'



**న్యూఢిల్లీ :** మధ్యప్రదేశ్‌లో ఒక న్యాయవిద్యార్థిని జాతీయ భద్రతా చట్టం (ఎన్ఎస్ఏ) కింద కేసు నమోదు చేసిన తర్వాత నిర్బంధించడంపై సుప్రీం కోర్టు మండిపడింది. ఇది 'పూర్తిగా సమర్థించలేనిది' అని వ్యాఖ్యానించింది. న్యాయవిద్యార్థి అన్ను అలియాస్ అనికేత్‌ను తక్షణమే విడుదల చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది.న్యాయమూర్తులు జస్టిస్ ఉజ్జల్ భుయాన్, కె.వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం పిటిషన్ విచారణ సందర్భంగా మధ్యప్రదేశ్‌లోని బేతుల్ జిల్లా మెజిస్ట్రేట్ 2024 సంవత్సరం జులై 11న జారీ చేసిన డిటెన్షన్ ఆర్డర్‌ను తప్పుపట్టింది. ఈ కేసులో వివరణాత్మక సహేతుకమైన ఆదేశాన్ని జారీ చేసింది. పిటిషనర్ అన్ను బెతుల్‌లోని యూనివర్సిటీ క్యాంపస్ వద్ద ఒకరితో వాగ్వాదానికి దిగారు. ఈ నేపథ్యంలో ఆయనపై కేసు నమోదు అయ్యింది. అన్ను ఒక ప్రొఫెసర్‌తో ఘర్షణకు దిగారని ఆరోపణలను ఎదుర్కొన్నాడు. అన్నుకు వ్యతిరేకంగాఎఫ్ఐఆర్‌లో ఆయనపై హత్యానేరం, ఇతర సంబంధిత నేరాలు నమోదయ్యాయి. ఆయన జైలులో ఉన్న సమయంలో జాతీయ భద్రతా చట్టం కింద ఒక డిటెన్షన్ ఆర్డర్ జారీ అయింది. ఆ తర్వాత ఆ ఆర్డర్ ధృవీకరించబడింది. అప్పటినుంచి ప్రతీ మూడు నెలలకు ఒకసారి అన్ను డిటెన్షన్ పొడిగించబడింది. '2024 జులై 11 నాటి నుంచి మొదటి డిటెన్షన్ ఆర్డర్‌ను పరిశీలించిన అనంతరం అప్పీలెంట్‌ను 1980జాతీయ భద్రతా చట్టంలోని సెక్షన్ 3(2) కింద ప్రివెంటివ్ డిటెన్షన్‌లోకి తీసుకున్న విషయాన్ని మేం కనుగొన్నాం. కాగా1980జాతీయ భద్రతా చట్టంలోని సెక్షన్ 3 సబ్‌సెక్షన్ (2) అవసరాలు సంతృప్తిపర్చేలా లేవన్న అభిప్రాయానికి వచ్చాం. అందువల్ల అప్పిలెంట్ ప్రివెంటివ్ డిటెన్షన్ పూర్తిగా సమర్థించలేనిది' అని సుప్రీంకోర్టు ధర్మాసనం శుక్రవారం ఆదేశం జారీచేసింది. ఏ ఇతర కారణాల పరంగా చూసినా న్యాయవిద్యార్థి ప్రివెంటివ్ డిటెన్షన్ సమర్థనీయంగా లేదని అత్యున్నత న్యాయస్థానం స్పష్టంచేసింది. అప్పీలెంట్ అయిన న్యాయవిద్యార్థి అన్ను ప్రాతినిధ్యాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి పంపించకుండా జిల్లా కలెక్టర్ స్వయంగా తనకు తాను నిర్ణయించడం, ఇతర క్రిమినల్ కేసులలో అప్పీలెంట్ నిర్బంధం వాస్తవపరిస్థితులను పరిగణనలోనికి తీసుకోకపోవడం,అతడిని రెగ్యులర్ క్రిమినల్ ప్రొసీడింగ్‌లో నిర్బంధించడానికి బదులు ప్రివెంటివ్ డిటెన్షన్‌లోకి ఎందుకు తీసుకోవాల్సి వచ్చిందనేవి ఏమాత్రం ఆలోచించలేదని ధర్మాసనం పేర్కొంది. 'కాబట్టి కేసు వాస్తవాలు పరిశీలిస్తే ప్రస్తుతం భోపాల్‌లోని సెంట్రల్ జైలులో ఉన్న అప్పీలెంట్ మరే ఇతర క్రిమినల్ కేసులలో అవసరం లేకపోతే వెంటనే కస్టడీ నుంచి విడుదల చేయాలని మేం ఆదేశిస్తున్నాం. పైన పేర్కొన్న వాటిని దృష్టిలో ఉంచుకుని క్రిమినల్ అప్పీల్‌ను పరిష్కరించబడుతుంది. సహేతుకమైన ఉత్తర్వును అనుసరిస్తుంది' అని ధర్మాసనం తెలిపింది. న్యాయవిద్యార్థి అయిన అన్ను అలియాస్ అనికేత్‌ను 2024 జులై 11న జారీచేసిన మొదటి ప్రివెంటివ్ డిటెన్షన్ ఆర్డర్‌ను పరిగణనలోనికి తీసుకున్నారని, ఆ తర్వాత ఈ డిటెన్షన్ ఆర్డర్‌ను నాలుగుసార్లు పొడిగించారని, చివరి పొడిగింపు ఉత్తర్వు ప్రకారం అతగి పొడిగింపు ఉత్తర్వు 2025 జులై 12న ఉన్నదని ధర్మాసనం తెలియజేసింది. జాతీయ భద్రతా చట్టం 1980లోని నిబంధనల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం అందజేసిన ఆన్‌రికార్డు మెటీరియల్ లో ప్రస్తుత క్రిమినల్ కేసు సహా 9 క్రిమినల్ కేసులు నమోదయ్యాయని, ప్రివెంటివ్ డిటెన్షన్ సమర్థించడానికి చట్ట విరుద్ధంగా ఉదహరించారని కోర్టు కనుగొన్నదని ధర్మాసనం తెలిపింది. ప్రస్తుత క్రిమినల్ కేసు న్యాయవిద్యార్థి అన్నుపై గత సంవత్సరం మోపబడిందని, అయితే అతనికి 2025 జనవ రి 28న బెయిల్ మంజూరైందని అత్యున్నత న్యాయస్థానం గమనించింది. ఫిబ్రవరి 25న అన్ను తండ్రి దా ఖలు చేసిన హెబియస్ కార్పస్ పిటిషన్‌ను మధ్యప్రదేశ్ హైకోర్టు రద్దుచేసింది. పిటిషనర్ చాలా కాలంగా అనేక క్రిమినల్ కేసులలో నేరచరితను కలిగి ఉన్నాడని, ప్రజాశాంతికి భంగం కలిగించే అలవాటుగా మారిన నేరస్థుడని హైకోర్టు అతడి హెబియస్ కార్పస్ పిటిషన్‌ను రద్దు చేయడానికి గల కారణమని తెలిపింది.

# 'రా' చీఫ్‌గా పరాగ్ జైన్

జూలై 1న పదవీ బాధ్యతల స్వీకరణ





**న్యూఢిల్లీ :** రీసెర్చ్ అండ్ అనాలసిస్ వింగ్ (రా) కొత్త చీఫ్‌గా పంజాబ్ క్యాడర్‌కు చెందిన ఐపిఎస్ అధికారి పరాగ్ జైన్ నియమితులయ్యారు. ఆయన రెండేళ్ల పాటు పదవీకాలంలో కొనసాగుతారు. ప్రస్తుత 'రా' చీఫ్ రవి సిన్హా పదవీకాలం జూన్ 30వ తేదీతో ముగియనుంది. దీంతో జూలై 1న పరాగ్ జైన్ కొత్త చీఫ్‌గా బాధ్యతలు చేపడతారు. పస్తుతం ఆయన ఏవియేషన్ రీసెర్చ్ సెంటర్ (ఎఆర్‌సి) అధిపతిగా సేవలందిస్తున్నారు. ఇటీవల చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'లో జైన్ కీలక పాత్ర పోషించారు. పాకిస్థాన్ మిలటరీ కదలికలు, ఉగ్ర స్థావరాలు వంటి కీలక ఇంటెలిజెన్స్ సమాచారం సేకరణలో ఆయన సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహించారు. పంజాబ్ క్యాడర్ 1989 బ్యాచ్ ఐపిఎస్ అధికారి అయిన పరాగ్ జైన్‌కు వ్యూహాత్మక ఇంటెలిజెన్స్ వర్క్, ఫీల్డ్ ఎక్స్‌పీరియన్స్‌లో విశేషానుభవం ఉంది. ప్రస్తుతం 'రా'లో ఆయన రెండవ మోస్ట్ సీనియర్‌గా ఉన్నారు. 'రా'లో 15 ఏళ్లుగా అంకిత సేవలందిస్తూ.. భారతదేశ కౌంటర్ టెర్రరిజం ఆర్కిటెక్చర్‌గా కీలక భూమిక పోషిస్తున్నారు. జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాద కార్యకలాపాలకు వ్యతిరేకంగా చేపట్టిన ఆపరేషన్‌లో సైతం పరాగ్ తన వంతు పాత్రను సమర్థవంతంగా నిర్వహించారు. దీనికి ముందు చండీగఢ్‌లో సీనియర్ సూపరింటెండెంట్‌గా కూడా పని చేశారు. గ్లోబల్ ఇంటెలిజెన్స్ అనుభవం కూడా జైన్‌కు విశేషంగా ఉంది. కెనడాలోని అట్టావాలో ర్యాడికల్ సిక్కు వేర్పాటువాద నెట్‌వర్క్‌ను ట్రాక్ చేయడంలోనూ కీలక పాత్ర పోషించారు. శ్రీలంకలోనూ దౌత్య ప్రతినిధిగా పనిచేసిన అనుభవం ఆయనకు ఉంది.


## బిహార్ ఓటరు జాబితాలో ఇంటెన్సివ్ రివిజన్ ప్రారంభం

భారత పౌరులు మాత్రమే ఓటు వేయవచ్చు : ఇసి



**న్యూఢిల్లీ :** బిహార్‌లో ఓటర్ల జాబితాల ప్రత్యేక ఇంటెన్సివ్ సవరణ ప్రారంభమైందని, భారత పౌరులు మాత్రమే ఓటు వేయవచ్చని చెప్పే రాజ్యాంగ నిబంధనను గుర్తుచేస్తుందని ఎన్నికల సంఘం శనివారం తెలిపింది. భారత రాజ్యాంగం అత్యున్నతమైనదని, అన్ని పౌరులు, రాజకీయ పార్టీలు, భారత ఎన్నికల కమిషన్ రాజ్యాంగాన్ని అనుసరిస్తాయన్నారు. ప్రతిపక్ష పార్టీలు ఈ ఇంటెన్సివ్ సవరణ వెనుక ఉద్దేశ్యాన్ని ప్రశ్నించడంతో ఇసి స్పందించింది. ఆర్టికల్ 326 ఓటరుగా మారడానికి అర్హతను నిర్దేశిస్తుందని, 18 ఏళ్లు పైబడిన భారతీయ పౌరులు, ఆ నియోజకవర్గంలో నివసించే సాధారణ నివాసితులు మాత్రమే ఓటర్ల జాబితాలో ఉండటానికి అర్హులు అని పోల్ అథారిటీ గుర్తు చేసింది. ఈ ప్రక్రియ రాష్ట్ర యంత్రాంగాన్ని ఉపయోగించి ఓటర్లను ఉద్దేశపూర్వకంగా మినహాయించే ప్రమాదాన్ని పొంచి ఉందని అనేక ప్రతిపక్ష పార్టీలు పేర్కొన్నాయి. బిహార్‌తో ప్రారంభమయ్యే ఆరు రాష్ట్రాల్లో విదేశీ అక్రమ వలసదారులను వారి జన్మస్థలాన్ని తనిఖీ చేయడం ద్వారా తొలగించడానికి పోల్ అథారిటీ ఈ సంవత్సరం ఓటర్ల జాబితాలను ఇంటెన్సివ్ సమీక్ష నిర్వహిస్తోంది. ఈ సంవత్సరం బిహార్‌లో ఎన్నికలు జరగనుండగా, అసోం, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలు 2026లో జరగనున్నాయి. బంగ్లాదేశ్, మయన్మార్‌తో సహా అక్రమ విదేశీ వలసదారులపై వివిధ రాష్ట్రాల్లో కఠిన చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో, తరువాత ఇతర రాష్ట్రాలకు విస్తరించనున్న ఈ చర్య ప్రాముఖ్యతను సంతరించుకుంది. అన్ని రాజకీయ పార్టీల 'పూర్తి భాగస్వామ్యం'తో ప్రతి ఓటరు అర్హతను ధృవీకరించడానికి బిహార్‌లో ప్రత్యేక సవరణ ఇప్పటికేవిజయవంతంగా ప్రారంభమైందని ఇసి తెలిపింది. పోల్ ప్యానెల్‌లో ఇప్పటికే దాదాపు 78,000 మంది బూత్ స్థాయి అధికారులు (బిఎల్‌ఒలు) ఉన్నారు. కొత్త పోలింగ్ కేంద్రాల కోసం 20,000 మందికి పైగా నియమిస్తున్నట్లు ఇసి తెలిపింది. స్పెషల్ ఇంటెన్సివ్ సవరణ సమయంలో లక్ష మందికి పైగా వలంటీర్లు నిజమైన ఓటర్లకు, ముఖ్యంగా వృద్ధులు, రోగులు, వికలాంగులు, పేదలు, ఇతర దుర్బల వర్గాలకు సహాయం చేయనున్నారు. అన్ని గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీలు ఇప్పటికే 1,54,977 మంది బూత్ స్థాయి ఏజెంట్లను (బిఎల్ఎలు) నియమించాయి. బిఎల్ఎలు పార్టీ కార్యకర్తలు, ఓటర్ల జాబితా సవరణ లేదా బోరోటేషన్ సమయంలో బిఎల్ఒలతో సమన్వయం చేసుకుంటారు. బిహార్‌లోని 243 అసెంబ్లీ నియోజకవర్గాల్లోని ప్రతి నియోజకవర్గంలో 7,89,69,844 మంది ఓటర్లకు కొత్త గణన ఫారమ్‌ల ముద్రణ, ఇంటింటికీ పంపిణీ ఇప్పటికే ప్రారంభమైందని ఇసి తెలిపింది.

# గుండిచాకు చేరిన పూరి జగన్నాథ రథయాత్ర



**పూరి :** ఒడిశాలోని పూరిలో జగన్నాథ రథయాత్ర కొనసాగుతోంది. శనివారం బలభద్రుడు, దేవి సుభద్ర, జగన్నాథుడి రథాలు గుండిచా ఆలయానికి చేరుకున్నాయి. 2.6 కి.మీ దూరంలో ఉన్న 12వ శతాబ్దపు జగన్నాథ ఆలయం నుండి బయలుదేరిన తర్వాత ప్రతి సంవత్సరం గుండిచాకు వెళ్తారు. ఈ ఆలయం దేవతల అత్తగారి స్థలంగా పరిగణించబడుతుంది. కాగా, తొమ్మిది రోజుల తర్వాత వారు ప్రధాన ఆలయానికి తిరిగి వెళ్తారు. 'బహుద యాత్ర' అని పిలువబడే తిరుగు ప్రయాణం ఈ సంవత్సరం జూలై 5న జరుగుతుంది. ఇదిలా ఉండగా, శనివారం ఉదయం 'జై జగన్నాథ్', 'హరి బోల్' మంత్రాల మధ్య భక్తులు మూడు రథాలను లాగడం ప్రారంభించారు. శుక్రవారం సాయంత్రం నాటికి రథాలు గుండిచా ఆలయానికి చేరుకోవాల్సి ఉంది. కానీ బలభద్రుడి తలద్వాజ రథం మలుపు తిరుగుతున్నప్పుడు ఇరుక్కుపోయి, మిగిలిన రెండు ముందుకు సాగకుండా నిరోధించడంతో వాటిని గ్రాండ్ రోడ్‌లో ఆపాల్సి వచ్చింది. సాంప్రదాయం ప్రకారం, ముందుగా 'తలద్వాజ' ప్రదక్షిణలు చేస్తారు, తరువాత దేవి సుభద్ర 'దర్పదాలన్', జగన్నాథుని 'నందిఘోష' చేస్తారు. దేవతలతో కూడిన రథాలను రాత్రంతా గట్టి భద్రత మధ్య రోడ్డుపైనే ఉంచారు. పట్టణంలో రాత్రంతా గడిపిన వేలాది మంది భక్తులు, గోంగూరలు, శంఖాల శబ్దాల మధ్య రథం లాగడంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రాష్ట్ర న్యాయశాఖమంత్రి పృథ్వీరాజ్ హరిచందన్, ప్రధాన కార్యదర్శి మనోజ్ అహూజా, డిజిపి వైబి ఖురానియా, ఇతర సీనియర్ అధికారులు జగన్నాథుని 'నందిఘోష'ను లాగుతూ కనిపించారు. రథాలు గమ్యస్థానానికి చేరుకున్న తర్వాత, వాటిని గుండిచా ఆలయం వెలుపల నిలిపి ఉంచారు. ఆదివారం ఉత్సవ ఊరేగింపుతో దేవతలను ఆలయం లోపలికి తీసుకువెళతారు. రథయాత్ర నిర్వహించినందుకు భక్తులతో సహా ఇతరులందరకీ కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు శ్రీ జగన్నాథ ఆలయ పరిపాలన ప్రధాన నిర్వాహకుడు అరబింద పాధీ తెలిపారు. అయితే రథాల భద్రత, జనసమూహాన్ని నియంత్రించడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు డిజిపి వైబి ఖురానియా తెలిపారు. శనివారం రథయాత్ర సందర్భంగా అస్వస్థతకు గురైన 600 మందికి పైగా భక్తులు పూరీలోని వివిధ ఆసుపత్రులలో చికిత్స పొందారు. వారిలో చాలా మంది తోపుడు కారణంగా గాయపడగా, 200 మందికి పైగా వేడి, తేమతో కూడిన వాతావరణ పరిస్థితుల్లో స్పృహ కోల్పోయారు. శుక్రవారం వార్షిక రథయాత్రలో పది లక్షల మంది భక్తులు పాల్గొన్నారని, శనివారం పవిత్ర పట్టణంలో దాదాపు 5 లక్షల మంది ఉన్నారని, తేలికపాటి వర్షం ఉన్నప్పటికీ శనివారం వాతావరణం అనుకూలంగా ఉందని అధికారులు తెలిపారు. ఒడిశా పోలీసులు, కేంద్ర సాయుధ పోలీసు దళం, ఎన్ఎస్‌జి, ఇతరులకు చెందిన దాదాపు 10,000 మంది సిబ్బందిని మోహరించడంతో పటిష్ట భద్రతా ఏర్పాట్ల మధ్య రథయాత్ర జరుగుతోంది. రథయాత్ర సజావుగా సాగడానికి పోలీసులు అన్ని ఏర్పాట్లు చేశారని, జనసమూహంపై నిఘా ఉంచడానికి 275కి పైగా ఎఐ ఎనేబుల్డ్ సిసిటివి కెమెరాలను ఏర్పాటు చేసినట్లు ఒక సీనియర్ అధికారి తెలిపారు.

## కాల్పుల విరమణకు చేరువలో గాజా

అయినా ఇజ్రాయెల్ దాడి 49 మంది మృతి

**డైర్ అల్ బలాహ్ :** వచ్చేవారం కాల్పుల విరమణ జరిగే అవకాశం ఉందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెప్పిన తరుణంలో కూడా గాజాలో ఇజ్రాయెల్ మారణకాండ ఆగలేదు. శనివారంనాడు జరిగిన తాజా దాడుల్లో 49 మంది పాలస్తీనియన్లు మరణించారు. దాదాపు ప్రతిరోజూ అమాయకులైన పాలస్తీనా ప్రజలను ఇజ్రాయెల్ సైనిక దళాలు కాల్చి చంపుతున్నాయి. ఆహార సహాయ కేంద్రాలవద్ద ఆకలితో ఆహారం కోసం వేచి ఉన్న ప్రజా సమూహాలనే అనేక వారాలుగా ప్రతిరోజూ ఇజ్రాయెల్ సైన్యం కాల్పులు జరుపుతూ సగటున 15 మందిని పొట్టన పెట్టుకుంటున్నది. ఆహార కేంద్రాలవద్ద వేచి ఉన్న ప్రజలపై కాల్పులు జరపాలని ఉన్నతాధికారుల నుండి ఆదేశాలు ఉన్నట్లు కొందరు ఐ డి ఎఫ్ సైనికులు అంగీకరించారు. ఒక ఇంటర్వ్యూలో వారు ఈ విషయం అంగీకరించారు. మార్చి రెండో తేదీ నుండీ గాజాలోకి ఆహార సరఫరాలను ఐ డి ఎఫ్ నిలిపివేసింది. అప్పటి నుండీ లక్షలమంది ప్రజలు ఆకలితో అలమటించిపోతున్నారు. కాల్పుల్లో మరణిస్తున్నారు. ప్రపంచ దేశాల ఒత్తిడి మేరకు నెలరోజులుగా పరిమితంగా గాజా ప్రజలకు ఆహార సరఫరా చేస్తున్నారు.ఆహార సరఫరా కేంద్రాల సంఖ్యను కూడా ఇప్పుడు తగ్గించేశారు.

## పాకిస్థాన్‌లో ఆత్మాహుతిదాడి 13 మంది మృతి



**పెషావర్ :** పాకిస్థాన్‌లో అంతర్గత వేర్పాటువాద తిరుగుబాటు జరుగుతున్న ఖైబర్ పఖ్తూంఖ్వాలో ఆత్మాహుతి బాంబు దాడి జరిగింది. ఈ దాడిలో 13 మంది మరణించారు. ఉత్తర వజిరిస్థాన్ జిల్లా ఖద్దీ ప్రాంతంలో శనివారం ఉదయం బాంబ్ డిస్పోజల్ యూనిట్ కు చెందిన అంత్యశక్తిమంతమైన గనుల్లో ఉపయోగిం చే వాహనాన్ని ఆత్మాహుతి బాంబు ఢీకొట్టింది. ఆత్మాహుతికి సిద్ధపడిన వ్యక్తి పేలుడు పదార్థాలున్న వాహనంతో వేగంగా వచ్చి బాంబ్ డిస్పోజనల్ యూనిట్ వాహనాన్ని ఢీకొట్టడంతో భారీ విస్ఫోటనం జరిగిం ది. ఈ పేలుడుతో 24 మంది గాయపడ్డారు. గాయపడినవారిలో సాధారణ మహిళలు, పిల్లలు ఉన్నారు. వీరిలో చాలామంది పరిస్థితి ప్రమాదకరంగా ఉంది.

## వివాహ ప్రతిపాదన తిరస్కారంతో...
# సామూహిక అత్యాచారం

కోల్‌కతాలోని లా కాలేజీ విద్యార్థిని కేసులో పోలీసుల అనుమానం



**కోల్‌కతా :** కోల్‌కతాలోని లా కాలేజీ విద్యార్థిని కేసులో పోలీసులు ఘటన తీరును వివరించారు. ప్రధాన నిందితుడి వివాహ ప్రతిపాదనను తిరస్కరించడంతో ఆమెపై తీవ్ర ఆగ్రహంతోనే సామూహిక అత్యాచారం జరిగిందని పోలీసులు అనుమానిస్తున్నట్లు ఓ అధికారి శనివారం తెలిపారు. ఈ నేరం మొత్తం ముందస్తు ప్రణాళికతో జరిగిందా లేదా అని తెలుసుకోవడానికి కూడా పోలీసులు ప్రయత్నిస్తున్నారని ఆయన అన్నారు. బాధితురాలి వద్ద ప్రధాన నిందితుడి వివాహ ప్రతిపాదనను తీసుకురాగా, అందుకు ఆమె తిరిస్కంచినట్లు తెలుస్తుందని, దీంతో ప్రతీకారం పెంచుకున్న నిందితుడు బాధితురాలుపై సామూహిక అత్యాచారానికి పాల్పడినట్లుగా కనిపిస్తుందన్నారు. అయితే ఇది ముందస్తు ప్రణాళికతో చేసిన నేరమా లేదా అకస్మాత్తుగా జరిగిందా అనేది నిరూపించాల్సిన అవసరం ఉందని ఆ అధికారి పిటిఐకి తెలిపారు. ఆ మహిళ తనకు ఒక బాయ్‌ఫ్రెండ్ ఉన్నాడని, అతనితో సంతోషంగా ఉన్నానని, అతన్ని మోసం చేయనని ముగ్గురు నిందితులకు వివరించిందన్నారు. ఆ ముగ్గురూ తన ప్రియుడిని చంపేస్తామని, ప్రధాన నిందితుడిని ప్రతిఘటించడం కొనసాగిస్తే ఆమె తల్లిదండ్రులపై తప్పుడు కేసులు నమోదు చేస్తామని బెదిరించారని ఆమె ఆరోపించిందన్నారు. 'ప్రతి కోణంలోనూ దర్యాప్తు జరుగుతోంది. ముగ్గురు నిందితులు, బాధితురాలి కాల్ వివరాలను కూడా పరిశీలిస్తున్నాము' అని ఆ అధికారి పేర్కొన్నారు. లా కాలేజీ విద్యార్థిని తనపై సామూహిక అత్యాచారం జరిగిందనే ఆరోపణను వైద్య పరీక్షలో ధృవీకరించారు. సౌత్ కలకత్తా లా కాలేజీలో మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని జూన్ 25 సాయంత్రం ఆ సంస్థ లోపల ఒక పూర్వ విద్యార్థి, ఇద్దరు సీనియర్ విద్యార్థులు తనపై సామూహిక అత్యాచారం చేశారని పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే.

**సెక్యూరిటీ గార్డ్ అరెస్టు**

లా కాలేజీలో విద్యార్థినిపై అత్యాచారం చేసిన ఘటనలో శనివారం పోలీసులు సెక్యూరిటీ గార్డును అరెస్టు చేశారు. దీనితో, కళాశాల ఆవరణలోని గార్డు గదిలో జరిగిన ఘటనలో మొత్తం అరెస్టుల సంఖ్య నాలుగుకు చేరుకుంది. విచారణ కోసం పోలీసులు అదుపులోకి తీసుకున్న గార్డును ఆ తరువాత అరెస్టు చేసినట్లు ఒక అధికారి తెలిపారు. 'సెక్యూరిటీ గార్డు సమాధానాలు అసంబద్ధంగా ఉన్నట్లు విచారణలో తేలగా అతన్ని శనివారం ఉదయం పోలీసులు అరెస్టు చేశారన్నారు. అతని వైఖరి కళాశాలలో ఏర్పాటు చేసిన సిసిటివిలో రికార్డయిందన్నారు. గార్డు తన విధిని నిర్వర్తించడంలో విఫలమయ్యాడని, ఆ సమయంలో అతను ఒంటరిగా విధుల్లో ఉన్నాడా లేదా అని తెలుసుకోవడానికి పోలీసులు ప్రయత్నిస్తున్నారని అధికారి తెలిపారు. అత్యాచారం కేసులో ముగ్గురు నిందితులను నేరం చేయకుండా ఆపడానికి గార్డు తన సమాధానాలతో విభేదిస్తున్నాడని, అలాగే, అతను తన గది నుండి ఎందుకు, ఎవరి సూచనల మేరకు బయటకు వెళ్లాడనే దానిపై సమాధానం చెప్పాలని, ఇది కూడా నేరంలో ఒక రకమైన ప్రమేయం' అని అధికారి తెలిపారు.

**మరో ముగ్గురు నిందితులను గురువారం అరెస్టు చేశారు.**

**అత్యవసర చర్య తీసుకోండి : ఎన్‌సిడబ్ల్యు**

దక్షిణ కోల్‌కతా గ్యాంగ్ రేప్ కేసులో అత్యవసర చర్య తీసుకోవాలని ఆదేశాలు ఇవ్వాలని పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఎన్‌సిడబ్ల్యు లేఖ రాసింది. హక్కుల సంఘం సభ్యులు, బాధితారులు, ఆమె కుటుంబ సభ్యుల మధ్య బేటీకి రాష్ట్ర పోలీసుల సహకారం కావాలని ఆ లేఖలో విజ్ఞపి చేసింది. ఎన్‌సిడబ్ల్యు చైర్‌పర్సన్ విజయ రహత్కర్ ఈ ఘటనను తీవ్రమైనదిగా అభివర్ణించారు. ఇది ప్రజల మనస్సాక్షిని కదిలించిందన్నారు. శుక్రవారం మహిళా హక్కుల ప్యానెల్ ఈ కేసును సుమోటోగా స్వీకరించింది. బాధితురాలి భద్రత, గౌరవం, శ్రేయస్సు పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. బాధితురాలి, ఆమె కుటుంబాన్ని కలవడానికి నియమించిన ఎన్‌సిడబ్ల్యు సభ్యురాలు అర్చన ముజుందార్‌తో రాష్ట్ర పోలీసులు పూర్తిగా సహకరించాలని రహత్కర్ ప్రధాన కార్యదర్శికి రాసిన లేఖలో ఆదేశించారు.

బాధితురాలి తక్షణ, గోప్యమైన అంతర్గత వైద్య పరీక్షను కూడా కమిషన్ కోరింది. మూడు రోజుల్లోగా ఎన్‌సిడబ్ల్యుకి అంతర్గత, బాహ్య వైద్య నివేదికలను సమర్పించాలని కోరింది. అంతేకాకుండా, బాధితురాలు, ఆమె కుటుంబానికి పటిష్ట భద్రత కల్పించాలని కమిషన్ రాష్ట్రాన్ని కోరింది.


WARANGAL URBAN CO-OPERATIVE BANK LTD.,
WARANGAL
BALANCE SHEET AS ON 31ST MARCH 2025
Form 'A'

| | Schedule | As on 31.03.2025 | As on 31.03.2024 |
|---|---|---|---|
| I. Capital & Liabilities | | | |
| Capital | 1 | 5,06,92,065.00 | 4,65,93,275.00 |
| Reserves & Surplus | 2 | 20,95,06,927.00 | 18,55,05,772.96 |
| Deposits | 3 | 2,19,02,49,371.88 | 1,91,55,40,383.33 |
| Borrowings | 4 | - | - |
| Other Liabilities & Provisions | 5 | 3,26,54,405.80 | 3,67,22,317.41 |
| | Total | 2,48,31,02,769.68 | 2,18,43,61,748.70 |
| II. Assets | | | |
| Cash bank & Balance with RBI | 6 | 6,67,16,004.00 | 6,80,31,513.00 |
| Balance with Banks & Money at Call & Short notice | 7 | 31,99,70,905.98 | 27,54,71,629.79 |
| Investments | 8 | 45,12,56,303.00 | 41,17,19,748.00 |
| Advances | 9 | 1,54,12,17,763.12 | 1,36,16,72,083.40 |
| Fixed Assets | 10 | 4,03,24,718.35 | 1,56,75,879.40 |
| Other Assets | 11 | 6,36,17,075.23 | 5,17,90,895.11 |
| | Total | 2,48,31,02,769.68 | 2,18,43,61,748.70 |
| Contingent Liabilities | 12 | | |
| Bank Guarantees | | 65,92,500.00 | 63,62,500.00 |
| Bills for Collection DEAF A/c with RBI | | 8,32,383.61 | 8,30,905.71 |
| Significant Accounting Policies | 18 | | |
| Notes to Accounts | 19 | | |

The Schedules referred to above form an integral part of the accounts.

PROFIT AND LOSS ACCOUNT FOR THE YEAR ENDING 31st MARCH 2025
Form 'B'

| | Schedule | As on 31.03.2025 | As on 31.03.2024 |
|---|---|---|---|
| I Income | | | |
| Interest earned | 13 | 22,86,51,619.96 | 20,85,92,083.21 |
| Other Income | 14 | 1,13,22,326.50 | 70,49,987.03 |
| | Total | 23,99,73,946.46 | 21,56,42,070.24 |
| II Expenditure | | | |
| Interest Expended | 15 | 14,56,89,723.56 | 12,52,93,260.04 |
| Operating Expenses | 16 | 6,30,78,329.47 | 5,40,39,073.21 |
| Provisions & contingencies & Write off | 17 | 89,51,849.89 | 1,26,59,750.10 |
| | Total | 21,77,19,902.92 | 19,19,92,083.35 |
| III. Profit/Loss | | | |
| Net Profit/Loss (-) for the year | | 2,22,54,043.54 | 2,36,49,986.89 |
| Profit/Loss (-) brought forward | | 2,36,49,992.89 | 2,68,47,084.52 |
| | Total | 4,59,04,036.43 | 5,04,97,071.41 |
| IV. Appropriations | | | |
| Transfer to statutory reserves | | 1,09,89,027.89 | 1,20,81,181.00 |
| Transfer to other reserves | | 70,94,997.00 | 1,47,65,897.52 |
| Transfer to proposed dividend | | 55,65,962.00 | - |
| Balance carried over to balance sheet | | 2,22,54,049.54 | 2,36,49,992.89 |
| | Total | 4,59,04,036.43 | 5,04,97,071.41 |

Significant Accounting Policies and Notes to accounts,
The Schedules referred to above form an integral part of the accounts.

Sd/-
P.V. Narayana Rao & Associates
(Statutory Auditor)

Sd/-
M. Satyanarayana Rao
(Chief Executive Officer(I/c))



# జనరల్
STATE & REGIONAL NEWS

## రాష్ట్రంలో రానున్న నాలుగు రోజులు వర్షాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో రాగల నాలుగురోజుల పాటు ఉరుములు, మెరుపులు, బలమైన ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. శనివారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశాలున్నాయన్నారు. ఆదివారం రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, సంగారెడ్డి, కామారెడ్డి జిల్లాల్లో వర్షాలు కురుస్తాయన్నారు. సోమవారం రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉందని వివరించారు. ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేశామన్నారు.

# మాన్సూన్ ఎమర్జెన్సీ బృందాలు సిద్ధం

### బాధ్యతలు అప్పగించిన హైడ్రా



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వర్షాకాలం వరద ముప్పు నుంచి నగరాన్ని కాపాడేందుకు ఉద్దేశించిన మాన్సూన్ ఎమర్జెన్సీ బృందాలు సిద్ధమయ్యాయి. టెండర్ల ప్రక్రియను పూర్తి చేసిన తర్వాత ఎంపిక చేసిన ఎంఈటిలకు సర్కిళ్ల వారీ విధులను శనివారం హైడ్రా అప్పగించింది. మొత్తం 30 సర్కిళ్లలో 150 బృందాలు జులై 1వ తేదీ నుంచి పని చేయనున్నాయి. విధి నిర్వహణలో ఎక్కడా ఎలాంటి అలసత్వం ప్రదర్శించవద్దని హైడ్రా కమిషనర్ ఏ.వి.రంగనాథ్ ఈ బృందాలకు సూచించారు. వర్షం ఎప్పుడు పడినా అప్రమత్తంగా ఉండి, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాల్సిన బాధ్యత ఉందన్నారు. వర్షానికి ముందే రహదారుల్లో నీరు వెళ్లేందుకు ఆటంకాలు లేకుండా చూడాలన్నారు. నాలాలను, కల్వర్టులను పరిశీలించి, వరద నీటి ప్రవాహం సాఫీగా సాగేలా జాగ్రత్తపడాలన్నారు. ఎక్కడ నీరు నిలుస్తుందో ముందుగానే ఒక అంచనాకు వచ్చి, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. చెట్లు పడిపోతే వెంటనే వాటిని తొలగించాలన్నారు. 150 ఎంఈటి బృందాలకు హైడ్రా డిఆర్ఎఫ్ బృందాలు కూడా సహకరిస్తాయని, సమన్వయంతో పని చేయాల్సినవసరం ఉందన్నారు. వరద నివారణ చర్యలకు అవసరమైన పనిముట్లను అందజేస్తుందన్నారు. సిబ్బందికి హైడ్రా శిక్షణ కూడా ఇస్తుందన్నారు. ఎక్కడ ఏ సమస్య ఉన్నా ఆయా ప్రాంతాల హైడ్రా ఎస్ఎఫ్ఓలకు తెలయజేయడమే కాకుండా, ఆ సమాచారాన్ని హైడ్రా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ వర్షాకాలం నగర ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పని చేసి, మంచి గుర్తింపు పొందాలని దిశానిర్దేశం చేశారు.

**వాన రాకడపై సరైన సమాచార ప్రయత్నం**
**వివిధ విభాగాలతో హైడ్రా సమన్వయం**

వర్షానికి సంబంధించి సరైన సమాచారం ఇచ్చేందుకు హైడ్రా ప్రయత్నిస్తోంది. ఇందుకు గాను వివిధ శాఖలకు చెందిన విభాగాలతో సమన్వయం కుదుర్చుకునే పనిలో నిమగ్నమైంది. ఈ క్రమంలో పట్టణ ప్రాంతాల్లో వాతావరణ అంచనా, పర్యవేక్షణ అనే అంశంపై శనివారం ఓ సదస్సును నిర్వహించింది. వర్షానికి సంబంధించి సరైన సమాచారం ముందుగానే నగర ప్రజలకు అందించడానికి అనుసరించాల్సిన పద్ధతులపై చర్చించింది. ఎంత మొత్తంలో, ఏఏ ప్రాంతాల్లో, ఎప్పుడు వర్షం పడుతోంది అనే కచ్చితమైన సమాచారం నగర ప్రజలకు చేరవేయాల్సిన అవసరాన్ని హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ చెప్పారు. ఇందుకు అనుసరించాల్సిన పద్ధతులపై వివిధ శాఖలు, విభాగాలకు చెందిన నిపుణులు కలసి పని చేయాల్సినవసరం ఉందన్నారు. వర్షానికి సంబంధించిన కచ్చితమైన సమాచారం ఇవ్వగలిగితే, నగరంలో ట్రాఫిక్ సమస్యను కొంతమేర తగ్గించవచ్చునని అన్నారు.

**వివిధ విభాగాలతో వర్కింగ్ గ్రూప్..**

హైడ్రా, వాతావరణ శాఖ(ఐఎండి), తెలంగాణ రిమోట్ సెన్సింగ్ అప్లికేషన్స్ సెంటర్, తెలంగాణ స్టేట్ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ, నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్, ఐఐటి హైదరాబాద్‌తో కలిసి ఒక వర్కింగ్ గ్రూప్‌ను ఏర్పాటు చేయాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్ నిర్ణయించారు. ఈ విభాగాలన్ని సమన్వయంతో పని చేసి వర్షాన్ని అంచనా వేయడంతో పాటు, తర్వాత జరిగే పరిణామాలను ఎదుర్కొనేందుకు యంత్రాంగాన్ని సన్నద్ధం చేస్తాయన్నారు. నగరంలో దాదాపు 157 ఆటోమేటిక్ వెదర్ స్టేషన్‌లు ఉన్నాయని, వీటి సంఖ్యను పెంచుకోవాల్సి ఉందన్నారు. ప్రభుత్వ కార్యాలయాలను ఇందుకు వేదికలు చేసుకోవాలని సూచించారు. గాలుల తీవ్రతను కూడా అంచనా వేయాల్సినవసరం ఉందన్నారు. ఒక చదరపు కిలోమీటరు పరిధిలో ఒక సెంటీమీటర్ వర్షం పడితే 9.96 మిలియన్ లీటర్ల నీరు అందుబాటులోకి వస్తుందని, ఆ నీరు ఎంత మేర భూమిలోకి ఇంకుతుందో చూసుకుని వరదను అంచనా వేయవచ్చునని ఐఎండి రిటైర్డ్ డిజి డాక్టర్ కె.జె. రమేష్ అన్నారు. హైడ్రా అదనపు సంచాలకులు వర్ల పాపయ్య, రీజనల్ ఫైర్ ఆఫీసర్ జయప్రకాష్, ఐఎండి తెలంగాణ డైరెక్టర్ నాగరత్న, టిజిడిపిఎస్ కన్సల్టెంట్ రామారావు, ఐఎండి నుంచి శ్రీధర్, ఎన్ఆర్ ఎస్‌సికి చెందిన నరేంద్ర, సురేంద్రబాబు, ఇన్‌కాయిస్ డాక్టర్ ప్రసాద్, ఐఐటి ప్రొఫెసర్ సతీష్, వెదర్ మ్యాన్ బాలాజీ ఈ సదస్సులో పాల్గొని పలు సూచనలు చేశారు.

## స్వేచ్ఛ ఆత్మహత్యకు పూర్ణచంద్రరావే కారణం: స్వేచ్ఛ తండ్రి ఆరోపణ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** యాంకర్ స్వేచ్ఛ ఆత్మహత్యకు పూర్ణచంద్రరావు అనే వ్యక్తి కారణమని స్వేచ్ఛ తండ్రి ఆరోపించాడు. భర్తతో విడిపోయాక స్వేచ్ఛ పూర్ణచంద్రరావుతో ఉంటోందన్నారు. స్వేచ్ఛ, పూర్ణచంద్రరావు మధ్య విభేధాలు ఉన్నట్లు ఆయన తెలిపారు. పూర్ణతో కలిసి ఉండలేను నాన్న అని తనకి జూన్ 26న ఫోన్ చేసిందన్నారు. ఈ విషయంలోనే నా కూతురు మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకుంది. నా కూతురు ఆత్మహత్యకు కారణమైన పూర్ణను కఠినంగా శిక్షించాలని తండ్రి ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్ జవహర్‌నగర్‌లోని టి ఛానల్ జర్నలిస్టు, యాంకర్ స్వేచ్ఛ ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసింది. శుక్రవారం ఇంట్లో ఉరివేసుకుని ఆమె ఆత్మహత్య చేసుకున్నారు. కేసు నమోదు చేసుకున్న చిక్కడపల్లి పోలీసులు ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శనివారం మృతదేహాన్ని గాంధీకి తరలించారు. ఈ మేరకు వైద్యులు స్వేచ్ఛ మృతదేహానికి గంటపాటు పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం వైద్యులు సంచలన విషయాలు తెలిపారు.

**పోస్టుమార్టం రిపోర్టు..**

''మా వద్దకు స్వేచ్ఛ మృతదేహం ఈ రోజు ఉదయం11.46 నిమిషాలు వచ్చింది. గంటలో పోస్టుమార్టం అయిపోయింది. ఆమె ఒంటిపై ఎటువంటి గాయాలు లేవు. గొంతుపై ఉరివేసుకున్న గుర్తులు ఉన్నాయి. మంచం మీద స్టూల్ పెట్టుకుని లుంగీతో ఉరివేసుకున్నారు. చనిపోయిన తర్వాత కాళ్లు మంచానికి తగలడంతో బ్లూ కలర్లో మారిపోయాయి. దాడి చేసినట్లు గాయాలు లేవు. ఉరి వేసుకున్న తర్వాత మూడు కేజీలు బరువు తగ్గింది. మూడు నిమిషాల్లోనే చనిపోయారు. ఉరి వేసుకునే యాంకర్ స్వేచ్ఛ చనిపోయారు. ఉరి తర్వాత నాలుక కూడా కొరుక్కున్నారు. మెడ దగ్గర బ్లడ్ సరఫరా ఆగిపోతుంది. నోటి వెంట బ్లడ్ కారడం మామూలే. స్వేచ్ఛ కాళ్లు, ముఖంపై ఎలాంటి గాయాలు లేవు. స్వేచ్ఛ స్టమక్ నుంచి శ్యాంపిల్స్ తీసుకున్నాం. పురుగుల మందు లాంటివి తీసుకోలేదు. ఎల్లో ఫుడ్ తీసుకున్నట్లు ప్రాథమికంగా కనిపిస్తోంది. స్మెల్ వస్తోంది... ఫుడ్ ఏంటనేది ల్యాబ్ రిపోర్టు వస్తే తెలుస్తుంది.

**యాంకర్‌గా 18 ఏళ్లు ..**

దాదాపు 18 సంవత్సరాలుగా పలు టీవీ చానల్స్‌లో యాంకర్‌గా పని చేశారు స్వేచ్ఛ. మొదట టీవీ9 ఛానల్‌లో పనిచేసే బాగా పాపులారిటీ సంపాదించారు. అంతేకాదు టియుడబ్ల్యూజె సెక్రటరీగా పనిచేసిన అనుభవం స్వేచ్ఛకు ఉంది. అయితే తాజాగా చనిపోయిన యాంకర్ స్వేచ్ఛ ఆత్మహత్య సంఘటనలో బిగ్ ట్విస్ట్ నెలకొంది. స్వేచ్ఛకు ఇప్పటికే పెళ్లై 13 సంవత్సరాల కూతురు కూడా ఉందని తెలుస్తోంది.

## మోదీ వైఫల్య విధానాలతో క్షీణిస్తున్న ఆర్థికవ్యవస్థ, పెట్టుబడుల వృద్ధి

### కాంగ్రెస్ విమర్శ

**న్యూఢిల్లీ :** నరేంద్రమోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న అణచివేత విధానాల కారణంగా దేశ ఆర్థిక వ్యవస్థ, పెట్టుబడులవృద్ధి మందగమనంలో పడిందని కాంగ్రెస్‌పార్టీ విమర్శించింది. ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి (కమ్యూనికేషన్స్ విభాగం) జైరామ్ రమేశ్ శనివారంనాడు ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టింగ్ పెడుతూ, నిర్దేశించినవిధంగా అనుకూల నిష్పత్తిలో ఆర్థికవృద్ధి వేగం పుంజుకుకోవడానికి నరేంద్రమోదీ అణచివేత విధానాలు చాలా మొండిగా తిరస్కరిస్తున్నాయని విమర్శించారు. ఆర్థికవృద్ధికి ఊతం ఇచ్చేందుకు చాలా ఉదారంగా 2019 సెప్టెంబరు నెలలో పన్నుల కోతలు, ఉత్పత్తితో ముడిపడిన నగదు ప్రోత్సాహకాలు ఇచ్చినప్పటికీ కూడా ప్రైవేటు కార్పొరేట్ పెట్టుబడి మందగమనంలో కొనసాగడమే ఈ వైఫల్యానికి ప్రధాన కారణమని ఆయన విమర్శించారు. గత ఏడాదితో పోల్చి చూస్తే 2025–26 ఆర్థిక సంవత్సరంలో ప్రైవేటు రంగంలో మూలధన వ్యయాలు 25 శాతం మేకు క్షీణించే అవకాశం ఉందని మోదీ ప్రభుత్వం సొంతంగా నిర్వహించిన సర్వే నివేదికే వెల్లడించిందని, దీనికి ఇంతకన్నా నిదర్శనం ఇంకేంకావాలని ప్రశ్నించారు. ''బ్యాంకులు రుణాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాయి, కంపెనీలు మాత్రం అప్పులు తీసుకోవడానికి సిద్ధంగా లేవు, ఎందుకంటే పెట్టుబడుల వాతారణం ఎంతమాత్రం విస్తరణ చర్యలకు అనుకూలంగా లేకపోవడంతో కంపెనీలు రుణాలు తీసుకోవడానికి సుముఖంగా లేవు అని విశ్లేషకులు చెబుతున్నారు, పెరుగుతున్న గిరాకీ పెట్టుబడులకు ఒక సానుకూలమైన వాతావరణాన్ని సృష్టిస్తుంది. ఐతే ప్రపంచవ్యాప్తంగా నిస్సందేహంగా చాలా అనిశ్చితమైన వ్యాపార,వాణిజ్య పరిస్థితులు నెలకుని ఉన్నాయి, కానీ భారతదేశంలో మాత్రం గిరాకీ పెరగాల్సి ఉంది, కానీ వేతనాలు స్తంభించిపోయిన కారణంగా గిరాకీవృద్ధి స్తంభించింది, అస్తవ్యస్తమైన జిఎస్‌టి విధానం కూడా ఇందుకు ప్రధాన కారణం, దీనివల్ల అసమానతలు గణనీయంగా పెరుగుతున్నాయి. ఇది చాలా సుస్పష్టంగా తెలుస్తున్న విషయం'' అని జైరామ్ రమేశ్ ఎక్స్ వేదికగా మోదీ ప్రభుత్వంపై విమర్శల వర్షం కురిపించారు. ''చాలా విస్తారంగా వినియోగం మందగించింది, కార్పొరేట్‌శక్తులు పెట్టుబడులుపెట్టడానికి వీలుగా ఒక పద్ధతి ప్రకారం ప్రోత్సాహకాలు ఇవ్వడంలేదు, అదనపు సామర్థ్యాన్ని సమకూర్చుకోవడానికి ఒక క్రమపద్ధతి పాటించడంలేదు'' అని విమర్శిఃచారు. చాలా రకాల మానసికమైన, ఆలోచనాత్మక ధోరణులు ప్రభావితం చేయడం ద్వారా పెట్టుబడులు పెట్టడానికి ఆర్థిక నిర్ణయాలు తీసుకుంటారు, కానీ పన్నుల వ్యవస్థలో చట్టబద్ధంగానో, చట్టవిరుద్ధంగానో భారీ వసూళ్ళకు అధికారులు చేసే విపరీతమైన ప్రయత్నాలవల్ల గందరగోళ పరిస్థితులు నెలకొనడంవల్ల పైన పేర్కొన్న ప్రతికూల కారకాలన్నీ బలంగా పని చేస్తున్నాయి, ఈ క్రీడలన్నింటివల్లా కార్పొరేట్ ప్రపంచంలో విస్తారంగా భయాలు, అభద్రత నెలకున్నాయి, చివరకు ఇది పెట్టుబడుల మందగమనానికి దారితీస్తున్నది, మోదీ అనుసరిస్తున్న అణచివేత విధానా ల పర్యవసానాలే ఇవన్నీ'' అని జైరామ్ రమేశ్ విమర్శించారు.

## అన్నపూర్ణ క్యాంటీన్‌ల పేరు మార్పు విరమించుకోవాలి

### బిఆర్ఎస్ సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అన్నపూర్ణ క్యాంటీన్‌ల పేరు మార్పు ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని బిఆర్ఎస్ సనత్ నగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు. అన్నపూర్ణ క్యాంటీన్‌ల పేరు మార్పుపై బిఆర్ఎస్ కార్పొరేటర్లు శనివారం జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. రూ. 5 కే పేదల కడుపు నింపే అన్నపూర్ణ క్యాంటీన్‌ల పేరు మార్చాలనే జిహెచ్ఎంసి స్థాయీసంఘం నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఫ్లకార్డులతో నిరసన చేపట్టారు. బిఆర్ఎస్ కార్యకర్తలను గేటు బయటే పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయం ముందు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. జిహెచ్ఎంసి కార్యాలయంలోకి వెళ్లేందుకు బిఆర్ఎస్ నేతలు యత్నించారు. బిఆర్ఎస్ కార్పొరేటర్లతో కలిసి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ హైదరాబాద్ జంట నగరాలకు ఎంతో మంది వస్తుంటారని, అలాంటి వారికి కడుపునిండా అన్నం పెట్టాలని అన్నపూర్ణ క్యాంటీన్‌ల పథకం కెసిఆర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశామని తెలిపారు. అన్నపూర్ణ పేరు మార్చాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయానికి వచ్చిందన్నారు. పేరు మార్చాలని ఉద్దేశం ఉంటే జిహెచ్ఎంసి కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేసి మెజార్టీ సభ్యుల ఆమోదం మేరకు నిర్ణయం తీసుకోవాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అనేక హామీలు ప్రజలకు ఇచ్చిందన్నారు. 'ఆరు గ్యారెంటీలకు నచ్చిన పేరు పెట్టుకోండి.. మాకు అభ్యంతరం లేదు. అన్నపూర్ణ పేరు మార్పు మంచి పద్ధతి కాదు' అని తలసాని అన్నారు. ఆరోగ్య శ్రీ తెచ్చిన రాజశేఖర్ రెడ్డి పేరే తాము కొనసాగించడం జరిగిందన్నారు. ఈరోజు పిజెఆర్ ఫ్లైఓవర్ ప్రారంభిస్తున్నారని, మరి అది కట్టింది ఎవరు అని ప్రశ్నించారు. తిమ్మిని బొమ్మను చేయడం కాంగ్రెస్ పార్టీకి అలవాటే అని తలసాని శ్రీనివాస్ యాదవ్ విమర్శించారు. పేరు మార్పు వెనక్కి తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని ప్రభుత్వాన్ని తలసాని శ్రీనివాస్ యాదవ్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ ఎంఎల్‌ఎ ముఠాగోపాల్, బిఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకులు ముఠా జయసింహ, కార్పొరేటర్లు సునీత, సామల హేమ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎస్‌హెచ్‌ఒలు నిబద్ధతతో పనిచేయాలి

### డిజిపి డాక్టర్ జితేందర్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రవ్యాప్తంగా ఉన్న స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌ఒ)లు నిబద్ధతో పని చేస్తే ఇప్పటి కే అగ్రస్థానంలో ఉన్న తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ ఆ స్థానాన్ని నిలుపుకోగలుగుతుందని రాష్ట్ర డిజిపి డాక్టర్ జితేందర్ అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి వచ్చిన స్టేషన్ హౌస్ ఆఫీసర్లతో శనివారం నాడు డిజిపి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డిజిపి మాట్లాడుతూ.... పోలీసు వ్యవస్థలో స్టేషన్ హౌస్ ఆఫీసర్లు కీలకపాత్ర వహిస్తారని ఆ స్థాయిలో నిబద్ధతతో పనిచేస్తే తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ అగ్రస్థానాన్ని కొనసాగించగలుగుతుందనే ఆశాభవం వ్యక్తం చేశారు. ప్రజల క్షేమమే పరమావధిగా భావిస్తూ స్టేషన్ హౌస్ ఆఫీసర్లు నిజాయితీగా పనిచేయాలని సూచించారు. స్టేషన్ హౌస్ ఆఫీసర్లు తమ పనితీరును మెరుగుపరచుకోవడమే గాక తమ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న సిబ్బందిలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. క్యూఆర్ కోడ్ సంతృప్తిని రాష్ట్రస్థాయి పోలీస్ అధికారులు అంచనా వేస్తున్నారని ఉన్నారు. 100 శాతం చేరుకొని స్టేషన్ హౌస్ ఆఫీసర్లు కృషి చేయాలన్నారు. ఇండియా జస్టిస్ రిపోర్ట్ ప్రకారం తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ ప్రథమ స్థానంలో ఉండడమే కాక, మినిస్ట్రీ ఆఫ్ హోమ్ ఎఫైర్స్ వారు ప్రకటిస్తున్న టాప్ పోలీస్‌స్టేషన్లో తెలంగాణ రాష్ట్ర పోలీస్ స్టేషన్లు కూడా అవార్డులు గెలుచుకోవడం గమనించాలని, ఈ రకమైన ప్రశంసలు తమకు కూడా రావాలని రాష్ట్రంలోని స్టేషన్ హౌస్ ఆఫీసర్లందరూ నిబద్ధతతో పని చేసినప్పుడే తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ మరింతగా పేరు సంపాదిస్తుందన్నారు. శాంతి భద్రతల అడిషనల్ డిజిపి మహేష్ ఎం భగవత్ మాట్లాడుతూ.... ప్రస్తుతం వ్యవసాయ పనులు వేగంగా జరుగుతున్నందున నకిలీ విత్తనాల అమ్మకాలపై, ఉత్పత్తిదారులపై నిఘా పెట్టాలని అన్నారు. అవసరమైతే పి.డి యాక్ట్ పెట్టి నిందితులను శిక్షించాలనీ తద్వారా రైతులను ఆదుకోవాలని సూచించారు. శాంతి భద్రతల ఏఐజి రమణ కుమార్, డిఎస్‌పి సత్యనారాయణ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

## దేశంలో టీకా వేయించుకోని పిల్లలు 0.06 శాతమే: డబ్ల్యుహెచ్‌ఒ

**న్యూఢిల్లీ :** దేశంలో గత ఏడాది టీకా వేయించుకోకుండా మిగిలిపోయిన పిల్లలు లేదా ఎప్పటికీ టీకా వేయించుకోని పిల్లలు (జీరో డోస్) కేవలం 0.06 శాతంగా మాత్రమే నమోదయ్యారని కేంద్ర ఆరోగ్యమంత్రిత్వశాఖ శనివారం ప్రకటించింది. ఐక్యరాజ్యసమితికి చెందిన ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్‌ఓ) విషయం వెల్లడించిందని పేర్కొంది. 2023లో దేశం లో టీకా వేయించుకోకుండా దూరంగా ఉండిపోయిన పిల్లలు 0.11 శాతం మాత్రమే ఉండగా, 2024 నాటికి 0.06 శాతానికి తగ్గిపోయిందని, దాదాపు అందరూ రోగనిరోధకశక్తిని పెంచుకోవడానికి తగిన చైతన్యంతో ఉన్నారని పేర్కొంది. పిల్లల్లో మరణాల శాతాన్ని అంచనావేసేందుకు ఐక్యరాజ్యసమితిలో ఉండే ఏజన్సీలతో కూడిన గ్రూపులు 2024 వ సంవత్సరంలో తయారు చేసిన అంచనాల నివేదిక ఈ విషయాన్ని వెల్లడించిందని కేంద్ర ఆరోగ్యశాఖ తెలిపింది. పిల్లల్లో రోగనిరోధకశక్తిని పెంచేందుకు వీలుగా దేశంలో నిత్యం టీకాల పంపిణీ సేవల కార్యక్రమాలు జరుగుతూనే ఉంటాయని, ఎంతచేసినా కొంతమంది పిల్లలు వీటికి దూరమవుతారని, కానీ దేశంలో ఈ శాతాన్ని గణనీయంగా తగ్గించామని కేంద్రం తెలిపింది. సాధారంగా పిల్లలకు పుట్టగానే ఎదిగే దశలో మౌలికంగా కంఠరోహిణి (డిఫ్తీరియా), ధనుర్వాతం (టెటనస్), పెర్టుసిస్ (కోరింతదగ్గు) రాకుండా టీకా (డిటిపి) వేస్తారు. ఈ మౌలికమైన టీకాకు దూరంగా పిల్లలను ప్రధానంగా జీరోడోస్ వేయించుకోని పిల్లలుగా పరిగణనలోకి తీసుకుంటారు. ఈ విధంగా డిటిపి చేయించుకోని పిల్లలసంఖ్య దేశంలో గణనీయంగా తగ్గిపోయిందని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ పేర్కొంది. దేశమంతటా భారీ ప్రచార కార్యక్రమాలు నిర్వహించడంవల్లనే దీనిని సాధించామని తెలిపింది. మన ఆశావర్కర్లు, ఎఎన్ఎంలు దేశంలో 1.30 కోట్ల మేరకు టీకా పంపిణీ కార్యక్రమాలు నిర్వహించారని తెలిపింది. దీనిఫలితంగా పిల్లల్లో రోగనిరోధకశక్తి పెరిగిందన్నారు.

## మెదక్ కోర్టు భవనంపై నుంచి దూకిన కుటుంబం..

### ఒకరు మృతి.. ముగ్గురి పరిస్థితి విషమం..!



**మెదక్ :** మెదక్‌లో విషాదకర ఘటన చోటు చేసుకున్నది. కోర్టు భవనంపై నుంచి కుటుంబం దూకింది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా.. మరో ముగ్గురు తీవ్ర గాయాలతో ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్నారు. ఇద్దరు కుమార్తెలతో కలిసి దంపతులు కోర్టు భవనంపై నుంచి కిందకు దూకారు. ఈ ఘటనలో భార్య రమ్య తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందింది. భర్త నవీన్‌తో పాటు ఐదు, రెండేళ్లున్న కుమార్తెలకు తీవ్ర గాయాలయ్యాయి. వారి ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నది. ముగ్గురు కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతుండగా.. వారిని ఆసుపత్రికి తరలించారు. బాధితులను మెదక్ జిల్లా దౌల్తాబాద్ గ్రామసులుగా గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ జరుపుతున్నారు. ఘటనకు గల కారణాలు తెలియాల్సి ఉన్నది.


## అత్యంత పురాతన జీవన నాగరికతలో భారత్‌కు ఒక విశిష్టస్థానం

### ప్రధాని మోదీ ఉద్ఘాటన

**న్యూఢిల్లీ :** అత్యంత పురాతన జీవన నాగరికత విలసిల్లిన దేశంగా భారత దేశానికి ప్రపంచంలోనే ఒక విశిష్ఠ స్థానం దక్కిందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. ఋషుల అమర తాత్విక ఆలోచనల కారణంగానే ఈ ఖ్యాతి దక్కిందని ప్రధాని అన్నారు. శనివారం ఇక్కడ జరిగిన ప్రముఖ జైన ఆధ్యాత్మిక గురు ఆచార్య విద్యానంద్ మహరాజ్ జీ శత జయంతి ఉత్సవాలకు హాజరైన ప్రధానమంత్రి నరేంద్రమోదీ వివిధ రంగాలకు విద్యానంద్ మహరాజ్ జీ అందించిన కృషికి ఘన నివాళులు అర్పించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అన్నింటికీ ఆయన ఆలోచనలే ప్రేరణ ఇచ్చాయని నొక్కిచెప్పారు.

## 'రోదసి యాత్ర నాది మాత్రమే కాదు, దేశం మొత్తానిది'

### అంతరిక్షం నుంచి ప్రధాని మోదీతో శుభాంశు శుక్లా



**న్యూఢిల్లీ :** అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో ఉన్న గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లాతో శనివారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సంభాషించారు. ఐఎస్ఎస్‌కు చేరుకోవడం గర్వంగా ఉందని శుక్లా అన్నారు. అలాగే తాను సురక్షితంగా ఉన్నట్లు మోదీకి తెలిపారు. శుభాంశు శుక్లాతో ప్రధాని సంభాషణ జరుపుతుండగా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎస్ఎస్)లో భారత్ మాతా కీ జై నినాదం మోగింది.

**మోదీ :** మీరు మాతృభూమి నుంచి దూరంగా ఉండొచ్చు. కానీ భారతీయుల హృదయాలకు దగ్గరగా ఉన్నారు. మీ పేరులోనే శుభం ఉంది. మీ యాత్ర కొత్తయుగానికి శుభారంభం. ఈ సమయంలో మేమిద్దరం మాత్రమే మాట్లాడుకుంటున్నాం. కానీ 140 కోట్ల మంది భారతీయుల భావాలు కూడా నాతో ఉన్నాయి. నా గొంతులో భారతీయుల ఉత్సాహం ఉంది. అంతరిక్షంలో భారతీయ జెండాను ఎగురవేసినందుకు మీకు నా హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. ముందుగా ఇది చెప్పండి. అక్కడ అంతా బాగా ఉందా? మీ ఆరోగ్యం బాగుందా?

**శుభాంశు :** ప్రధానమంత్రి జీ, 140 కోట్ల మంది భారతీయులకు శుభాకాంక్షలు తెలిపినందుకు ధన్యవాదాలు. మీ అందరీ ప్రేమ, ఆశీర్వాదాలతో నేను ఇక్కడ క్షేమంగా, సురక్షితంగా ఉన్నాను. ఇక్కడ చాలా బాగుంది. ఇది ఒక కొత్త అనుభవం. ఈ యాత్ర నాది మాత్రమే కాదు. ఇది దేశం మొత్తం ప్రయాణం. మీ నాయకత్వంలో నేటి భారత్ కలలను సాకారం చేసుకోవటానికి అనేక అవకాశాలు కల్పిస్తోంది. ఇది నాకు పెద్ద అవకాశం. దేశానికి ప్రాతినిధ్యం వహించడం నాకు చాలా గర్వంగా ఉంది.

**మోదీ :** రోదసిలో మీరు ఏన్నో పరిశోధనలు చేస్తున్నారు? రాబోయే రోజుల్లో వ్యవసాయం, ఆరోగ్యానికి మేలు చేసే ప్రయోగం ఏదైనా ఉందా?

**శుభాంశు:** గర్వంగా చెప్పగలను. మొదటిసారి భారతీయ శాస్త్రవేత్తలు ఏడు వినూత్న పరిశోధనలకు రూపకల్పన చేశారు. వాటిని ఐఎస్ఎస్‌కు తీసుకొచ్చాను. మొదటి పరిశోధనను మూల కణాలపై చేపట్టాల్సి ఉంది. అంతరిక్షంలో గురుత్వాకర్షణ శక్తి ఉండదు. తద్వారా కండరాల క్షీణత చోటు చేసుకుంటుంది. ప్రత్యేక పదార్థం తీసుకోవడం ద్వారా కండరాల క్షీణతను నిలువరించటం లేదా వాయిదా వేయటంపై నా పరిశోధన కేంద్రీకృతం అవుతుంది. కండరాల క్షీణతతో భూమిపైనా బాధపడే వృద్ధులకు ఈ ప్రత్యేక పదార్థం ఉపయోగపడుతుందేమో పరీక్షిస్తాం. రెండోది మైక్రో స్థాయిలోని గ్రోత్ ప్రయోగం. మైక్రో లెవల్స్ చాలా చిన్నగా ఉంటాయి. కానీ అవి చాలా పోషకాలతో కూడినవి. ఇక్కడ వాటి వృద్ధిని చూస్తే ఆ ప్రక్రియను అనుసరిస్తే పెద్దమొత్తంలో అభివృద్ధి చేసి పోషకాలు అందించవచ్చు. ఇది ఆహార భద్రతకు కూడా ఉపకరిస్తుంది.

**మోదీ:** శుభాంశు అంతరిక్షానికి వెళ్లిన మీరు మొట్టమొదటి భారతీయుడు. మీరు చాలా కష్టపడ్డారు. ఎక్కువ శిక్షణ తీసుకొని వెళ్లారు. మీరు ఇప్పుడు నిజంగా అంతరిక్షంలో ఉన్నారు. అక్కడి పరిస్థితులు ఎంత భిన్నంగా ఉన్నాయి. వాటిని ఎలా స్వీకరించారు?

**శుభాంశు :** ప్రధాన మంత్రి జీ ఇక్కడ అన్నీ భిన్నంగా ఉన్నా యి. ఏడాది శిక్షణ తీసుకున్నాను. మొత్తం వ్యవస్థల గురించి తెలుసు. మొత్తం ప్రక్రియ గురించి తెలుసు. ప్రయోగాల గురించి తెలుసు. కానీ ఇక్కడి రాగానే ఆకస్మాత్తుగా మొత్తం మారిపోయింది. ఎందుకంటే మన శరీరం గ్రావిటీకి అలవాటుపడింది. ఇక్కడ మైక్రో గ్రావి టీ ఉంది. చిన్నచిన్న పనులు కూడా చాలా కష్టమవుతుం ది. ఇప్పుడు మీతో మాట్లాడుతున్నప్పుడు నా కాళ్లను కట్టుకున్నాను. లేదంటే నేను పైకి వెళ్లిపోతాను. నీళ్లు తాగాలన్నా, నడవాలన్నా, అన్నింటి కంటే పడుకోవడం చాలా కష్టం. మీరు గోడ మీద, భూమీ మీద పడుకుంటాం. శిక్షణ బాగుంది. కానీ మారిన వాతావరణానికి అలవాటు పడడానికి ఒకటి రెండు రోజులు పడుతుంది.

**మోదీ :** సైన్స్, ఆధ్యాత్మికం రెండు భారత్ సామర్థ్యాలు. మీ అంతరిక్ష పయనంతోపాటు భారత్ యాత్ర కూడా కొనసాగుతోంది. స్పేస్ సెంటర్‌లో మనశ్శాంతి కోసం ధ్యానం ఏమైనా ఉపయోగ పడుతుందా?

**శుభాంశు :** కచ్చితంగా ఉపయోగపడుతోంది. భారత్ ఇప్పటికే యోగా కార్యాక్రమాలు చాలా చేస్తోంది. ఈ మిషన్ పెద్ద పజిల్ లాంటిది. నేను అంతరిక్ష యాత్రకు వచ్చే ముందు అంతరిక్షంలో మనశ్శాంతి ఉండదని చాలా మంది అన్నారు. చాలా పరిస్థితులు కూడా అలానే ఉన్నా యి. సాధారణ శిక్షణ తీసుకునేప్పుడు, రాకెట్ లాంచ్ సమయంలో చాలా ఒత్తిడికి గురయ్యాను. మన శ్శాంతి ఉంటే ఎలాంటి పరిస్థితుల్లోనైనా శాంతగా ఉండవచ్చు. పని చేసే సమయంలోనూ సరైనా నిర్ణయాలు తీసుకోవచ్చు. ప్రతికూల పరిస్థితుల్లో ధ్యానం చేస్తే చాలా ఉపయోగపడుతుంది. పరిస్థితులతో త్వరగా మమైకమవడానికి సహయపడుతుంది.

**మోదీ:** చంద్రయాన్ విజయవంతం తర్వాత దేశంలోని పిల్లల్లో, యువకుల్లో విజ్ఞానంపై ఆసక్తి పెరిగింది. అంతరిక్ష పరిశోధనలపై ఆసక్తి పెరిగింది. మీ చారిత్రక యాత్ర ఆ సంకల్పాన్ని మరింత బలోపేతం చేస్తోంది. నేడు పిల్లలు కేవలం ఆకాశాన్ని మాత్రమే చూడటం లేదు. నేను కూడా అక్కడికి వెళ్లగలనని అనుకుంటున్నారు. ఈ ఆలోచన, ఈ భావన మన భవిష్యత్ అంతరిక్ష మిషన్లకు పునాది. మీరు యువతకు ఏం సందేశం ఇస్తారు?

**శుభాంశు :** దేశ యువతకు ఏం సందేశం ఇస్తానంటే దేశం సాగుతున్న దిశను చూస్తుంటే గొప్ప కలలు కంటున్నాం. ఆ కలలను సాకారం చేసుకునేందుకు మీ సహకారం కావాలి. అది పూర్తి కావటానికి ఏమంటానంటే మీ ప్రయత్నం మానుకోవద్దు. ఈ మూలమంత్రాన్ని గుర్తించుకుంటే ఏ దారిలో వెళ్లినా దాని వదలకుంటే విజయం తప్పక వరిస్తుంది.

**ప్రధాని:** అంతరిక్షంలోకి వెళ్లాక మీకు కలిగిన మొదటి ఆలోచన ఏంటి?

**శుభాంశు :** అంతరిక్షంలో వెళ్లిన తర్వాత మొదట భూమిని చూశాం. అంతరిక్షం నుంచి పుడమిని చూడగానే భూమి అంతా ఒక్కటే అనిపించింది. బయటి నుంచి సరిహద్దులు ఏవీ కనపడలేదు. అంతరిక్షం నుంచి భారత్‌ను మొదటిసారి చూసినప్పుడు కొన్ని అంశాలను గమనించాను. పటంలో భారత్‌ను చూస్తాం. మిగతా దేశాల విస్తీర్ణం ఎంత? మన దేశ విస్తీర్ణం ఎంత అని పటంలో చూస్తాం. కానీ అది నిజం కాదు. ఎందుకంటే త్రీడీ వస్తువును మనం టూడీలో చూస్తాం. రోదసి భారత్ భవ్యంగా కనిపిస్తుంది. పటంలో చూసిన దానికంటే పెద్దగా కనిపించింది. భూమిని బయట నుంచి చూసినప్పుడు సరిహద్దులు, దేశాలు, రాజ్యాలు ఏవి కనిపించవు. మనమంతా మనుషులం. భూమి ఒక్కటే. అందులో మనమంతా పౌరులం.

## అక్రమ కట్టడాలను అరికట్టాలి



**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** గత కొద్ది కాలంగా తమ ప్రాంతంలో పెరిగి పోతున్న అక్రమ కట్టడాల విషయంలో తగు చర్యలు తీసుకోవాలని గౌతంనగర్ వాసులు కోరారు. ఈ మేరకు శనివారం వారు స్థానిక ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డిని కల్సి వినతిపత్రం సమర్పించారు. గౌతంనగర్ ప్రాంతానికి చెందిన బిఆర్ఎస్ శ్రేణులు మేకల రాము యాదవ్, బైరు అనీల్, హబీబ్, సిద్దులు, సూర్యప్రకాష్ తదితరులు ఎమ్మెల్యేను కల్సి అక్రమ కట్టడాల వల్ల స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

## పివి నరసింహారావు ఆదర్శప్రాయుడు



**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** నిస్వార్థంగా ప్రజాసేవలో పాల్గొంటూ అంచెలంచెలుగా ప్రధాని బాధ్యతలు చేపట్టి దేశ ప్రతిష్టను దేశదేశానా చాటిచెప్పిన పివి నరసింహారావు ఆదర్శప్రాయుడని కాంగ్రెస్ నాయకులు కొనియాడారు. నేరేడ్‌మెట్ చౌరాస్తాలో శనివారం పివి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ శ్రేణులు ప్రసాద్, ఇందిరా చంద్రశేఖర్, కుట్టి శీను, ప్రభ, రాజలింగం, యాది, మహన్‌సాయి. ప్రవీణ్ జాన్సన్, విజయలక్ష్మి , కవిత తదితరులు పాల్గొన్నారు.



## అంగన్‌వాడీ పిల్లలకు కుర్చీల పంపిణీ

**ప్రజాపక్షం/జగద్గిరిగుట్ట :** జగద్గిరిగుట్ట రాజీవ్ గృహ కల్ప కూన మహాలక్ష్మి నగర్‌లోని సంస్కృతి పాఠశాల ఆధ్వర్యంలో అంగన్‌వాడి విద్యార్థులకు కుర్చీలను అందజేశారు. పాఠశాల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో కార్పొరేటర్లు కొలుకుల జగన్, మంత్రి సత్యనారాయణలు పిల్లలకు కుర్చీలను అందజేశారు. స్థానికంగా ఉన్న ఆరు అంగన్‌వాడీ సెంటర్‌లలో ఉన్న పిల్లలకు వీటిని పంపిణీ చేశారు. అనంతరం కార్పొరేటర్‌లు జగన్, సత్యనారాయణలు మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల ఆధ్వర్యంలో అంగన్‌వాడీలో చదువుతున్న విద్యార్థులకు కుర్చీలను అందజేయడం అభినందనీయమన్నారు. అందరూ ఇదే విధంగా ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు చేయూతగా ఉండాలని ఆకాంక్షించారు. జగద్గిరిగుట్ట సెక్టార్ అంగన్వాడి సూపర్‌వైజర్ శ్రీదేవి మాట్లాడుతూ అంగడివాడి లకు ఆసరా నిలవడటం సంతోషమన్నారు. పాఠశాల యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ గడ్డమీది బాలరాజు, స్థానిక నాయకులు మహంకాళి, ఎర్ర లక్ష్మయ్య, ఆంజనేయులు, ప్రభాకర్, శ్రీనివాస్, గిరి, అంగన్‌వాడి టీచర్లు రాధిక, జరీనా, అరుణ, విజయలక్ష్మి, తులసి తదితరులు పాల్గొన్నారు.

## పిజెఆర్ పేరు ఫ్లై ఓవర్‌కు పెట్టడం అభినందనీయం : శేరి సతీష్ రెడ్డి

**ప్రజాపక్షం/జగద్గిరిగుట్ట :** హైదరాబాద్ అభివృద్ధికి కృషి చేస్తూనే పేదల నాయకునిగా పేరు అందిన సీఎల్పీ మాజీ నేత పి. జనార్దన్ రెడ్డి పేరును కొండాపూర్ గచ్చిబౌలి ఫ్లైఓవర్ కు నామకరణం చేయడం అభినందనీయమని కూకట్ పల్లి కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి అన్నారు. పీజేఆర్ పేరున ఫ్లైఓవర్ ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల నాయకునిగా ఒకప్పటి ఖైరతాబాద్ నియోజకవర్గంకు ప్రాతినిధ్యం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో సమస్యలపై గళం విప్పిన నేత పీజేఆర్ అని కూకట్ పల్లి కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ అన్నారు. నా రాజకీయ గురువు, ఒకప్పటి ఖైరతాబాద్ నియోజకవర్గంకు ప్రాతినిధ్యం వహించి రాష్ట్ర నేతగా పిజెఆర్ ఎదిగారని కొనియాడారు. ఆయన సేవలకు గుర్తింపుగా గచ్చిబౌలిలోని ఓఆర్ఆర్ ఫ్లైఓవర్‌కు "పీజెఆర్ ఫ్లైఓవర్"గా నామకరణం చేసిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు ఎనుముల రేవంత్ రెడ్డికి, కూకట్ పల్లి కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి, రాష్ట్ర ప్రజల తరఫున హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఇలాగే ముమ్మందు మరిన్ని గుర్తింపులు అందించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నాం అని స్పష్టం చేశారు. పిజె. ఆర్ మన మధ్య లేకపోయినా, ఆయన త్యాగాలు, సేవలు ప్రజల హృదయాల్లో శాశ్వతంగా వెలుగుతూనే ఉంటాయని కూకట్‌పల్లి కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి అన్నారు.



## ప్రజా సమస్యలు పరిష్కరించడమే ప్రభుత్వ ధ్యేయం : కొలను హన్మంత రెడ్డి

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** ప్రజా సమస్యలను పరిష్కరించడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలను హన్మంతరెడ్డి అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఎన్ఎంసి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొలను రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో హన్మంతరెడ్డి పర్యటించారు. కార్పొరేషన్ పరిధిలోని బాచుపల్లి కౌసల్యకాలనీలోని చిల్డ్రన్స్ పార్కులో నీరు లేక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకుని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి కొలను హన్మంతరెడ్డి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌తో చర్చించి స్వంత ఖర్చులతో పదివేల లీటర్ల ట్యాంక్‌ని ఇప్పించడం జరిగింది. అనంతరం కార్పొరేషన్ పరిధిలోని నిజాంపేట్ 21వ డివిజన్ సాయినగర్‌లోని స్మశాన వాటికలో నీటి సదుపాయం లేకపోవడంతో అధికారులతో హన్మంతరెడ్డి మాట్లాడి తక్షణమే బోర్‌వెల్‌ని, సిమెంటు రోడ్డుని మంజూరు చేయించారు. శనివారం బోర్‌వెల్, సిమెంటు రోడ్డు పనులను హన్మంత రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా హన్మంత రెడ్డి మాట్లాడుతూ బస్తీలు, కాలనీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న చిన్నచిన్న సమస్యలను తన దృష్టికి తీసుకువచ్చే వాటిని తక్షణమే పరిష్కరిస్తామని అన్నారు. ప్రజలకు మెరుగైన సేవలను అందించడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని చెప్పారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వారికి కావాల్సిన మౌలిక వసతులను కల్పించడమే తమ బాధ్యత అని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు జీవన్ రెడ్డి, తిరుపతి రెడ్డి, కృష్ణ యాదవ్, వేణుగోపాల్ రెడ్డి, నవీన్, హరీష్ రెడ్డి, షేక్ బిక్కన్, ప్రవీణ్, నిర్మల, తదితరులు పాల్గొన్నారు.

## ఉర్దూ మీడియం పాఠశాల సందర్శించిన మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్

**ప్రజాపక్షం/ ఘట్‌కేసర్ :** ఉర్దూ మీడియం పాఠశాలను మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావనిజంగయ్య యాదవ్ సందర్శించారు. ఈ సందర్భంగా ముల్లి పావనిజంగయ్య యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నారని విద్యార్థులు మంచిగా చదువుకోవాలని ఉన్నత స్థాయికి చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులకు మంచి విద్యను అందించే విధంగా చూడాలని ఉపాధ్యాయులను కోరారు. పాఠశాలను శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు బర్ల దేవేందర్ ముదిరాజ్, మైనార్టీ అధ్యక్షులు ఫరూక్, మహ్మద్ ఖయ్యూం,శాశ బేగం,రఫిక్, గఫ్ఫార్, శానవాజ్, తదితరులు పాల్గొన్నారు.



# 'రైల్వే ట్రాక్' పెట్రోలింగ్ పెంచాలి

### అధికారులను ఆదేశించిన అరుణ్‌కుమార్ జైన్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రైళ్ల ప్రమాదాల నివారణలో భాగంగా రైల్వే ట్రాక్‌పై పెట్రోలింగ్‌ను పెంచాల్సిన అవసరం ఉందని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ అధికారులను ఆదేశించారు. రైల్ నిలయంలో రైలు కార్యకలాపాల నిర్వహణ, భద్రతపై శనివారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అదనపు జనరల్ మేనేజర్ నీరజ్ అగర్వాల్, వివిధ శాఖలకు చెందిన ప్రధానాధిపతులతోపాటు సికింద్రాబాద్, హైదరాబాద్, విజయవాడ, గుంతకల్లు, గుంటూరు మరియు, నాందేడ్ డివిజనల్ రైల్వేమేనేజర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్ జైన్ మాట్లాడుతూ..వర్షాకాలం దృష్ట్యా రైలు భద్రత, సమయపాలనపై దృష్టి సారించాలన్నారు. వర్షాకాలంలో భద్రతా మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు. ట్రాక్‌లు, వంతెనలు భారీ వర్షాలకు గురయ్యే ప్రాంతాలలో పెట్రోలింగ్‌ను ముమ్మరం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. కార్యాచరణ అంతరాయాలను నివారించడానికి సిగ్నలింగ్ వ్యవస్థల నమ్మకమైన పనితీరును నిర్ధారించాలని కూడా ఆయన డివిజనల్ రైల్వేమేనేజర్లను ఆదేశించారు. శంకర్‌పల్లి, నాగులపల్లి స్టేషన్ల మధ్య లెవల్ క్రాసింగ్ వద్ద కారు పట్టాలపైకి ప్రవేశించిన ఇటీవలి సంఘటన గురించి చర్చించారు. లెవల్ క్రాసింగ్‌ల వద్ద భద్రతా చర్యలను పెంచాలని, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, అటువంటి సంఘటనలను వెంటనే ఉన్నతాధికారులకు నివేదించాలని ఆయన కోరారు. జోన్‌లోని లెవల్ క్రాసింగ్‌ల వద్ద అతిక్రమణపై అవగాహన ప్రచారం నిర్వహించాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఆకతాయిల కార్యకలాపాలను అదుపు చేయడానికి, నిరోధించడానికి అదనపు ఆర్.పి.ఎఫ్, ట్రాక్ పెట్రోలింగ్ సిబ్బందిని నియమించాలని జనరల్ మేనేజర్ సూచించారు. జోన్ వ్యాప్తంగా అన్ని లెవెల్ క్రాసింగ్ గేట్ల వద్ద ప్రయాణీకుల భద్రత మరియు ప్రామాణిక ఆపరేటింగ్ భద్రతా విధానాలకు కట్టుబడి ఉండేలా భద్రతకు సంబంధించిన పరికరాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆయన అన్నారు.

అరుణ్ కుమార్ జైన్ ముఖ్యంగా ప్రతికూల వాతావరణ పరిస్థితులలో, సురక్షితమైన నిరంతర రైలు కార్యకలాపాలను నిర్వహించడానికి చురుకైన సమన్వయ ప్రయత్నాల ప్రాముఖ్యతను పునరుద్ఘాటించారు.

## పార్టీకోసం కష్టపడిన వారికే సముచిత స్థానం : ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



**ప్రజాపక్షం/పరిగి:** పరిగి నియోజకవర్గంలోని పరిగి, పూడుర్‌లోని కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా వికారాబాద్ డిసిసి అధ్యక్షులు పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పోల్గోని మాట్లాడుతూ, పార్టీకోసం పనిచేసే వారికి సముచిత స్థానం ఉంటుందని అయన అన్నారు. కాంగ్రెస్ పార్టీకోసం పని చేసే నియోజకవర్గంలోని అన్ని మండలాలు, గ్రామాల్లో పార్టీ అధ్యక్షులుగా పనిచేసేందుకు నాయకులు నుంచి దరఖాస్తులను స్వీకరిస్తామని తెలిపారు. పార్టీలో కష్టపడిన వారికే సముచిత స్థానం కల్పించి వారి గెలుపునకు కృషి చేస్తామన్నారు. కాంగ్రెస్ ప్రవేశపెట్టి అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంతో కార్యకర్తలు, సైనికుల్లా పనిచేయాలని సూచించారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో అందరినీ కలుపుకొని పోవాలని సూచించారు. అనంతరం మాజీ ప్రధానమంత్రి పివి నరసింహారావు జయంతి సందర్భంగా స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి ఎమ్మెల్యే అయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. దేశ ప్రధాని పదవిని అధిష్ఠించిన మొదటి ఒకే ఒక తెలుగువాడు పివి నరసింహారావు అని గుర్తు చేశారు.

దేశ ఆర్థిక వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చి అనేక సేవలు అందించారని, అందుకే మనందరం ఎంతో గర్వించాల్సిన విషయమని గుర్తు చేశారు. విద్యారంగం బలోపేతం పివి తోనే సాధ్యమైదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గోన్నారు.

## ఒలంపియాడ్ పరీక్షలో నవీన ఆదర్శ విద్యార్థికి స్టేట్‌ర్యాంక్



**ప్రజాపక్షం/కొడంగల్:** నవీన ఆదర్శ కాన్వెంట్ హై స్కూల్ విద్యార్థి జాతీయ సైన్స్ ఒలంపియాడ్ పరీక్షలో స్టేట్ ర్యాంక్ సాధించడంపై పాఠశాల కరస్పాండెంట్ వెంకటయ్యముదిరాజ్ విద్యార్థిని అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ నరేష్ రాజ్ మాట్లాడుతు పట్టణంలోని నవీన ఆదర్శ కాన్వెంట్ హైస్కూల్‌లో 5వ తరగతి చదువుతున్న హారిక అనే విద్యార్థి జాతీయ సైన్స్ ఓలంప్యాడ్ పరీక్షలో స్టేట్ 4వ ర్యాంకు సాధించడం ఎంతో గర్వకారణమన్నారు. అందుకు హైద్రాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన ఆడిటోరియంలోని సిమ్స్ ఫౌండేషన్ డైరెక్టర్ రామ్‌చందర్‌రెడ్డి, ట్రస్మా స్టేట్ ప్రెసిడెంట్ ఎస్.ఎన్‌రెడ్డి చేతుల మీదుగా విద్యార్థి ప్రావీణ్య పురస్కార్ అవార్డుతో పాటు మెమెంటో, మోడల్‌లను అందించి సత్కరించారు. విదార్థులు చిన్ననాటి నుంచే ఇలాంటి ప్రతిభను కనబరుస్తూ అవార్డులు తీసుకోవడం వల్ల జీవితంలో ఉన్నత స్థాయి శిఖరాలను అధిగమించడం సులుభతరంగా ఉంటుందని ప్రశంసించారు. వీరితోపాటు పాఠశాల ప్రిన్సిపల్ నరేష్‌రాజ్, వైస్ ప్రిన్సిపల్ సంతోష, ఉపాధ్యాయులు, తదితరులున్నారు.

## విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు

**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి:** ప్రతి శని, ఆదివారాలలో ఐదవ తరగతి నుండి మొదలుకొని ఇంటర్ చదివే విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని ,అరుణా ఆప్టికల్స్ నిర్వహకులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వికారాబాద్ పట్టణంలోని బిజేఆర్ సర్కిల్ సమిపంలోనీ పాత పోలీస్‌స్టేషన్ రోడ్డులో గల శ్రీఅరుణా ఆప్టికల్స్ నందు జున్ 28తేదీ నుండి సెంప్టెంబర్ 28వ తేదీ వరకు నిష్ణాతులైన వైద్య నిపుణులచే కంప్యూటజ్డ్ టెక్నాలజీతో ప్రతిరోజు ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 6.30 గంటల వరకు విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. తలనొప్పి,మొదనొప్పి ,టిచూపు సమస్య ఉన్న విద్యార్థులకు రోజుకు 15మంది చొప్పున ఉచిత కంటి పరీక్షలు జరుగుతుందని ,విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 984922943, 8121464567 నెంబర్లకు సంప్రదించు వచ్చుని తెలిపారు.




## కొడంగల్‌లో గంజాయి పట్టివేత



**ప్రజాపక్షం / కొడంగల్ :** యువత తను చిత్తుచేసి జీవితాలను నాశనం చేస్తున్న గంజాయిని పోలీసులు చాకచక్యంగా పట్టుకుని ఇద్దరు యువకులను రిమాండ్‌కు తరలించిన ఘటన కొడంగల్‌లో శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు తాండూర్‌లోని శివాజీ చౌక్‌లో నివాసముంటున్న శ్రీనివాస్‌రెడ్డి, నిఖిల్ అనే ఇద్దరు యువకులు కార్ణటకలోని బీదర్ లో 500 గ్రాముల గంజాయిని కొనుగోలుచేసి అక్కడి నుంచి బుల్లెట్ బండిపై కొడంగల్‌కు తీసుకువస్తుండగా పోలీసులు నమ్మదగ్గ సమాచారం మేరకు పట్ట ణ శివారులోని బాలింత గడ్డలో ద్విచక్ర వాహనా న్ని అడ్డగించి తనిఖీలు చేసి అందులోని గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కొడంగల్‌లో ఎవ్వరికి ఇవ్వడానికి తీసుకువస్తున్నారని పలు కోణాల్లో పోలీసులు తమదైన శైలీలో విచారించగా ఎటువంటి సమాదానాలు చెప్పలేదని పోలీసులు తెలిపారు. దీనిపై ఇరువురిపై పలు సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిఐ శ్రీదర్‌రెడ్డి, ఎస్ఐ సత్యానారాయణ తెలిపారు. వీరితో పాటు పోలీసు సిబ్బంది ఉన్నారు.

### షెడ్యూల్డ్ కూలాల, గిరిజన అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో

## బెస్ట్ అవైలబుల్ స్కూల్ ఎంపిక

### అదనపు కలెక్టర్ సుధీర్



**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి:** షెడ్యూల్ కులాల గిరిజన అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో బెస్టు అవైలబుల్ స్కూల్ విద్యార్థుల ఎంపికి కార్యక్రమం నిర్వహించడం జరిగింది అని అదనపు కలెక్టర్ సుధీర్ తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో షెడ్యూల్ కులాల గిరిజన అభివృద్ధిశాఖలో 1వ ,5వ తరగతి విద్యార్థినీ, విద్యార్థులకు డ్రా ద్వారా ఎంపిక చేయడం జరిగిందని, అదేవిధంగా గిరిజన అభివృద్ధి శాఖలో 3వ, 5వ, 8వతరగతులకు సీట్లకు దరఖాస్తు చేసుకున్న 22 మందిని తల్లిదండ్రుల సమక్షంలో ఎంపిక చేయడం జరిగింది అని అదనపు కలెక్టర్ తెలిపారు. ఒకటవ తరగతిలో 88ఖాళీలకు గాను 139మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. షెడ్యూల్ కులాలకు సంబంధించిన గ్రేడ్‌ల వారీగా సీట్ల కేటాయింపు జరిగిందని, గ్రూప్ 1లో 6సీట్లకుగాను 2వగ్రూప్ కు 2, 53 సీట్లకుగాను 87మంది దరఖాస్తు చేశారని అన్నారు. గ్రూప్ 3కి 29 సెట్ల గాను 84 మంది విద్యార్థులు ఎంపిక చేయడం జరిగిందని, అదేవిధంగా 5వ తరగతి 91సీట్లకుగాను 17మంది విద్యార్థులు దరఖాస్తులు చేసుకోగా వీరిని ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. డ్రాలో ఎంపికైన విద్యార్థినీ విద్యార్థులకు జులై 3వ తేదీన ఎంపిక పత్రాలను అందజేయడం జరుగుతుందని అని తెలిపారు. ఈ ఎంపిక కార్యక్రమంలలో షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి కమలాకర్‌రెడ్డి, సహాయ సంక్షేమాధికారులు శుక్రవర్ధన్ రెడ్డి వీరానందం, సిబ్బంది, తదితరులు పాల్గోన్నారు.

## నేడు విద్యుత్‌కు అంతరాయం

**ప్రజాపక్షం/చర్లపల్లి:** చెట్ల కొమ్మల తొలగింపు, విద్యుత్ మరమ్మతుల కారణంగా విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని ఎఇ బాబురావు తెలిపారు. చర్లపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని11 కెవి బిఎన్ రెడ్డి నగర్ ఫీడర్‌ను ఉదయం 10 గంటల నుండి 1 గంట వరకు నిలిపి వేయడంతో బిఎన్ రెడ్డి నగర్ కాలనీ, ఐడిఏ ఫేస్1లోని కొద్ది ప్రాంతం,11 కెవి విఠల్ థెరపెటిక్స్ ఫీడర్‌ను మధ్యాహ్నం 2 గంటల నుండి 5 గంటల వరకు నిలిపివేయడంతో బిఎన్ రెడ్డి నగర్ కాలనీ, ఫేస్1లోని కొద్ది ప్రాంతం అంతరాయం ఏర్పడుతుందని ఎఇ తెలిపారు.

## అసత్య ప్రచారం చేసిన వ్యక్తిపై కేసు

**ప్రజాపక్షం/బోడుప్పల్:** మేడిపల్లి ప్రెస్‌క్లబ్ వ్యక్తులపై సోషల్ మీడియా (వాట్సాప్) లో అసత్య ప్రచారాలు చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదైన ఘటన మేడిపల్లి పిఎస్ పరిధిలో చోటు చేసుకుంది. మేడిపల్లి సిఐ ఆర్.గోవింద్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మేడిపల్లి ప్రెస్‌క్లబ్ అంతర్గత అంశాలపై సోషల్ మీడియా (వాట్సాప్) నెట్వర్క్ లో దుష్ప్రచారం చేస్తూ పోస్ట్ చేసిన రాజాపేట నవీన్ చారీ అనే వ్యక్తిపై బిఎన్ఎస్ 352 ప్రకారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలను తప్పుదోవ పట్టించేలా, ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేకా పోస్ట్‌లు పెడితే చట్టపరమైన చర్యలు ఉంటాయని సిఐ గోవింద్ రెడ్డి తెలిపారు.




## ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం చేసేది సిపిఐ మాత్రమే

### రాష్ట సమితి సభ్యుడు జి.దామోదర్‌రెడ్డి

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** ప్రజల వెన్నంటి ఉండి ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం చేసేది కేవలం సిపిఐ మాత్రమే అని పార్టీ రాష్ట సమి తి సభ్యులు జి.దామోదర్‌రెడ్డి అన్నారు. సిపిఐ ఉప్పల్, రామంతపూర్, మోహన్ నగర్, జైపూరి కాలనీ, నాగోల్ మండలాల సమితి శాఖల సమావేశం శనివారం నాగోల్‌లోని డాంగే భవన్‌లో మండల కార్యదర్శి టి.సత్యప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు జి.దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ కుత్బుల్లాపూర్‌లో ఆగస్టు 19 నుండి 22 వరకు జరిగే పార్టీ రాష్ట్ర 4వ మహాసభలను విజయవంతం చేయాలని పిలుపిచ్చారు. దీనికోసం కార్యకర్తలందరూ ప్రణాళికాయుక్తంగా కరపత్రాలు ఇంటింటికీ పంచుతూ పార్టీ సేవలను విశదీకరించటం ద్వారా సభలకు పెద్ద సంఖ్యలో హాజరయ్యేందుకు సిద్ధం చేయాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు కల్లూరు ధర్మేంద్ర, మండల సహాయ కార్యదర్శి ఎండి బషీర్, మండల కార్యవర్గ సభ్యులు పి.రామ్‌నారాయణ, బొడ్డుపల్లి కృష్ణ, రాజేందర్, పరమేశ్వర్, మల్లేష్, ఉషశ్రీ, జంగారెడ్డి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.




## న్యాయమూర్తులకు ఘన సత్కారం

**ప్రజాపక్షం/చర్లపల్లి:** మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కోర్టు నుండి బదిలీపై వెళ్తున్న మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి వి.అరుణ్‌తేజ్, కూకట్‌పల్లి నుండి బదిలీపై వచ్చిన మొదటి అదనపు జిల్లా, సెషన్స్ న్యాయమూర్తి తిరుపతి, కరీంనగర్ నుండి బదిలీపై వస్తున్న మూడవ అదనపు జూనియర్ జడ్జి సరళరేఖలను మేడ్చల్ జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సభ ఏర్పాటు చేసి వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్ఎన్ శ్రీదేవి, ప్రిన్సిపల్ సీనియర్ జడ్జి సత్తు రవీందర్, అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు అమరేందర్‌రెడ్డి, బాపురెడ్డి, సభ్యులు మాధవి, ధనలక్ష్మి , రేణుక, వెంకటేష్, మురళి, సాయిప్రదీప్, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.



## చర్లపల్లి డివిజన్ కాలనీల సమస్యలు పరిష్కరించాలి

**ప్రజాపక్షం/చర్లపల్లి:** కాలనీల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ జైళ్ల శాఖ డిజి సౌమ్య మిశ్రాను ఉప్పల్ ఎంఎల్ఏ బండారి లక్ష్మారెడ్డి కోరారు. చర్లపల్లి డివిజన్ పరిధిలోని రెడ్డి కాలనీ, భగవాన్ కాలనీ, కృష్ణ నగర్, ఎంఎంఆర్ కాలనీలకు జైలు నుండి వచ్చే వర్షం నీరు వస్తుందని గత కొన్ని ఏళ్లుగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ లేక వర్షాకాలం నీరు బయటికి పోలేక చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఎంఎల్ఏ దృష్టికి తీసుకువెళ్లగా ఈ సందర్భంగా సమస్యను పరిష్కరించాలని సౌమ్య మిశ్రాను కలిసి కోరారు. స్పందించిన ఆమె సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సమస్యపై ఇటీవలే డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సచివాలయంలో హోం శాఖ ప్రత్యేక కార్యదర్శిని కలిసి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహేష్‌గౌడ్, కాలనీ ప్రతినిధులు భూమిరెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, జీవన్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, వెలుమరెడ్డి, అమరేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## సమస్యలుంటే తెలపాలి : కార్పొరేటర్ శ్రవణ్

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** మల్కాజిగిరి డివిజన్‌లోని ఓల్డ్ మల్కాజిగిరి నుండి సర్దార్ పటేల్ నగర్ వరకు రూ.80లక్షల వ్యయంతో చేపట్టిన సిసి రోడ్డు ప్యాచ్ పనులను స్థానిక కార్పొరేటర్ శ్రవణ్ శనివారం ప్రారంభించారు. భవానీనగర్ ప్రాంతంలో ఇప్పటికే ఎంపి లాడ్స్‌లో బోర్‌వెల్ పూర్తయిందని, స్థానికులు మరేదైనా సమస్యలు ఎదుర్కొంటే తన దృష్టికి తీసుకొని రావాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి మల్కాజిగిరి సర్కిల్ ఎఇ నవీన్, రమేష్, స్థానికులు సునీల్ యాదవ్, వెంకట్ యాదవ్, బాలరాజ్, అశోక్, బాబా, లక్ష్మణ్, భానురేఖ తదితరులు పాల్గొన్నారు.

## మంద కృష్ణ అడుగుజాడల్లో నడుస్తా

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** దివ్యాంగుల హక్కుల కోసం పోరా టం చేసి అనేక ప్రయోజనాలు కల్పించటంలో పద్మశ్రీ అవార్డు గ్రహీత మంద కృష్ణ మాదిగ అడుగు జాడల్లో తామందరం కృషి చేస్తుంటామని మేడ్చల్ జిల్లా వికలాంగుల పోరా ట సమితి అధ్యక్షుడు ఎన్ వినయ్ అన్నా రు. శనివారం వికలాంగుల హక్కుల జాతీయవేదిక జాతీయ అధ్యక్షు లు కొల్లి నాగేశ్వరరావు, కె.బి జయ హరి, పండు, ఉపేందర్‌లతో కల్సి మంద కృష్ణ మాదిగను సన్మానించారు.



## నేడు తెలంగాణ నాయర్ సేవా సంఘం ఆవిర్భావం



ప్రజాపక్షం / ఖైరతాబాద్ : నిస్వార్థ సేవ, సామాజిక నిబద్ధతకు పర్యాయ పదంగా నాయర్ సేవ సొసైటీని ఈ నెల 29న రాష్ట్రంలో ఆవిర్భవించనున్నదని తెలంగాణ నాయర్ సేవ సొసైటీ అధ్యక్షులు కె.సురేంద్రన్ తెలిపారు. శనివారం హైదరాబాద్ బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో సొసైటీ ప్రధాన కార్యదర్శి ఎం.కె.శశికుమార్, కోశాధికారి పి.సేతుమాధవన్ తదితరులతో కలిసి సొసైటీ ఆవిర్భావ గోడపత్రికను ఆవిష్కరించారు. హైదరాబాద్ కాప్రాలోని ఎర్ర లలిత ఫంక్షన్ హాల్‌లో జరిగే కార్యక్రమానికి గోవా గవర్నర్ పి.ఎస్. శ్రీధర్ పిళ్ళై ముఖ్యఅతిథిగా హాజరై, తెలంగాణ నాయర్ సేవ సొసైటీని ప్రారంభిస్తారని తెలిపారు. లోక్‌సభ సభ్యులు ఎన్.కె.ప్రేమచంద్రన్, కె.విజయ చంద్రన్ గౌరవ అతిథులుగా పాల్గొంటారన్నారు.

## సాహెబ్ నగర్ స్మశాన వాటికను అభివృద్ధి చేస్తాం



ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ : సాహెబ్ నగర్ స్మశాన వాటికను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. శనివారం జిహెచ్‌ఎంసి ఈఈ రమేష్ బాబు, డీఈ దామోదర్ రావులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ లచ్చిరెడ్డి మాట్లాడుతూ స్మశాన వాటికను అత్యాధునిక హంగులతో అభివృద్ధి చేస్తున్నామని, ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలకు తావ్వనివకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. మంచినీటి బోరు, రోడ్లు, మూత్రశాలలు, పెయింటింగ్ లాంటి సమస్యలను త్వరలోనే పరిష్కారం చేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి, ఏఈ గోపాలకృష్ణ, వర్క్ ఇన్స్పెక్టర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక సంస్కరణల ధీశాలి పివి

### అప్పుల భారతాన్ని అభివృద్ధి వైపు నడిపించిన రాజనీతిజ్ఞుడు : ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి



ప్రజాపక్షం/ సరూర్‌నగర్ : ఆర్థిక సంస్కరణ ధీశాలి, అప్పుల భారతాన్ని అభివృద్ధి వైపు నడిపించిన రాజనీతిజ్ఞుతుడు మాజీ ప్రధాని పి.వి.నరిసింహారావు అని మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే పి.సబితాఇంద్రారెడ్డి అన్నా రు. శనివారం పి.వి. నర్సింహారావు జయంతిని పురస్కరించుకోని ఆర్‌కెపురం డివిజన్ అల్కాపురి చౌరస్తాలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితారెడ్డి మాట్లాడుతూ భారత దేశాన్ని పునర్నిర్మించిన నిజమైన నాయకుడని అన్నారు. ఆర్థిక రంగం నుం చి విదేశాంగ విధానాల వరకు అన్నింటినిపై తనదైన ముద్ర వేసిన మహానీయుడు పివి నర్సింహారావు అని కొనియాడారు.ఆయన ఆశయ సాధన కో సం ప్రతి ఒక్కరూ కృషి చేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గం ప్రధాన కార్యధర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ, డివిజన్ అధ్యక్షులు పెండ్యాల నగేష్, న్యాలకొండ శ్రీనివాస్‌రెడ్డి, వీరమల్ల రామ్‌నరసింహగౌడ్, కంచర్ల శేఖర్, కొండ్రు శ్రీనివాస్, సాజిద్, ముచ్చింతల జగన్, వెంకటేష్‌గౌడ్, మహేందర్‌రెడ్డి, శంకర్‌నాయక్, పెంబర్తి శ్రీనివాస్, నవీన్, ఊర్మిళరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



ప్రజాపక్షం/ ఇబ్రహీంపట్నం : మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు.శనివారం రంగారెడ్డి జిల్లా మంచాల మండలం కేంద్రంతో పాటు మండలంలో నోముల,ఎల్లమ్మతండా,సత్తొని తండా,అంబోత్ తండా,లోయపల్లి గ్రామాలలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పర్యటించి సుమారు 1కోటి 71లక్షల 50వేల రుపాయల నిధులతో గ్రామాలలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు,ప్రారంభోత్సవాలు చేసి అనంతరం మంచాల మండలం మహిళా సమాఖ్య ఆద్వర్యంలో మంజూరైన 8కోట్ల 3లక్షల రుపాయాల చెక్కును మహిళ సంఘాలకు అంద చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేయటానికి యుద్ధ ప్రాతిపధికంగా చర్యలు చేపడుతుందని అన్నారు. మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు,కాంగ్రెస్ నాయకులు పాల్గోన్నారు.

## కోరం లేకుండా మండల మహిళా సమాఖ్య కమిటీ ఎలా వేస్తారు?



ప్రజాపక్షం/షాద్‌నగర్: ప్రభుత్వ నిబంధనల ప్రకారం మండల మహిళా సమాఖ్య నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేయాలంటే గ్రామ సంఘాలకు నెల రోజుల ముందు నోటీసులు ఇవ్వాల్సి ఉంటుందని సంఘాల సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నూతన కార్యవర్గం ఏర్పాటుకు ఎలాంటి కోరం లేకుండానే..ఎన్నికల నోటీసులు ఇవ్వకుండా ఏకపక్షంగా ఎలా ఎన్నికలు నిర్వహిస్తారని గ్రామ సంఘాల సభ్యులు ప్రశ్నిస్తున్నారు. మండల స్థాయి అధికారి(ఎపిఎం)ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, ఉన్నఫలంగా నూతన కమిటీని ఏర్పాటు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఫరూక్‌నగర్ మండలంలో మొత్తం 51గ్రామ సంఘాలు ఉన్నాయని, 1197 చిన్న సంఘాలు ఉన్నాయని సభ్యులు తెలిపారు. ఈ సంఘాలలో 1/3వంతు కోరం ఉంటేనే మండల కమిటీని ఎన్నుకోవడం జరుగుతుందని, ఇందుకు ఎన్నికల అధికారిగా జిల్లా కేంద్రం నుండి రావాల్సి ఉంటుందని గ్రామ సంఘం సభ్యులు పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కి నేను చెప్పిందే చట్టం అంటూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని సంఘాల సభ్యులు వాపోతున్నారు. నకిలి జిరాక్స్ బిల్లులు, భోజనం బిల్లులు పెట్టి ఇష్టారాజ్యంగా దోచుకుంటున్నారని సంఘాల సభ్యులు వాపోతున్నారు. ఈ విషయాలన్నిటిపై జిల్లా ఉన్నతాధికారులు విచారణ చేసి చర్యలు తీసుకోవాలని సంఘాల సభ్యులు కోరుతున్నారు.

**నిబంధనల ప్రకారమే ఎన్నికలు : ఎపిఎం నాగేష్**

ప్రభుత్వ నిబంధనల ప్రకారమే మండల మహిళా సమాఖ్య ఎన్నికలు జరిగాయని, అందులో తమ ప్రమేయం ఏమి లేదని ఫరూఖ్‌నగర్ మండల ఎపిఎం నాగేష్ వివరించారు. మెజార్టీ గ్రామ సంఘాల సభ్యులు వచ్చి నూతన మండల కమిటీని ఎన్నుకున్నారని, అందులో తనకు ఎలాంటి ప్రమేయం లేదని, కావాలనే కొందరు ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని వివరించారు. గ్రామ సంఘాల్లో సభ్యులు, విఓఏలు చేసిన తప్పులను బయటకు తీసినందుకే తనపై కక్షకట్టి ఇలా వ్యవహరిస్తున్నారని తెలిపారు. జిల్లా ఉన్నతాధికారులకు తాను సమాచారం ఇచ్చానని పేర్కొన్నారు.

## విగ్రహాలు.. పేర్లు మార్చడం కాదు.. అభివృద్ధిపై దృష్టి కేంద్రీకరించండి

### ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి

ప్రజాపక్షం/ఫరూక్‌నగర్ : విగ్రహాలు..పేర్లు మార్చడం కాదు..అభివృద్ధి, సం క్షేమంపై దృష్టి కేంద్రీకరించేందుకు ప్రభుత్వం కృషి చేయాలని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్ రెడ్డి సూచించారు. శనివారం పట్టణంలోని క్యాంపు కా ర్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మె ల్సీ మాట్లాడుతూ ప్రజా శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేయాల్సింది పోయి విగ్రహాలు..పేర్లు మార్చడంపై దృష్టి పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రతి తెలుగువారు అన్నపూర్ణ అనే పేరును అకలితీర్చే అమ్మలా భావిస్తారని, అలాంటి సెంటిమెంట్ ఉన్న అన్నపూర్ణ కేంద్రాల పేర్లు మార్చడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పేర్లు మార్చి ఇందిరమ్మ క్యాంటిన్లుగా పేరు పెడుతుండటం కాంగ్రెస్ ప్రభుత్వానికి సరికాదని సూచించారు. అన్నపూర్ణ కేంద్రాల ద్వారా ఎంతోమంది పేదల ఆకలి తీర్చిడం జరుగుతుందని, పేర్లు మార్చడం సరికాదని పేర్కొన్నారు. ఈర నాగమ్మ దేవాలయ నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి ఒక లక్ష రూపాయాలు విరాళంగా అందజేశారు. శనివారం షాద్‌నగర్ పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో కేశంపేట మండలం కొండారెడ్డిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఈర నాగమ్మ దేవాలయ నిర్మాణానికి ఎమ్మెల్యే నవీన్‌కుమార్‌రెడ్డి గ్రామస్తుల కోరిక మేరకు ఒక లక్ష రూపాయాలను విరాళంగా అందజేశారు. దేవాలయాల అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కొండారెడ్డిపల్లి మాజీ సర్పంచ్ శేఖర్ పంతులు తదితరులు పాల్గొన్నారు.

# మంజీరా బ్యారేజీకి ముప్పులేదు

- మంజీరా డ్రింకింగ్ వాటర్ ప్రాజెక్టు ఆధునికీకరణ కోసం రూ. 600 కోట్లు
- రూ.3.52 కోట్లతో తక్షణ మరమ్మతులు
- బ్యారేజీని సందర్శించిన జల మండలి ఎండి అశోక్ రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్ : హైదరాబాద్ మహానగరానికి తాగునీరు అందించే మంజీరా బ్యారేజీకి ఎలాంటి ముప్పులేదని జలమండలి ఎం.డి. అశోక్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆయన జలమండలి ఉన్నతాధికారులతో కలిసి శనివారం మంజీరా బ్యారేజ్, బారాజ్ గేట్లు, బారాజ్ పిల్లర్లు, పంప్‌హౌజ్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎండి మాట్లాడుతూ హైదరాబాద్ నగరానికి మంచి నీరు అందించడానికి నిర్మించిన మంజీరా బ్యారేజ్‌కు ఎలాంటి ప్రమాదం లేదని, వివిధ మాధ్యమాల్లో బారాజ్ పిల్లర్లకు పగుళ్లు వచ్చాయన్న వార్తలు అవాస్తవమని చెప్పారు. బ్యారేజ్‌కి సంబంధించిన గేట్లు, రోప్‌ల పనితీరు కూడా సంతృప్తిగానే ఉన్నట్లు తెలిపారు. బారాజ్ దిగువన ఆప్రాన్ కొంతమేరకు దెబ్బతిన్నదని వెంటనే మరమ్మత్తులకోసం ఏజెన్సీతో మాట్లాడి యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టాలని ఆదేశించామన్నారు. రెండవగేటు లీకేజీను అరికట్టడానికి మరమ్మత్తు పనులను చేపట్టాలని స్వప్న ప్రాజెక్టు ప్రైవేట్ లిమిటేడ నిర్మాణ సంస్థకు సూచించారు. బ్యారేజీపై గేట్లు, రోలర్, ప్యానల్ బోరడ్స్, ఎలక్ట్రో మెకానికల్ తదితర భాగాలను పరిశీలించిన ఎండి ఎప్పటికప్పుడు గ్రీజు, కలరింగ్, లైటింగ్ తదితర ఏర్పాట్లను చేసుకోవాలని అధికారులకు సూచించారు. స్పిల్‌వే ఇరుప్రక్కల్లో ఫెన్సింగ్ ఏర్పాటుచేసి మానవ సంచారం నిరోధించాలని తెలిపారు. ఆనకట్టపై మొలిచిన చెట్లు, కంపచెట్ల తొలగింపు వారంలోపల పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు.

**ఏళ్లు గడిచిన బార్యేజ్ గేట్లు..**

మాంజీరా బ్యారేజ్ 65 సంవత్సరాల క్రితం నిర్మితమైందని, అప్పుడు బిగించిన గేట్లు ప్రతీఏటా నిర్వహణపనులు చేపడుతున్నా గేట్లు, రోప్‌లు, బేరింగ్‌లను మార్చాలని అధికారులు అంచనా వేశారని అన్నారు. దానికనుగుణంగా గత ఏడాది మే నెలలో 3.52 కోట్లతో ప్రతిపాదనలను పూర్తిచేసి, టెండర్ ప్రక్రియ పూర్తిచేసి ఏజెన్సీని నియమించామని వివరించారు. ఏజెన్సీ గేట్ల బిగింపు కాకుండా మిగతా పనులను పురోగతిలో ఉన్నట్లు, ఆ తరువాతే స్టేట్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ రిపోర్ట్ నిన్న నే సమర్పించిందని చెప్పారు.

**రిపేర్‌లకు 45 రోజులు నీటి సరఫరాలో ఆటంకం..**

బ్యారేజీ పై గేట్లను మార్చడానికి దాదాపు 45 రోజులు పడుతుందని అంచనా వేస్తున్నట్లు, అలాగే జలాశయంలోని మొత్తం నీటిని ఎండిఎల్ దిగువకు వదలవలసిన పరిస్థితి ఏర్పడుతుందని చెప్పారు. అన్నిరోజులు హైదరాబాద్ నగరానికి 40 ఎంజిడిల నీటి కొరత ఏర్పడుతుందని వివరించారు. నగరవాసులకు తాగునీటి ఇక్కట్లు రాకుండా ఉండేందుకే కొత్తగేట్ల అమరిక వాయిదా వేస్తున్నట్లు ఈ సందర్భంగా ఎండి వివరించారు. గతంలో 2019 ఫిబ్రవరి నుంచి అక్టోబర్ 2020 వరకు బారాజ్‌లో నీటిని వినియోగించలేదని, ఆ సమయంలో గేట్ల రిపేర్ పనులు చేపట్టి ఉంటే నీటిసరఫరాలో అంతరాయం లేకుండా ఉండేదన్నారు.

## 'స్థానిక'ంలో 42శాతం రిజర్వేషన్లు పెంచకుంటే యుద్ధమే

### 90 బిసి కుల సంఘాలు, 30 బిసి సంఘాల హెచ్చరిక



ప్రజాపక్షం/ హైదరాబాద్/ ఖైరతాబాద్ : బిసి రిజర్వేషన్లను 42శాతం పెంచిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని, లేనిపక్షంలో రాష్ట్ర ప్రభుత్వంపై యుద్ధానికి దిగుతామని 90 బిసి కుల సంఘాలు, 30 బిసి సంఘాల సమావేశం హెచ్చరించింది. ఇక తమ సహనాన్ని పరీక్షించొద్దని, రిజర్వేషన్లను పెంచి తీరాల్సిందేనని డిమాండ్ చేసింది. స్థానిక సంస్థల్లో 42శాతం బిసి రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం హైదరాబాద్ లక్డీకాపూల్‌లోని ఓ ప్రైవేట్ హోటల్‌లో బిసి కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణ మోహన్, బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం వెంకటేశ్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 90 బిసి కుల సంఘాలు, 30 బిసి సంఘాల నేతలు పాల్గొనగా, ముఖ్యఅతిథిగా బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎంపి ఆర్.కృష్ణయ్య హాజరై, మాట్లాడారు. స్థానిక సంస్థల రాజ్యాంగంలోని ఆర్టికల్ 243–డి6 ప్రకారం స్థానిక సంస్థలలో బిసి రిజర్వేషన్లను పెంచే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్నదన్నారు. దీని ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం జిఒ జారీ చేసి, ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఒకవైపు బిసిలకు 42శాతం రిజర్వేషన్లు పెంచుతామని, మరోవైపు పార్టీపరంగా 42శాతం టికెట్లు ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం వివాదాస్పద ప్రకటనలు చేయడం సరికాదన్నారు. జనాభా ప్రకారం తమకు రావాల్సిన వాటా అడుగుతున్నామని స్పష్టంచేశారు. కృష్ణమోహన్ మాట్లాడుతూ 42శాతం బిసి రిజర్వేషన్ల అమలుకు ప్రభుత్వం కార్యాచరణ ప్రారంభించి, తమ నిజాయితీ నిరూపించుకోవాలని సవాల్ విసిరారు. బిసి సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం మాట్లాడుతూ బిసిలంతా గ్రామస్థాయి నుంచి ఉద్యమిస్తేనే తమ లక్ష్యం నెరవేరుతుందని అభిప్రాయపడ్డారు. సమావేశంలో మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్, బిసి సంక్షేమ సంఘం నేతలు గొరిగె మల్లేశ్, జి.అంజి, జి.అనంతయ్య, రాజేందర్, వి.రామకృష్ణ, పి.సతీశ్, రామ్‌దేవ్ మోదీ, రాజు నేత తదితరులు పాల్గొన్నారు.



## ఒయులో పిహెచ్‌డి అడ్మిషన్ల పెంపు సరికాదు : ఎఐఎస్‌ఎఫ్

ప్రజాపక్షం/హైదరాబాద్ : ఉస్మానియా విశ్వవిద్యాలయంలో 2025 విద్యా సంవత్సరం గాను పిహెచ్‌డి సీట్ల సంఖ్యను పెంచడంతో పాటు అడ్మిషన్ల ప్రక్రియకు సంబంధించి అధికారులను తీసుకున్న నిర్ణయాల పట్ల ఎఐఎస్‌ఎఫ్ నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. పిహెచ్‌డి అడ్మిషన్ ప్రక్రియలో యునివర్సిటీ అధికారులు తీసుకున్న నిర్ణయాలనువ్యతిరేకిస్తూ శనివారంఎఐఎస్‌ఎఫ్ ఓయూ కౌన్సిల్ ఆధ్వర్యంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎఐఎస్‌ఎఫ్ ఒయు అధ్యక్షులులెనిన్, కార్యదర్శి నెల్లి సత్యలు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రొఫెసర్‌ల రిటైర్మెంట్ వయసును 65 సంవత్సరాలు పెంచిన కారణంగా ప్రతి ఒక్క ప్రొఫెసర్ కు గైడ్ షిప్ ఇచ్చి పిహెచ్‌డి అడ్మిషన్ సంఖ్యను పెంచాలని దేశంలో ఏ యునివర్సిటీలో లేని విధంగా ఆర్ట్స్ అండ్ సోషల్ సైన్స్ విభాగం నోటిఫికేషన్ జారీ చేయడం దుర్మార్గమని వెంటనే అభ్యర్థులు చెల్లించిన ఫీజులను తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా జెఆర్‌ఎఫ్, ఎన్ఇటి, ఎస్ఇటి అభ్యర్థులందరికీ సమానంగా మార్కులు కేటాయించి అసమాన విధానాన్ని సరిదిద్ది ఇంటర్వ్యూలో ఒకే విధంగా మార్కులు కేటాయించాలన్నారు.అసమానంగా వైటేజ్ మార్కులు కేటాయించడం వల్ల గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చి యునివర్సిటీ నిర్వహించిన పిహెచ్‌డి ప్రవేశ పరీక్ష మెరిట్ సాధించినప్పటికీ సీటు పొందకుండా నష్టపోతున్నారని అన్నారు.అంతేకాకుండా ఫీజుల చెల్లించ లేక గడువు ముగియడంతో ఎక్కువ మొత్తంలో అభ్యర్థులు ఇంటర్వ్యూకి దరఖాస్తు చేసుకోలేక పోయారని, మరికొంత సమయం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.ఈ మీడియా సమావేశంలో ఎఐఎస్‌ఎఫ్ ఓయూ ఉపాధ్యక్షుడు ఉప్పల ఉదయ్ కుమార్, అశ్వన్, ఐఎస్‌ఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు కరణ్, సతీష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వానికి రెండు కళ్ళు

### మైనారిటీలకు కుట్టు మిషన్ పంపిణీలో ప్రభుత్వ చీఫ్ వీప్ పట్నం మహేందర్‌రెడ్డి, మధుయాష్కీ గౌడ్



ప్రజాపక్షం/ఎల్‌బినగర్ : అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వానికి రెండు కళ్ళులా ముందుకు తీసుకెళ్లుతున్నామని ప్రభుత్వ చీఫ్ వీప్ పట్నం మహేందర్‌రెడ్డి, టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపి మధుయాష్కీ గౌడ్‌లు అన్నారు. శనివారం హయత్ నగర్‌లోని చెన్నాగొని స్వామి ఫంక్షన్ హాల్‌లో రేవంతన్న భరోసా పథకంలో భాగంగా మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమానికి ఎంఎల్‌సి బొగ్గారపు దయనంద్, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు చల్లా నరసింహారెడ్డి, మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్, క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్‌లు హాజయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రభుత్వం సంక్షేమాన్ని ఆపటం లేదని, పేద మహిళలకు వ్యక్తిగతంగా ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో ఇలాంటి కుట్టు మిషన్ల పంపిణీ చేపడుతుందని వారు పేర్కొన్నారు. మహిళలకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అన్ని రంగాల్లో ప్రాధాన్యత కల్పిస్తుందన్నారు. ముఖ్యంగా ఆర్థికంగా ఎదిగేందుకు ఆర్టీసీ బస్సుల ఏర్పాటుతో పాటు, పెట్రోల్ బంకులు, మహిళా క్యాటీన్లు తదితర స్వయం ఉపాధి ఏర్పాటు చేయిస్తుందన్నారు. మహిళల కుటుంబాల్లో భరోసా కల్పించాలన్న లక్ష్యంతో రేవంతన్న భరోసా పథకం ద్వారా కుట్టు మిషన్లను పంపిణీ చేస్తున్నట్లు వారు వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు వజీర్ ప్రకాష్ గౌడ్, లక్ష్మి ప్రసన్న, టిపిసిసి కార్యదర్శి గజ్జి భాస్కర్ యాదవ్, మహిళా మాజీ అధ్యక్షురాలు కళ్లెం సుజాత రెడ్డి, ధారాసింగ్, డివిజన్ అధ్యక్షులు చెన్నగొని రవీందర్, శ్రీపాల్‌రెడ్డి, వేణుగోపాల్, సదాశివుడు తదితరులు పాల్గొన్నారు.

## పివి సేవలు మరువలేనివి:మహేష్ భగవత్



ప్రజాపక్షం/హైదరాబాద్: భారత మాజీ ప్రధానమంత్రి పివి నరసింహారావు 104 జయంతి ఉత్సవాలు లక్డికాపూల్‌లోని డిజిపి కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పివి నరసింహారావు చిత్రపటానికి రాష్ట్ర శాంతి భద్రతల అదనపు డిజిపి మహేష్ భగవత్ పూలమాల వేసి పుష్పాంజలి అర్పించారు. ఈ సందర్భంగా మహేష్ భగవత్ మాట్లాడుతూ.. పి.వి.నరసింహారావు దేశానికి ప్రధానిగా చేసిన సేవలు, ముఖ్యంగా ఆర్థిక రంగంలో చేసిన సంస్కరణలు, విద్యా రంగంలో చేసిన అభివృద్ధి, భాషా, సాంస్కృతిక రంగాల పట్ల ఆయన చూపిన అభిమానాన్ని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో శాంతి భద్రతల ఏఐజి రమణ కుమార్, సిఎస్ ఓసిహెచ్ యోగేశ్వరరావు, డిఎస్‌పిలు ఏ. వేణుగోపాల్, ఉదయ భాస్కర్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## భారత దేశాన్ని మార్చిన పివి నరసింహారావు పాలన



ప్రజాపక్షం/ సరూర్‌నగర్ : మాజీ ప్రధాని పి.వి.నరిసింహారావు పాలన భారత దేశాన్ని మార్చిందని, తెలంగాణ మట్టిలో పుట్టిన పివి దేశానికి చేసిన సేవలు చిర స్మరణీయమని టిపిసిసి సభ్యులు, మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి అన్నారు. శనివారం పివి నర్సింహారావు జయంతిని పురస్కరించుకోని ఆర్‌కెపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దేప ముఖ్యఅతిధిగా హాజరై అల్కాపురి చౌరస్తాలోని ఆయ న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏ సాధారణ రైతు కుటుం బం నుంచి దేశ ప్రధాని వరకు ఎదిగిన మహానేత 1991లో దేశం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉండగా అద్భుతమైన నిర్ణయాలు తీసుకోని దేశ ఆర్థిక వ్యూహాన్ని మార్పు చేశారని గుర్తు చేశారు.

## 'ప్రైవేట్'లో రిజర్వేషన్ బిల్లు పార్లమెంట్‌లో పెట్టాలి



ప్రజాపక్షం/ఖైరతాబాద్ : వర్షాకాల పార్లమెంట్ సమావేశాల్లో ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ బిల్లు పెట్టాలని సోషలిస్టు కూటమి జాతీయ కార్యదర్శి ఎల్. జైబాబు కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో జరిగిన సోషలిస్టు తెలంగాణ కూటమి రాష్ట్ర కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసిలు సామాజిక, ఆర్థిక రంగాల్లో సమ ప్రాధాన్యం కోసం పార్లమెంట్ లోపల, బయట సోషలిస్టు పార్టీలు, కమ్యూనిస్టులు పోరాడుతున్నారని తెలిపారు. కొన్నేండ్లుగా వివిధ పార్టీల ఎంపిలు ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ బిల్లుపై పట్టుబట్టినా తిరస్కరణకు గురైందన్నారు. అనేక రంగాల్లో కార్మికులు శ్రమదోపిడీ, యాజమాన్య దోపిడీకి గురవుతున్నారని తెలిపారు. సిఎం రేవంత్‌రెడ్డి పార్టీ ఎంపిలకు దిశానిర్దేశం చేసి, ప్రైవేట్‌లో రిజర్వేషన్ బిల్లు తెచ్చేలా కృషిచేయాలని ఆయన కోరారు సమావేశంలో సోషలిస్టు కూటమి తెలంగాణ ఇన్‌చార్జి సింగం శ్రీనివాస్, తెలంగాణ మహిళా కార్యదర్శి డి.రాణి, జాతీయ సలహాదారులు దేవసేన, ఎంసిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఎం.చంద్రశేఖర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

## మూడు ఆలయాలకు రూ.1.50 కోట్లు మంజూరు

### షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



ప్రజాపక్షం/షాద్‌నగర్: దేవాలయాల అభివృద్ధి కోసం గత ప్రభుత్వాలు జిఒలు ఇచ్చి చేతులు దులుపుకున్నాయే తప్ప ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మండిపడ్డారు. శనివారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ షాద్‌నగర్ సమీపంలో ఉన్న చౌదమ్మగుట్ట ఆంజనేయ స్వామి దేవాలయానికి రూ.50లక్షలు, ఫరూక్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్ట భవాని మాత ఆలయాలనికి రూ.50లక్షలు, నందిగామ మండల పరిధిలోని మామిడిపల్లి గ్రామంలో ఉన్న రామాలయానికి రూ.50లక్షల చొప్పును మొత్తం రూ.1.50 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. సిజిఎఫ్ నిధుల ద్వారా భక్తుల తక్షణ అవసరాలు తీర్చేందుకు ఈ నిధులను మంజూరు చేయించినట్లు తెలిపారు. ఈ ఆలయాలను అభివృద్ధి చేయాలని కాంగ్రెస్ యువ నాయకుడు నవీన్ గౌడ్, మాజీ ఎంపిటిసి శ్రీశైలం గౌడ్, భవానిమాత ఆలయ కమిటీ చైర్మెన్ ముత్యాల రాజులు తమ దృష్టికి తీసుకువచ్చినట్లు ఎమ్మెల్యే వివరించారు. ప్రభుత్వాలే కాకుండా దాతలు సైతం ముందుకు వచ్చి ఆలయాల ను అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని సూచించారు. పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేయించడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు ప్రత్యేకం కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భవాని మాత ఆలయ చైర్మెన్ ముత్యా ల రాజు, మాజీ ఎంపిటిసి శ్రీశైలం గౌడ్, యువనేత నవీన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**దేశ ఆర్థిక వ్యవస్థను పటిష్ఠం చేసిన ఘనత పివిదే**

దేశ ఆర్థిక వ్యవస్థను పటిష్టం చేసిన ఘనత పివి నరసింహారావుకే దక్కిందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం షాద్‌నగర్‌లో పివి నరసింహారావు జయంతి సందర్భంగా చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజకీయ రంగాల్లో ప్రవేశపెట్టిన సంస్కరణలు దేశాన్ని అభివృద్ధి వైపు తీసుకు వెళ్ళాయని వివరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు చెన్నయ్య, మండల పార్టీ అధ్యక్షులు చల్లా శ్రీకాంత్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

## సికింద్రాబాద్ ప్రాంతంలో.. ఎలివేటెడ్ కారిడార్‌ల నిర్మాణంలో కీలక పురోగతి

### రక్షణ శాఖ, మున్సిపల్ అధికారుల మధ్య ఒప్పందం

ప్రజాపక్షం/హైదరాబాద్ : సికింద్రాబాద్ ప్రాంతంలో రెండు ఎలివేటెడ్ కారిడార్‌ల నిర్మాణానికి అవసరమైన 'ఎ 1' రక్షణ బూముల బదిలీ కోసం ఒప్పందంపై రాష్ట్ర ప్రభుత్వం తరపున హెచ్‌ఎండిఏ చీఫ్ ఇంజనీర్ రవీందర్, తెలంగాణ, ఆంధ్ర సబ్ ఏరియా, బ్రిగేడియర్ ఎస్.రాజీవ్, స్టేషన్ కమాండర్ సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎయుడి కార్యదర్శి డాక్టర్ కె. ఇలాంబర్తి హెచ్‌ఎండిఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, బ్రిగేడియర్ కె. సోమశంకర్, ఎస్‌ఎం (రిటైర్డ్, సలహాదారు), జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్, మేజర్ జనరల్ అజయ్ మిశ్రా, ఇతర సైనిక అధికారులు హాజరయ్యారు. రక్షణ మంత్రిత్వ శాఖ ఎలివేటెడ్ కారిడార్‌ల నిర్మాణానికి మార్చి 1వ తేదీన అనుమతిని మంజూరు చేసింది. ఈ ఒప్పందంలో రక్షణ భూమి బదిలీ, భారత సైన్య ఆస్తుల నిర్మాణం, ఎలివేటెడ్ కారిడార్‌ల నిర్మాణ సమయంలో కీలక స్థాపనల భద్రతకు సంబంధించిన విధానాలు, కాలపరిమితులు, పద్ధతులు వివరించారు.

# క్రీడ

# మెరుపు సెంచరీ..

## చరిత్ర సృష్టించిన 19 ఏళ్ల కుర్రాడు!



అంతర్జాతీయ క్రికెట్‌లో మరో స్టార్ అవతరించాడు. 19 ఏళ్లకే మెరుపు సెంచరీతో చరిత్ర సృష్టించాడు దక్షిణాఫ్రికా క్రికెటర్ లుహాన్ డ్రె ప్రిటోరియస్. శనివారం జింబాబ్వేతో తొలి టెస్టులో టెస్టులో అరంగేట్రం చేసిన ప్రిటోరియస్.. శతకంతో చెలరేగాడు. తన విధ్వంసక బ్యాటింగ్‌తో ప్రత్యర్థి బౌలర్లను ఉతికేసిన ఈ యంగ్ స్టర్ 61 ఏళ్ల రికార్డును బద్దలు కొట్టాడు. బులావయాలోని క్వీన్స్ స్పోర్ట్స్ క్లబ్‌లో సుడిగాలి ఇన్నింగ్స్‌తో జట్టును ఆదుకున్న ప్రిటోరియస్.. గ్రేమ్ పొలాక్‌ను నెట్టేశాడు. తమదేశం తరఫున చిన్న వయసులోనే మూడంకెల స్కోర్ చేసిన ఆటగాడిగా గుర్తింపు సాధించాడు. టీమ్ పరంగా చూస్తే.. మొదటి మ్యాచ్‌లోనే వంద కొట్టిన ఏడో సఫారీ క్రికెటర్‌గా రికార్డు పుస్తకాల్లో చోటు దక్కించుకున్నాడీ చిచ్చరపిడుగు. ఈరోజుకు అంటే జూన్ 28 నాటికి ప్రిటోరియస్ వయసు 19 ఏళ్ల 93 రోజులు మాత్రమే. ప్రిటోరియస్ కంటే ముందు తొలి టెస్టులోనే సెంచరీ బాదిన సఫారీలు ఐదుగురు. విల్లగోబై, కొట్జీ, రుడాల్ఫ్, బారీ రిచర్డ్స్, జాక్వెస్ రుడాల్ఫ్‌లు తమ మొదటి మ్యాచ్‌లోనే వందతో మురిసిపోయారు.

### ఐదో స్థానంలో క్రీజులోకి

అండర్ 19 క్రికెట్‌లో తన బ్యాటింగ్ విన్యాసాలతో అలరించిన ప్రిటోరియస్ సెలెక్టర్ల దృష్టిలో పడ్డాడు. జింబాబ్వే పర్యటనకు ఎంపికైన అతడు తొలి మ్యాచ్‌తో టెస్టుల్లో అరంగేట్రం చేశాడు. లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్ అయిన అతడు.. ఐదో స్థానంలో క్రీజులోకి వెళ్లాడు. అప్పటికి 25 పరుగులకే 3 వికెట్లు పడ్డాయి. ఆ దశలో ఒత్తిడిని తట్టుకుంటూ ప్రిటోరియస్ అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. నాలుగో బంతికే సిక్సర్ బాదిన అతడు.. ఆ తర్వాత జింబాబ్వే బౌలర్లకు చుక్కలు చూపిస్తూ 54 బంతుల్లోనే అర్ధ శతకం బాదాడు. ఫిఫ్టీ తర్వాత కూడా దూకుడుగా ఆడి112 బంతుల్లోనే రెండు సిక్సర్లు, ఏడు ఫోర్లతో శతకానికి చేరువయ్యాడీ హిట్టర్. దక్షిణాఫ్రికా తరపున వేగవంతమైన సెంచరీ బాదిన ప్రిటోరియస్ పలు రికార్డులు బద్దలు కొట్టాడు. అరంగేట్రంలోనే వేగవంతమైన శతకవీరుడిగా అవతరించాడు. ఇంతకుముందు ఈ రికార్డు స్టియాన్ వాన్ జైల్ పేరుతో ఉండేది. 2014లో వెస్టిండీస్‌పై స్టియాన్ 129 బంతుల్లో మూడంకెల స్కోర్ సాధించాడు. 2010లో అల్విరో పీటర్సన్ భారత్‌పై 160 బంతుల్లోనే శతకగర్జన చేశాడు.

## చెన్నైలో హాకీ వరల్డ్ కప్..

### ఒకే గ్రూప్‌లో భారత్, పాకిస్థాన్



'ఆపరేషన్ సిందూర్' తర్వాత భారత్, పాకిస్థాన్‌ల మధ్య దౌత్య సంబంధాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఇరుదేశాల మధ్య క్రికెట్ కాదు కదా.. ఇతర ఏ ఆట కూడా సాధ్యంకాని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో దాయాదిల మ్యాచ్ చూసే అవకాశం అభిమానులకు లభించింది. పురుషుల జూనియర్ హాకీ వరల్డ్ కప్‌లో భారత్, పాకిస్థాన్ జట్లు ఒకే గ్రూప్‌లో ఉండడమే అందుకు కారణం. తమిళనాడులోని చెన్నై, మధుర వేదికగా జరుగనున్న హాకీ వరల్డ్ కప్ షెడ్యూల్‌ను శుక్రవారం ప్రకటించారు. స్విట్జర్లాండ్‌లోని లసాన్నేలో జరిగిన కార్యక్రమంలో అంతర్జాతీయ హాకీ సమాఖ్య అధ్యక్షుడు తయ్యబ్ ఇక్రమ్ డ్రా తీశారు. అందులో.. గ్రూప్ బీలో ఇండియా, పాకిస్థాన్ టీమ్‌లతో పాటు చిలీ, స్విట్జర్లాండ్‌లకు చోటు దక్కింది. భారత్ ఆతిథ్యమిస్తున్న పురుషుల జూనియర్ హాకీ వరల్డ్ కప్ చెన్నైలో నవంబర్ 28న ప్రారంభం కానుంది. డిసెంబర్ 10 వరకూ జరగనున్న ఈ మెగా టోర్నీలో మొత్తం 24 జట్లు పోటీపడనున్నాయి. ఈ టీమ్‌లను ఆరు గ్రూప్‌లుగా విభజించారు. గ్రూప్ ఏలో జర్మనీ, దక్షిణాఫ్రికా, కెనడా, ఐర్లాండ్ జట్లు ఉండగా.. గ్రూప్ సీలో అర్జెంటీనా, న్యూజిలాండ జపాన్, చైనా పోటీ పడుతున్నాయి. గ్రూప్ డీలో స్పెయిన్, బెల్జియం, ఈజిప్ట్, నమీబియా ఉన్నాయి. గ్రూప్ ఈ నుంచి నెదర్లాండ్స్ మలేషియా, ఇంగ్లాండ్ ఆస్ట్రియాలు .. గ్రూప్ ఎఫ్ నుంచి ఫ్రాన్స్, ఆస్ట్రేలియా, కొరియా, బంగ్లాదేశ్‌లు బరిలోకి దిగనున్నాయి.

### ఇది మూడోసారి..



మనదేశంలో పురుషుల హాకీ జూనియర్ వరల్డ్ కప్ నిర్వహించడం ఇది మూడోసారి. 2016లో లక్నో, 2021లో భువనేశ్వర్ నగరాల్లో వరల్డ్ పోటీలు విజయవంతం అయినందున తమ రాష్ట్రంలోనూ ఘనంగా జరిపేందుకు తమిళనాడు ప్రభుత్వం సన్నాహకాలు చేస్తోంది. వరల్డ్ కప్ టోర్నీ ప్రచారం నిమిత్తం జూన్ 19 రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ లోగోను ఆవిష్కరించారు.

# మెరిసిన మంధాన, శ్రీ చరణి

## తొలి టీ20లో ఇంగ్లాండ్‌పై భారత్ ఘన విజయం

ఐదు టీ20ల సిరీస్‌లో భారత మహిళల జట్టు అదిరే బోణీ కొట్టింది. ట్రెంట్‌బ్రిడ్జిలో ఇంగ్లాండ్‌ను వణికిస్తూ విజయం సాధించింది. స్మృతి మంధాన(112) సూపర్ సెంచరీతో కొండంత స్కోర్ కొట్టిన టీమిండియా.. అనంతరం ప్రత్యర్థిని 113కే కట్టడి చేసి 97 పరుగుల తేడాతో జయభేరి మోగించింది. స్పిన్నర్ శ్రీ చరణి(412) విజృంభణతో ఆతిథ్య జట్టు బ్యాటర్లు చేతులెత్తేశారు. అర్ధ శతకంతో పోరాడిన నాట్ సీవర్ బ్రంట్ ఔటైన కాసేపటికే ఇంగ్లండ కుప్పకూలింది. దాంతో, ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 10తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. టీమిండియా నిర్దేశించిన భారీ ఛేదనలో ఇంగ్లాండ్ ఆది నుంచి తడబడింది. పవర్ ప్లేలోనే రెండు వికెట్లు కోల్పయిన జట్టును కెప్టెన్ నాట్ సీవర్ బ్రంట్(66) ఆదుకుంది. సహచరులు విఫలం అయినా ఆమె దూకుడుగా ఆడి అర్ధ శతకం సాధించింది. కానీ, భారత బౌలర్లు వికెట్ల వేట కొనసాగించగా.. వచ్చినవాళ్లు వచ్చినట్టు పెవిలియన్ చేరారు.15వ ఓవర్ తొలి బంతికే నాట్ సీవర్‌ను శ్రీ చరణి ఔట్ చేసింది. అదే ఓవర్లో లారెన్ బెల్‌ను చరణి ఔట్ చేయడంతో భారత జట్టు 97 పరుగుల తేడాతో గెలుపొందింది.



# స్పోర్ట్స్ ఫోకస్



## డిఫెండింగ్ చాంపియన్స్

గత ఏడాది జులై 1 నుంచి 14 వరకు జరిగిన వింబుల్డన్ గ్రాండ్ శ్లామ్‌లో టైటిళ్లు గెలిచిన క్రీడాకారులు...

**పురుషుల సింగిల్స్:** కార్లస్ అల్కరాజ్ (ఫైనల్‌లో నొవాక్ జొకొవిచ్‌పై విజయం)
**మహిళల సింగిల్స్:** బార్బొరా క్రెజిసికొవా (ఫైనల్‌లో జాస్మిన్ పవొలినిని ఓడించింది)
**పురుషుల డబుల్స్:** హారీ హెలియొవరా, హెన్రీ పాటెన్ (ఫైనల్‌లో వీరు తుది పోరులో మాక్స్ ప్యూర్సెల్, జోర్డాన్ థాంప్సన్ జోడీపై గెలిచారు)
**మహిళల డబుల్స్:** కాథెరిన సినియాకొవా, టేలర్ టౌన్‌సెండ్ (ఫైనల్‌లో వీరు గాబ్రియేలా డబ్రోవ్‌స్కీ, ఎరిన్ కౌట్లిఫె జోడీని ఓడించారు)
**మిక్స్‌డ్ డబుల్స్:** జన్ జీలెన్‌స్కీ, హీచ్ సు వెయ్ (వీరు ఫైనల్‌లో సాంటియాగో గొంజాలెజ్, గులియానా ఆల్మోస్ జోడీపై విజయం సాధించారు).

## 'టెన్నిస్ మహారాణి' వింబుల్డన్!



ప్రపంచ టెన్నిస్‌లో గ్రాండ్ శ్లామ్ టోర్నీలకు ఎంతో ప్రత్యేకత ఉంటే, వాటిలో వింబుల్డన్‌కు మరింత విశేష స్థానం ఉంది. అందుకే, వింబుల్డన్‌ను 'టెన్నిస్ మహారాణి'గా పేర్కొంటారు. ఆస్ట్రేలియన్ ఓపెన్, ఫ్రెంచ్ ఓపెన్, వింబుల్డన్, యుఎస్ ఓపెన్ టోర్నీలను గ్రాండ్ శ్లామ్‌గా వ్యవహరిస్తారు. వీటిలో అత్యంత సంప్రదాయ పద్ధతిలో కొనసాగే వింబుల్డన్‌కు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఈనెల 30వ తేదీ నుంచి జులై 13 వరకు జరిగే ఈ మెగా టోర్నీని ప్రత్యక్షంగా లేదా ఇతరత్రా మాధ్యమాల ద్వారా పరోక్షంగా తిలకించడానికి కోట్లాది మంది అభిమానులు సిద్ధంగా ఉన్నారు. ఇప్పటి వరకూ 137 ఎపిసోడ్స్ పూర్తికాగా, ఇది 138వ టోర్నీ. ప్రపంచంలోనే అత్యంత పురాతనమైన టెన్నిస్ చాంపియన్‌షిప్‌గా మాత్రమే కాదు.... అత్యంత ప్రతిష్ఠాత్మకమైన టోర్నమెంట్‌గా కూడా దీనికి గుర్తింపు ఉంది. ఒక రకంగా అనధికార టెన్నిస్ ప్రపంచ చాంపియన్‌షిప్‌గా పేర్కోవచ్చు. వింబుల్డన్‌లో టైటిల్ మాట ఎలావున్నా, కనీసం ఈ టోర్నీ ఆడే అవకాశాన్ని జీవితంలో ఒక్కసారి దక్కించుకున్నా చాలని టెన్నిస్ ర్యాకెట్ పట్టుకున్న ప్రతి ఒక్కరూ భావిస్తారు. దీనికి ఉన్న క్రేజీ అలాంటిది. ఇంగ్లాండ్ లాన్ టెన్నిస్ క్లబ్‌లో, 1877లో ప్రారంభమైన ఈ టోర్నమెంట్ 1922 నుండి ప్రస్తుత మైదానంలోకి మారింది. నిరంతరం అభివృద్ధి చెందుతున్నది. మొత్తం 19 కోర్టులు ఉంటే, మొదటి కోర్ట్ సీటింగ్ కెపాసిటీ 11,500. పచ్చిక (గ్రాస్)పై ఆడే ఏకైక గ్రాండ్ శ్లామ్ టెన్నిస్ టోర్నమెంట్ ఇదే. అత్యంత సంప్రదాయబద్ధంగా, టెన్నిస్ విలువలకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చే ఈ టోర్నమెంట్‌కు ప్రత్యేకమైన డ్రెస్ కోడ్ కూడా ఉంది. పోటీలో పాల్గొనే ప్రతి ఒక్కరూ తెల్లటి డ్రెస్ మాత్రమే వేసుకోవాలి. తలకు కట్టుకునే హెడ్ బ్యాండ్ నుంచి కాళ్లకు వేసుకునే బూట్ల వరకూ 'వైట్ డ్రెస్ కోడ్'ను ఖచ్చితంగా పాటించాల్సి ఉంటుంది. టెన్నిస్‌కు ఉన్న గౌరవం, ఆటగాళ్ల మధ్య పరస్పర మర్యాద, శాంతికి తెలుపుతనాన్ని చిహ్నంగా భావిస్తారు. ఇది గ్రాస్ కోర్ట్ చాంపియన్‌షిప్ కావడంతో, ముందుగానే గడ్డిని పెంచి, పోటీల ప్రారంభానికి నాలుగు వారాల ముందు 8 మిల్లీ మీటర్ల ఎత్తుకు కత్తిరిస్తారు. మ్యాచ్‌ల సమయంలో గ్రౌండ్ సిబ్బంది ప్రతి రోజూ లైన్లను తిరిగి పెయింట్ చేస్తారు. టోర్నీ ముగిసే వరకూ పచ్చిక ఎత్తు 8 మిమ్మీ మీటర్ల కంటే ఎక్కువ లేకుండా జాగ్రత్తలు తీసుకుంటారు. టోర్నమెంట్ ముగిసిన వారం రోజుల తర్వాత, వచ్చే ఏడాది గడ్డి కోసం సన్నాహాలు ప్రారంభమవుతాయి. వింబుల్డన్ గ్రాస్ కోర్ట్ కావడంతో, అత్యధిక శాతం టోర్నీలు ఇతరత్రా ప్రాంతాల్లో జరుగుతాయి. క్లే కోర్ట్, హార్డ్ కోర్ట్‌లపై అత్యధిక శాతం టోర్నీలు నిర్వహిస్తారు. కాబట్టి వింబుల్డన్‌లోని ఆల్ ఇంగ్లాండ్ క్లబ్‌లో కోర్ట్‌లన్నీ ఏడాది పొడవునా, దాదాపు ఖాళీగానే ఉంటాయి. ఇలాంటి ఎన్నో ప్రత్యేకతలు సంతరించుకున్న ఈ టోర్నమెంట్‌ను పురుషులు, మహిళల విభాగాల్లో సింగిల్స్, డబుల్స్‌తోపాటు మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలోనూ పోటీలుగల ఈవెంట్‌గా నిర్వహిస్తారు.



## ఫెదరర్ 'ది గ్రేట్'



వింబుల్డన్ పురుషుల సింగిల్స్‌లో రోజర్ ఫెదరర్ నెలకొల్పి రికార్డును అధిగమించడం అసాధ్యం కాకపోయినప్పటికీ, సులభ సాధ్యం మాత్రం కాదు. కెరీర్‌లో అతను మొత్తం 8 పర్యాయాలు వింబుల్డన్ టైటిల్ స్వీకరించాడు. వీటిలో ఐదు పర్యాయాలు వరుస టైటిళ్లు కావడం విశేషం. ఈ రెండూ వింబుల్డన్ రికార్డులే. సింగిల్స్ విభాగంలో ఎక్కువ మ్యాచ్‌లు గెలిచిన ఆటగాడిగానూ ఫెదరర్ పేరు రికార్డు పుస్తకాల్లో ఉంది. అతను మొత్తం 105 పురుషుల సింగిల్స్ మ్యాచ్‌లు గెలిచాడు. ఎక్కువ సమయం కొనసాగిన సింగిల్స్ ఫైనల్ 2019లో జరిగింది. 4 గంటల 57 నిమిషాలు టైటిల్ కోసం నొవాక్ జొకొవిచ్‌తో ఫెదరర్ తీవ్రంగా పోరాడాడు. టైటిల్ అందుకోలేకపోయినా, అత్యంత సుదీర్ఘమైన ఫైనల్ ఆడిన ఆటగాడిగా మరో రికార్డును అందుకున్నాడు. కాగా, వింబుల్డన్ జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో విజేతగా నిలిచిన నలుగురిలో ఫెదరర్ ఒకడు. జోన్ బోర్గ్ (1972/ 1976), పాట్ కాష్ (1982/ 1987), స్టెఫాన్ ఎడ్బర్గ్ (1983/ 1988) ఈ ఘనతను అందుకోగా, ఫెదరర్ 1988లో జూనియర్స్, 2003లో మొదటిసారి సీనియర్స్ విభాగాల్లో వింబుల్డన్ టైటిల్ గెల్చుకున్నాడు.

## తిరుగులేని.. నవ్రతిలోవా



ఒకప్పుడు టెన్నిస్ సామ్రాజ్యాన్ని ఏలిన మార్టినా నవ్రతిలోవా, వింబుల్డన్‌లో అత్యధిక పర్యాయాలు మహిళల సింగిల్స్ టైటిళ్లు అందుకున్న క్రీడాకారిణిగా రికార్డు నెలకొల్పిమంది. ఓపెన్ ఎరాలో ఆమె తొమ్మిది టైటిళ్లు సాధించింది. అంతకు ముందు అమెచూర్ కాలంలో హెలెన్ విల్స్ 8 టైటిళ్లతో నెలకొల్పిన రికార్డును నవ్రతిలోవా అధిగమించడమేగా, ఓపెన్ ఎరాలోనూ మరెవరూ అందుకోలేని రీతిలో అత్యధిక టైటిళ్లు సంపాదించింది. అంతేకాదు, సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగాలతో కలిసి ఎక్కువ టైటిళ్లు కైవసం చేసుకున్న రికార్డును బిల్లీ జీన్ కింగ్‌తో పంచుకుంటున్నది. వీరిద్దరూ చెరి 20 టైటిళ్లు అందుకున్నారు. వింబుల్డన్ మహిళల సింగిల్స్‌లో ఎక్కువ మ్యాచ్‌లు (120) గెల్చుకున్న క్రీడాకారిణిగా కూడా ఆమె రికార్డు నెలకొల్పింది. ఈ పోటీల్లో ఎక్కువ మ్యాచ్‌లు (326) ఆడిన క్రీడాకారిణి కూడా నవ్రతిలోవాయే కావడం గమనార్హం.

## వామపక్ష లౌకిక శక్తులు ఏకం కావాలి

### కామ్రేడ్స్ ఆయుధాలు వీడి రండి.. బిజెపికి వ్యతిరేకంగా పోరాడుదాం

### సిపిఐ జాతీయ సమితి సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకటరెడ్డి




ప్రజాపక్షం/సంస్థాన్‌నారాయణపురం:బిజెపిని నిలువరించేందుకే కాంగ్రెస్ అన్ని పార్టీలతో కలిసి కేంద్రంలో యూపీఏ కూటమి ఏర్పాటు చేసిందని శుక్రవారం జరిగిన సిపిఐ మండల 15వ మహాసభలలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకటరెడ్డి అన్నారు. శ్రీలంకలో తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో అక్కడి ప్రజలు కమ్యూనిస్టు పార్టీకే పట్టం కట్టారని మాట్లాడారు. రెండు రాష్ట్రాల మద్దతుతో బిజెపి కేంద్రంలో అధికారానికి రాగాలిగారని, అధికారంలోకి వచ్చి కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా చట్టాలను తయారు చేస్తుందన్నారు. మావోయిస్టులు చర్చలకు సిద్ధమని తెలిపిన అధికార అహంకారంతో అమిత్ షా కగార్ పేరుతో మావోయిస్టులను ,అమాయక ఆదివాసులను పొట్టన పెట్టుకుంటున్నారని తీవ్రంగా విమర్శించారు. ఇప్పటికైనా మావోయిస్టులు ఆయుధాలు వీడి జనజీవన స్రవంతి లోకి వచ్చి వామపక్ష పార్టీలో చేరి బిజెపి వ్యతిరేక విధానాలపై పోరాడేందుకు సిద్ధమవ్వాలని పిలుపునిచ్చారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో సిపిఐ అభ్యర్థులను గెలిపించుటకు కృషి చేయాలని కోరారు. సిపిఐ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు యానాల దామోదర్ రెడ్డి, బొలగాని సత్యనారాయణ, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండి. ఇమ్రాన్, బచ్చనగోని గాలయ్య, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జక్క దయాకర్ రెడ్డి, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు కె శ్రీనివాస్, సిపిఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, నాయకులు చిలువేరు అంజయ్య, కలకొండ సంజీవ, పొట్ట శంకరయ్య, మంచాల జంగయ్య, కందుల లింగమ్మ, పల్లె మల్లారెడ్డి, పందుల యాదగిరి, కొండూరు విప్లవ్, శనిగల నరేష్, మారగొని నాగరాజు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికల్లో కమ్యూనిస్టులను గెలిపించాలి : తక్కళ్లపల్లి శ్రీనివాసరావు




ప్రజాపక్షం/ఎల్కతుర్తి : రానున్న స్థానిక సం స్థలఎన్నికల్లో కమ్యూ నిస్టులను గెలిపించాలని సిపిఐ రాష్ట్ర సహా య కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. శనివారం హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో కమలాపూర్, బీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాల పార్టీ ముఖ్యుల సమావేశం శనిగరపు రాజ్ కుమార్ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి కార్యకర్తలు సిద్దంగా ఉండాలని, ఎన్నికల్లో సత్తా చాటాలన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఆదరి శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఊట్కూరి రాములు, కర్రే లక్ష్మ ణ్, మంచాల రమాదేవి, నకిర్త ఓదెలు, జక్కు రాజు గౌడ్, ఆదరి రమేష్, మద్రి శ్రీనివాస్, కొంగల రామచంద్రారెడ్డి, తిరుమల, మద్రి విజయ్, బొంత మల్లయ్య, చంద్రమౌళి, సుంచు కుమారస్వామి, తండ ముండయ్య, నిమ్మల మనోహర్, గడ్డం లలిత, రాణి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల పక్షాన సిపిఐ నిరంతర పోరాటం

### కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలు అరికట్టేందుకు..

**గోదా శ్రీరాములు**




ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను అరికట్టుటకై ప్రజల పక్షాన నిరంతరం సంఘటితంగా పోరాటాలు చేయాలని జిల్లా సిపిఐ కార్యదర్శి గోదా శ్రీరాములు పిలుపునిచ్చారు. శనివారం భూదాన్ పోచంపల్లి పట్టణంలోని పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న టై అండ్ డై అసోసియేషన్ భవనంలో నిర్వహించిన 12వ సిపిఐ మండల మహాసభలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన సిపిఐజెండానుఆవిష్కరించిమాట్లాడారు.దేశంలో రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక విధానాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పట్ల పరిష్కారానికై నిత్యం ప్రజల్లో ఉంటూ పోరాటాలు చేస్తూ ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకువచ్చి ప్రజల పక్షాన నిలిచిన ఏకైక పార్టీ సిపిఐ అని అన్నారు. ప్రజా వ్యతిరేక నిర్ణయాలు తీసుకున్నప్పుడు సంఘటితంగా ప్రజలందరూ ఏకమై నడుం బిగించి పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. పోచంపల్లి మండలం,మండల పరిసర ప్రాంతాలలోని గ్రామాలలోని మౌలిక వసతులు లింక్ రోడ్ల నిర్మాణాలను చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భూస్వామ్య పెత్తందారుల వ్యవస్థ నుంచి దున్నేవారికి భూమి కావాలని రైతు కూలీలను సంఘటిత పరిచి పీడిత ప్రజల పక్షాన నిలబడి తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో వేలాదిమంది అమరవీరుల త్యాగాల వారసులుగా నిలబడి తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఘన చరిత్ర సిపిఐ పార్టీ అని ఆయన తెలిపారు. ముఖ్యంగా పోచంపల్లి మండలంలో ప్రతి ఆదివారం జరిపే సంతకు శాశ్వత సంతను, పశువుల సంతకు స్థలం కేటాయించాలని, పిల్లాయిపల్లి కాల్వను పనులను త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సిపిఐ పార్టీ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు.కార్యదర్శిగా 3వసారి గోదళ్ళ భూషణ్‌గౌడ్ సహాయ కార్యదర్శిగా ముసునూరి రాములు కార్యవర్గ సభ్యులుగా భీమగోని నరసింహ సంగెం గణేష్ మూషం శివలను ఎన్నుకున్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, జిల్లా సహాయ కార్యవర్గ సభ్యులు బోలగోని సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు బోడ సుదర్శన్, సిపిఐ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్రం

### 9న దేశవ్యాప్త సమ్మె

### వాసిరెడ్డి సీతారామయ్య




ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : కేంద్రంలో పాలన సాగిస్తున్న బిజెపి ప్రభుత్వ కార్మిక హక్కులను కాలరాస్తోందని, 44 కార్మిక చట్టాలను అపహాస్యం చేస్తూ తీసుకొచ్చి నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కార్మిక సంఘాల జెఎసి నాయకులు ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ఐఎన్‌టియుసి నాయకులు త్యాగరాజన్, సిఐటియు, ఎస్ఇసియు నాయకులు రాజిరెడ్డి, టిబిజికెఎస్ జనరల్ సెక్రెటరీ కాపు కృష్ణ అన్నారు. జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయం శేషగిరి భవన్‌లో కార్మిక సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోడి నాయకత్వంలోని బిజేపి ప్రభుత్వం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి, వాటి స్థానంలో లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందన్నారు. తద్వారా కార్మిక సంఘాలు పెట్టుకుని, సమ్మెచేసి హక్కు కోల్పోయే పరిస్థితి ఉందన్నారు. కార్పోరేట్ శక్తులకు అనుకూలంగా మోడి పాలన సాగుతూ కార్మికులను అణిచివేసే దిశగా ముందుకుపోతోందన్నారు. లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ ఈనెల 9న దేశవ్యాప్తంగా కార్మిక సంఘాల ఐఖ్యవేదిక ఆధ్వర్యంలో తలపెట్టిన ఒక్కరోజు సమ్మెను అంతా జయప్రథం చేయాలని అన్నారు. తమ జీతాల కోసం కాకుండా కార్మికవర్గ శ్రేయస్సు కోసం చేపడుతున్న సమ్మెను అవసరాన్ని బట్టి దీర్ఘకాళికంగా ముందుకు తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తామన్నారు. దేశంలోని సంఘటిత, అసంఘటిత వర్గానికి చెందిన సుమారు 50 కోట్ల మంది కార్మికులు ఈ సమ్మెలో పాల్గొంటున్నారన్నారు.


భారతదేశం ఆవిర్భవించి నాటి నుండి నేటి వరకు 25 సమ్మెలు జరిగితే బిజేపి అధికారం చేపట్టిన నాటి నుండి ఇప్పటివరకు 12 దేశవ్యాప్త సమ్మెలు జరిగాయన్నారు. ఇప్పటికైనా నరేంద్రమోడి కార్మికులపై కక్షకట్టడాన్ని ఆపాలన్నారు. ఈ విలేకరుల సమావేశంలో ఏఐటియూసి నాయకులు వంగా వెంకట్, రమణ మూర్తి, ఐఎన్‌టియుసి, ఐటియు,టిబిజికెఎస్, సింగరేణి అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 9న సార్వత్రిక సమ్మెకు సన్నాహం



ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి: దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జూలై 9న నిర్వహించడం జరుగుతుందని ఎఐటియుసి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ అన్నారు. ఎఐటియుసి వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో డిఎంహెచ్ఓ కార్యాలయలో శనివారం నర్సంపేట డిప్యూటీ డిఎంహెచ్ఓ, డిస్టిక్ ఇమినైజేషన్ ఆఫీసర్ డాక్టర్ ప్రకాష్ , వర్ధన్నపేట డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ కొమురయ్యలకు సమ్మె నోటీస్‌ను అందించారు. ఆయన మాట్లాడుతూ జూలై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగం గా జాతీయ ఆరోగ్యమిషన్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులంతామహాధర్నా కార్యక్రమానికి హాజరై విజయవంతంచేయాలని, ఉద్యోగులకు సెలవు ప్రకటించాలన్నారు.ప్రభుత్వం 7నెలల ఏరియర్స్ బకాయి వెంటనే ఇవ్వాలని, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రతి నెల 1న వేతనాలు చెల్లించాలన్నారు.ఎఐటియుసి అనుబంధం జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ ఆచంట అభిషేక్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు జన్ను కొర్నోల్, ఏఐటియుసి వరంగల్ జిల్లా ఉపాధ్యక్షులు యాకూబ్ పాషా, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో సమస్యలు పట్టవా?



ప్రజాపక్షం/అడ్డగూడూరు: ప్రైవేట్ పాఠశాలలలో ఫీజు నియంత్రణ చట్టం అమలు చేయాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఉప్పుల శాంతి కుమార్ అన్నారు. మండలంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల సమస్యలు పరిష్కరించాలని, ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజు నియంత్రణ చట్టం అమలు చేయాలనిఅడ్డగూడూరు ఎంఇఒకు వినతిపత్రం అందజేశారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.ఆయన మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులకు యూనిఫామ్, పుస్తకాలు, నోట్ బుక్స్‌లు వెంటనే అందజేయాలని డిమాండ్ చేశారు. అలాగే విద్యార్థులకు సరిపడ బాత్రూంలు, మరుగుదొడ్లు, మంచినీటి సౌకర్యం కల్పించాలన్నారు. మండలంలో పాఠశాలల భవనాలు శిథిలావస్థలో ఉన్నాయని వెంటనే కొత్త భవనాలు నిర్మించాలని,ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులు వసూలు చేస్తూ పుస్తకాలు అమ్మితే దాడులు చేస్తామని హెచ్చరించారు. సంఘం మండల నాయకులు చిప్పలపల్లి బన్నీ తరుణ్, సంజయ్ ఉన్నారు.

## పేరెంట్స్ కమిటీల అనుమతి లేకుండా ఫీజుల పెంపా? : ఎఐఎస్ఎఫ్




ప్రజాపక్షం/జగిత్యాలటౌన్: కార్పొరేట్ ప్రైవేట్ విద్యాసంస్థల్లో పేరెంట్స్ కమిటీల అనుమతి లేకుండా అధిక ఫీజులు వసూలు ఎలా పెంచుతారని ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి అక్రమ్ మాలిక్ అన్నారు జగిత్యాల పట్టణంలో స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద శనివారం ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ ఒకవైపు ప్రభుత్వం 25 శాతం ఉచిత విద్య కార్పోరేట్ ప్రైవేట్ విద్యాసంస్థల్లో చదవడానికి అని చెప్పి కనీస పర్యవేక్షణ లేకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తు విద్య వ్యాపారం చేసే యాజమాన్యాలపై చర్యలు తీసుకోడం లేదన్నారు.ప్రైవేట్ విద్యాసంస్థలు కొమ్ము కాస్తున్నాయని దుయ్యబట్టారు.ఎఐఎస్ఎఫ్‌పట్టణ నాయకులు రామచంద్ర, సంజయ్, కార్తీక్, విఘ్నేష్, శ్రీశాంత్, బన్నీ తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్

## నంగి దేవేందర్‌రెడ్డికి డాక్టరేట్



ప్రజాపక్షం/మక్తల్: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో నిజాయితీ నిబద్ధత, అంకిత భావం కలిగిన సేవకుడు నంగి దేవేందర్ రెడ్డి అలాంటి వ్యక్తికి అంతర్జాతీయ డాక్టరేట్ గుర్తింపు దక్కింది గల్ఫ్, ఇతర దేశాల్లో పనిచేస్తున్న ప్రవాసీయులకు అందించిన సేవలకు గాను డాక్టరేట్ ఆఫ్ సోషల్ సర్వీస్ స్పెషలైజేషన్ ఇన్ ఎన్ఆర్ఐ అఫైర్స్ విభాగంలో గ్లోబల్ హ్యూమన్ పీస్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ అమెరికా గౌరవ డాక్టరేట్ పట్టా అందుకున్న నంగి దేవేందర్‌రెడ్డి మక్తల్ నియోజక వర్గం తరుపున, మా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఈ ఘనతను తాము గర్వంగా భావిస్తున్నామన్నారు. ఈ సంత ఉరితో పాటు గల్ఫ్ ప్రవాసీయులు ఆనందం వ్యక్తం చేశారు. నంగి మహేశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ఎంసి మార్గదర్శకాలు పాటించాలి



ప్రజాపక్షం/ నారాయణపేట్: నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎన్ఎంసీ) మార్గదర్శకాలకు అనుగుణంగా నారాయణపేట మెడికల్ కళాశాలలో అన్ని వసతులు ఉండేలా చూసుకోవాలని రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సొసైటీ ప్రాజెక్టు డైరెక్టర్ వాసం వెంకటేశ్వర్ రెడ్డి (ఐఎఎస్) వాసం వెంకటేశ్వర్ రెడ్డి సూచించారు. శనివారం నారాయణపేట మండలంలోని అప్పక్ పల్లి వద్ద గల ప్రభుత్వ మెడికల్ కళాశాల, జిల్లా ఆస్పత్రిని కలెక్టర్ సిక్తా పట్నాయక్ తో కలిసి తనిఖీ చేశారు. ముందుగా జిల్లా ఆస్పత్రి లోని అత్యవసర విభాగం, జనరల్ వార్డు, ఐసీయూ, జనరల్ మందుల విభాగాలను పరిశీలించారు. జనరల్ వార్డు లో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వైద్య సేవలు ఎలా అందుతున్నాయని ఆరా తీశారు. కళాశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామ్ కిషన్ ప్రభుత్వ మెడికల్ కళాశాల, జిల్లా ఆస్పత్రి లో ఉన్న వసతి సౌకర్యాలు, అవసరమైన సదుపాయాలు, ఖాళీ పోస్టులు, కళాశాల చుట్టూ ప్రహరీ, మార్చురీ గది నిర్మాణం, జనరేటర్లు, అక్సిజన్ ప్లాంటు, ఇంటర్నల్ రోడ్లు, పారిశుద్ధ్య సిబ్బంది, తదితర అంశాలను వివరించారు. వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ. కళాశాల, జిల్లా ఆస్పత్రికి ఇంకా ఏయో సదుపాయాలు, వైద్య పరికరాలు, యంత్రాలు అవసరమో గుర్తించి సమగ్ర నివేదిక అందజేయాలని మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ కు సూచించారు. స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వర్, మెడికల్ కళాశాల డైరెక్టర్ రమేష్, వైద్య నిపుణులు ఆదిత్య, టీజీ ఎమ్ఐడిసి డీ.ఈ. కృష్ణ మూర్తి, ఏ ఈ సాయి మురారి పాల్గొన్నారు.

# పెన్షన్లతోనే ఆర్థిక భరోసా

### కలెక్టర్ సిక్తా పట్నాయక్



ప్రజాపక్షం/నారాయణపేట్: పేదలకు ప్రభుత్వం ఇచ్చే పింఛన్లు ఆర్థిక భరోసాను, సామాజిక భద్రతను అందిస్తాయని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. శనివారం జిల్లా కేంద్రానికి సమీపంలో గల వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రంలో చేయూత పథకంపై అన్ని మండలాల ఎంపీడీవోలు,ఎంపీవోలు, మున్సిపల్ కమిషనర్లు, పంచాయతీ కార్యదర్శులు, బిల్‌కలెక్టర్లు, సెక్షన్ సిబ్బంది, పోస్టల్ శాఖ సిబ్బందికి జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.కలెక్టర్ ముఖ్యఅతిథిగా మాట్లాడారు. చేయూత పథకాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగాతీసుకుందని,అర్హులైనప్రతి ఒక్కరికీ చేయూత పీంఛన్ పథకాన్ని వర్తింప చేయాలని సూచించారు. ఈ పథకం అమలుకు ప్రభుత్వం సూచించిన పారా మీటర్స్ ను ఖచ్చితంగా పాటించాలని చెప్పారు. చనిపోయిన వారి వివరాలను సేకరించి వారి స్థానంలో కుటుంబ సభ్యులలో అర్హులైన వారు ఉంటే వారికి పింఛన్ మంజూరు చేయాలన్నారు.పాల్గొన్న సెర్ప్ డైరెక్టర్ గోపాలరావు చేయూత పథకం లో అర్హుల ఎంపిక, మంజూరు కు పాటించాల్సిన నిబంధనలు, చనిపోయిన వారి వివరాల అప్ డేట్ గురించి క్షుణ్ణంగా వివరించారు. అంతకుముందు డిఆర్డిఓ మొగులప్ప జిల్లాలో 75,265 ( అన్ని రకాల)పింఛన్లు ఉన్నాయని, వారికి ప్రతి నెలా 19.35 కోట్లు చెల్లించడం జరుగుతుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ప్రణయ్‌కుమార్, జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

## ప్రసవాల సంఖ్య పెంచాలి



ప్రజాపక్షం / పెబ్బేరు : పెబ్బేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిడా.అల్లే శ్రీనివాసులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉన్న జనరల్, ఓపి రిజిస్టర్, డెలివరీ రిజిస్టర్, ఇన్ పేషెంట్ రిజిస్టర్ హాజరు రిజిస్టర్ తనిఖీ చేశారు. ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెంచాలని సూచించారు. సీజనల్ వ్యాధుల మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా రాకుండా ప్రతి మంగళవారం శుక్రవారం అందరూ డ్రై డే కార్యక్రమం నిర్వహించాలని వైద్య సిబ్బందికి చెప్పారు. ఆసుపత్రిలో నిర్మాణంలో ఉన్న కొత్తగా బిల్డింగ్ త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. రంగాపురం గ్రామంలో కొత్తగా నిర్మించిన ఆరోగ్యఉపకేంద్రం పరిశీలించారు.మండల వైద్యాధికారి డా. ప్రవళిక, హెల్త్ సూపర్వైజర్ నర్సింహరావు, హెల్త్ అసిస్టెంట్ రాజశేఖర్ , డాటా ఎంట్రీ ఆపరేటర్ రాజేష్ గౌడ్ , ఫార్మసిస్ట్ కుమారి, స్టాఫ్ నర్సింగ్ ఆఫీసర్ కృష్ణ, చరిత, ఆసుపత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## యువత వ్యాపార రంగం వైపు పయనించాలి



ప్రజాపక్షం/కల్వకుర్తిరూరల్ : యువత ప్రభుత్వాలపై ఆధారపడకుండా స్వయం ఉపాధి రంగాల్లో రాణించేందుకు కృషిచేయాలని మాదిగ ఇండస్ట్రియల్‌చాంబర్ ఆఫ్‌కామర్స్ ఇండస్ట్రీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుడుమ ఉమాపతి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని మిక్కి జిల్లా అధ్యక్షులు దుబ్బ నాగేష్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడుతూ మాదిగలు సామాజిక ఆర్థిక రాజకీయరంగాల్లో రాణించాలని ఆయన సూచించారు. మాదిగల ఆర్థిక సాధికారతకొరకే మిక్కి ఏర్పాటుచేశామని అన్నారు. మాదిగయువత పారిశ్రామికవేత్తలుగా మిక్కి తోడ్పాటును అందిస్తుందని సూచించారు. మిక్కి జిల్లా కోశాధికారి బొల్లె రాజన్న, మాదిగ జర్నలిస్టు పురం రాష్ట్ర ప్రధానకార్యదర్శి తక్కలపల్లిరాజేందర్,24న్యూస్‌క్రైమ్‌కౌంటర్ రాష్ట్రప్రతినిధి శేఖర్,ప్రసాద్,పాత్రికేయులుబాలు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థికసాయం



ప్రజాపక్షం/కల్వకుర్తిరూరల్ : కల్వకుర్తి మండలపరిధిలోని ఎల్లికట్ట గ్రామానికి చెందిన మాదే చంద్రమ్మ అనారోగ్యంతో మృతిచెందిన విషయం ఎల్లికట్ట గ్రామ టిఆర్ఎస్ నాయకులద్వారా తెలుసుకొని ఉప్పలచారిటబుల్‌ట్రస్టుచైర్మన్ టిఆర్ఎస్‌పార్టీ రాష్ట్ర నాయకులు , మిషన్‌భగీరథ మాజీవైస్‌చైర్మన్ ఉప్పలవెంకటేష్ సహకారంతో మృతురాలి కుటుంబసభ్యులకు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్‌పార్టీ నాయకులు యాకాల భీమయ్య, బలగంకేశవులు, కంఠంకృష్ణయ్య, కుర్మయ్య, మాదే శ్రీకాంత్, మాదే వెంకటయ్య, మాదే ఆంజనేయులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి



ప్రజాపక్షం/ధన్వాడ:ధన్వాడ మండల కేంద్రంలో భగత్‌సింగ్ ఆటో యూనియన్ నూతన కమిటీ ఏకగ్రీవంగా శనివారం రోజు ఎన్నుకున్నారు. ఉపఅధ్యక్షుడు రాము, నూతన కమిటీ గౌరవ అధ్యక్షులు ఎంఏ మసూద్, గౌరవ సలహదారులుగా టప్ప కృష్ణయ్య, నీరటి ఉసేనప్ప, వి.గోవర్ధన్ ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఎన్నికైన అధ్యక్షుడు గువ్వలపల్లి కొండన్న మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను అందరి సహకారంతో ప్రభుత్వ అధికారులతో రాజకీయ పార్టీలకు అతీతంగా కలిసి ఉండి సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేశ్, సీనియర్ డ్రైవర్లు నీరటి అశోక్, కావాలి రాజు, పూజారి శ్రీరామ్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయాల అభివృద్ధి, బిటి రోడ్డు నిర్మాణానికి నిధులు

ప్రజాపక్షం / వీపనగండ్ల: మండల పరిధిలోని కల్వరాల , సంగినేనిపల్లిలో దేవాలయాల అభివృద్ధి, వీపనగండ్ల , బెక్కం రోడ్డు బిటి రోడ్డు నిర్మాణానికి రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రభుత్వం ద్వారా నిధులు మంజూరు చేయించినట్లు నాగర్‌కర్నూల్ జిల్లా పర్యాటక శాఖ అధికారి కల్వరాల నర్సింహ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడుగోదల బీరయ్య, మండల రైతు బంధు సమితి మాజీ అధ్యక్షుడు ఎత్తం కృష్ణయ్య, వనపర్తి జిల్లా ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షులు ఇంద్రకంటి వెంకటేష్ , కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎస్. రవీందర్ రెడ్డి, గోపి, మహేష్ నాయుడు తెలిపారు. వీపనగండ్ల, బెక్కం రోడ్డు బిటిరోడ్డు నిర్మాణానికి సిఆర్ఆర్ నిధుల ద్వారా మూడు కోట్ల 90 లక్షల రూపాయలు, సిడిఎఫ్ నిధుల నుండి కల్వరాలలోని కొత్తగుట్ట ఆంజనేయస్వామి గుడి నిర్మాణానికి మొదటి పేస్ గా 25 లక్షల రూపాయలు, సంగినేనిపల్లిలో శఅరీరామాలయం గుడి నిర్మాణానికి మొదటి పేస్ గా 25 లక్షల రూపాయలు మంత్రి జూపల్లి కృష్ణారావు మంజూరు చేయించినట్లు వారు తెలిపారు. వీపనగండ్ల .. బెక్కం బిటిరోడ్డు నిర్మాణం వల్ల చిన్నం బాయి మండలంలోని వెలగొండ, బెక్కం మియాపురం, గడ్డ బసాపురం గ్రామాలకు వెళ్లడానికి దూరం తగ్గుతుందని గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. సంగినేని పల్లి , కల్వరాలలో దేవాలయాల నిర్మాణానికి నిధులు మంజూరు పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

## పివి నరసింహారావు సేవలు అపూర్వం



ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి : మాజీప్రధాని, భారతరత్న పివి నర్సింహ్మారావు జయంతిని పురస్కరించుకొని ఆయన సేవలను స్మరించుకుంటూ హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌దగ్గర ఉన్న పివిఘాట్‌దగ్గర గాంధీభవన్‌లో పివి నర్సింహ్మారావు చిత్రపటానికి టిపిసిసి క్రమశిక్షణ కమిటిచైర్మన్ నాగర్‌కర్నూల్ ఎంపి మల్లురవి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ విప్లవాత్మక సంస్కరణలకు ఆద్యుడు పివి నర్సింహ్మారావు అని కొనియాడారు.

## అక్రమ ఒండ్రు మట్టిపై సీరియస్



ప్రజాపక్షం/ధన్వాడ: ధన్వాడ మండల కేంద్రంలో ధన్వాడ పెద్ద చెరువు నుండి అక్రమంగా తరలిస్తున్న వండు మట్టి తరలింపుపై మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి తిప్పలను అడ్డుకుని సంబంధిత అధికారులతో మాట్లాడి ఒండుమట్టి ఎవరు అనుమతి ఇచ్చారని ఎన్ని టిప్పర్లకు అనుమతి ఇచ్చారని మాజీ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అధికారులకు అడిగి తెలుసుకున్నారు. ఎంత లోతు వెడల్పు తీస్తున్నారు. ఎవరు పడితే వాళ్లు నల్ల మట్టి తరలించడం సరికాదు అసలు ఒండుమట్టి రైతు పొలాల కొట్టాలని తెలిపారు. చేసేది లేక అధికారులు ఒండు మట్టిని తరలింపును అపివేశారు.

## ప్రజాస్వామ్యాన్ని హత్య చేశారు..

ప్రజాపక్షం/జడ్చర్ల: జడ్చర్లలో ఎమర్జెన్సీకి నేటికి 50 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా ప్రభుత్వ కళాశాలలో కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాలమూరు మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రాములు మాట్లాడారు. ఆనాటి కాంగ్రెస్ పార్టీ భారతదేశం ప్రజాస్వామ్య దేశంగా పరిగణమిల్లుతున్న సమయంలో ప్రజాస్వామ్యాన్ని హత్య చేసి, అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని పక్కన పెట్టి సర్వ అధికారాలు తమ చేతిలోకి తీసుకుని, నియంతృత్వంలో దేశాన్ని పాలించాలని ఒక కుట్రతో ఇందిర గాంధీ ఎమర్జెన్సీ విధించడం మనందరికి తెలిసిందే. ముఖ్య అతిథులుగా భారతీయ జనతా పార్టీ మహబూబ్‌నగర్ ఎక్స్ చైర్మన్ రాములు జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు సాహితి రెడ్డి, యువ మోర్చా టౌన్ అధ్యక్షుడు పిట్టల నరేష్, మండల అధ్యక్షుడు బి.వెంకటేష్, మహేశ్ యాదవ్ కుమార్, సామాలా నరసింహులు, బాలవర్ధన్, నడిమింటి శ్రీను, జగదీష్, పవన్, రాణ ప్రసాద్ పాల్గొన్నారు.

# ప్రైవేటు పాఠశాలల దోపిడీపై చర్యలేవీ?

### ఎఐఎస్ఎఫ్ , ఎఐవైఎఫ్ నిరసన



ప్రజాపక్షం /వనపర్తి టౌన్ : ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థుల దోపిడిని ఆపాలని ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో వనపర్తి పట్టణంలోని రెండు ప్రైవేట్ పాఠశాల వద్ద నిరసన తెలిపారు. ఢిల్లీ వరల్డ్ స్కూల్ , శ్రీ చైతన్య స్కూల్ ఎదుట బైఠాయించి దోపిడీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నరేష్, ఏఐవైఎఫ్‌జిల్లా అధ్యక్షుడు ఎత్తం మహేష్ మాట్లాడుతూ 1వ తరగతికి రూ.30వేల నుంచి 50వేలు వసూలు చేస్తున్నారన్నారు. చట్ట విరుద్ధంగా పాఠ్య పుస్తకాలను,టైబెల్టు,బూట్లు పేరుతో అధికంగా డబ్బులు దండుకుంటున్నారన్నారు. అనుమతి లేకుండా కొన్ని స్కూల్ బస్సులను నడుపుతున్నారని , పలు బస్సుల్లో కెపాసిటికి మించి విద్యార్తులను కుక్కుకొని, బస్సులను అతివేగంగా నడుపుతున్నారని ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. కార్పొరేట్ ప్రైవేట్ పాఠశాలల్లో విద్య హక్కు చట్టం ప్రకారం 25 శాతం విద్యను పేద పిల్లలకు ఉచితంగా అందించాలని కాని ఏ స్కూల్ లోనూ అమలు చేయడం లేదని, అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఢిల్లీ వరల్డ్ స్కూల్ పేరుతో వరల్డ్ అనే పదాన్ని తొలగించాలన్నారు. పాఠశాల పేర్లు వరల్డ్ నేషనల్ అనే పదాలు పెట్టటం విద్య హక్కు చట్టానికి విరుద్ధమన్నారు. వరల్డ్ పదం తొలగించాలన్నారు. జిల్లా కేంద్రంలో డిఈఓ ఉన్నతాధికారులు ఉన్న ప్రైవేట్ పాఠశాలల దోపిడిపై చర్య తీసుకోవడం లేదన్నారు. తమ డిమాండ్లను యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్తామని పాఠశాలల బ్యాలు చెప్పారని నేతలు తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించకుంటే విద్యార్థులను సమీకరించి కలెక్టర్ ఆఫీస్ వద్ద పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు చందు, విష్ను, అరవింద్, చరన్, విజయ్, లక్ష్మ మ్మ, భరత్, రాజేష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ కార్యాలయంలో పివి జయంతి




ప్రజాపక్షం/మహబూబ్ నగర్ ప్రతినిధి: జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు జయంతి నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, డీసీసీ మీడియా సెల్ కన్వీనర్ సీజే బెనహర్ మాట్లాడుతూ దేశంలో ఆర్థిక సంస్కరణలకు శ్రీకారం చుట్టిన ఘనత మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు దక్కిందన్నారు.బ్లాక్ ప్రెసిడెంట్ సుధాకర్‌రెడ్డి, నాయకులు గోవిందు యాదవ్, సురేందర్, వెంకటేశ్ యాదవ్, బాలస్వామి, బాలయ్య, సత్యనారాయణ, రామచంద్రయ్య, బాలయ్య, అంతయ్య తదితరులు పాల్గొన్నారు.

## పనిచేసే చోట వేధిస్తే చర్యలు



ప్రజాపక్షం/నారాయణపేట : పనిచేసే చోట మహిళలను వేధిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని షీటీమ్ పోలీసులు బాలరాజు తెలిపారు. జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఉత్తర్వుల మేరకు నారాయణపేట జిల్లా సింగారం శివారులోని సర్వే ట్రైనర్స్ కి మహిళ పై జరిగే నేరాలపై, ఉద్యోగరీత్యా వారు పనిచేస్తున్న దగ్గర మహిళలను, అమ్మాయిలను, విద్యార్థులను ఎవరైనా వేధింపులకు గురి చేసిన, లైంగిక వేధించిన, మానసికంగా, శారీరకంగా వేధించిన సోషల్ మీడియా ద్వారా ఫోటోలను మార్ఫింగ్ చేసి వేధించిన, వాట్సప్, ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్‌లో అసభ్యకరంగా ప్రవర్తించిన అట్టి వ్యక్తుల సమాచారం షీటీమ్ పోలీసులకు సెల్ 8712670398 కి సమాచారం ఇవ్వాలని షీటీమ్ పోలీసులు బాలరాజు తెలిపారు.షిటీమ్ పోలీసులు బాలరాజు, చెన్నయ్య, జ్యోతి, కవిత, భరోసా టీమ్ రాధిక పాల్గొన్నారు.

## కల్యాణమండపానికి నిధులు

ప్రజాపక్షం/జడ్చర్ల: జడ్చర్ల మండలంలోని వాయిల గడ్డ తండాలోని దుర్గామాత దేవాలయంలో కల్యాణ మండపం నిర్మాణానికి శనివారం దేవాదాయ శాఖ సిజిఎఫ్ నిధుల ద్వారా 50 లక్షల రూపాయల నిధులు మంజూరు చేశారని జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి తెలిపారు. నిధులు మంజూరు చేసిన దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# మీడియాపై దాడి కేసు నిందితులను శిక్షించాలి

ప్రజాపక్షం / పెబ్బేరు : తెలంగాణ రాష్ట్రంలో ఫోన్ ట్యాపింగ్ కేసు విషయంలో వరుస వార్తా కథనాలు వెల్లడించారనే అక్కసుతో బీఆర్ఎస్ శ్రేణులు మహా న్యూస్ కార్యాలయంపై దాడి చేసి ధ్వంసం చేయడం హేయమైన చర్య అని ప్రెస్ క్లబ్ అధ్యక్షులు బాలవర్ధన్ , ప్రెస్ క్లబ్ సభ్యులు ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. వార్తా కథనాలపై అభ్యంతరాలు ఉంటే ప్రజాస్వామ్యయుతంగా స్పందించాలని, భౌతిక దాడులకు పాల్పడటం సరికాదని పేర్కొన్నారు. తమపై వచ్చిన ఆరోపణలను మీడియా ముఖంగా ఖండించడం లేదంటే న్యాయస్థానాలను ఆశ్రయించడం వంటి చర్యలు తీసుకోవాలన్నారు. పత్రికా స్వేచ్ఛను హరిస్తూ ఏ రాజకీయ పార్టీ అయినా, మిగతా ఎవరైనా సరే మీడియా మీద దాడి చేయడం ప్రజాస్వామ్యాన్ని ఖూని చేయడం లాంటిదని విమర్శించారు. మహా న్యూస్ కార్యాలయంపై దాడి చేసి ఫర్నిచర్‌ను ధ్వంసం చేసిన నిందితులను గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకొని రాష్ట్రంలో ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని ఈ సందర్భంగా పెబ్బేరు ప్రెస్ క్లబ్ అధ్యక్షులు జి. బాలవర్ధన్, సభ్యులు డిమాండ్ చేశారు.

## తిమ్మయ్యకు గౌరవ డాక్టరేట్



ప్రజాపక్షం/కృష్ణ/మక్తల్: విద్య, సామాజిక సేవా రంగాల్లో అంకిత భావంతో అందిస్తున్న సేవలకుగాను కృష్ణ మండలం ముడుమాల్ గ్రామానికి చెందిన బి.తిమ్మయ్యకు గౌరవ డాక్టరేట్లు లభించింది. సమాజ సేవ పట్ల వారి నిబద్ధత మానవతా విలువల పట్ల ఉన్న విధేయతకు తమిళనాడుకు చెందిన గ్లోబల్ హ్యూమన్ పీస్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ వారు గౌరవ డాక్టరేట్లు అందించారు. బీటీఎం ఫౌండేషన్ స్థాపించి వ్యవస్థాపకులుగా అనేక సమాజ సేవ కార్యక్రమాలను నిర్వహించారు. దాదాపు కొన్ని సంవత్సరాలు అందించిన సేవలను పరిగణలోకి తీసుకున్న యూనివర్సిటీ వర్గాలు ఆయనకు డాక్టరేట్ అందించారు. బీటీఎం ఫౌండేషన్ స్థాపించి వ్యవస్థాపకులుగా అనేక సమాజ సేవ కార్యక్రమాలను నిర్వహించారు. బి.తిమ్మయ్య నాయకత్వంలో అనేక మంది నిరాశ్రయులకు వెనుకబడిన వర్గాలకు, సామాజికంగా వెనుకబడిన కుటుంబాలకు అండగా నిలుస్తూ సేవను ధర్మంగా భావిస్తూ నిత్యం ప్రజలతో కలిసి ముందుకు సాగుతోంది. తమిళనాడులో శనివారం జరిగిన యూనివర్సిటీ స్నాతకోత్సవంలో యూనివర్సిటీ అధికారుల చేతుల మీదుగా ఆయన డాక్టరేట్‌ను అందుకున్నారు. డాక్టరేట్లు అందుకున్న ఆయనను మండలంలోని పలువురు నాయకులు, గ్రామస్తులు సేవాభిమానులు అభినందించారు.

## సమాజ సేవలో శ్రీమంతుడు బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి



ప్రజాపక్షం/నర్వ: సమాజ సేవలో శ్రీమంతుడు బంగ్లా లక్ష్మికాంత్‌రెడ్డికి డాక్టరేట్ బిరుదుతో సత్కరించిన గ్లోబల్ హ్యూ మన్ పీస్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ. బంగ్లాలక్ష్మికాంత్‌రెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి మాట్లాడుతూ విద్య, వైద్యం, ఆరోగ్యం, త్రాగునీరు, గ్రామాల మధ్య రోడ్ల మరమ్మత్తు , విద్యుత్, ద్వీపాలు, మొదలైన వాటి విషయంలో నా వంతు సహాయ సహకారాలు అందించినందుకు గాను గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ యాజమాన్యం వారు డాక్టరేట్ బిరుదును ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తూ భవిష్యత్తులో నా చేతనైనంత సహాయ సహకారాలు సమాజానికి అందిస్తానని తెలియజేశారు. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డా.వెంకటేషన్ మాట్లాడుతూ సామాజిక సేవను లక్ష్యంగా చేసుకుని, తన స్వంత డబ్బుని వెచ్చించి సమాజంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న నిరుపేద విద్యార్థులకు విద్యా వాలాంటీర్లను అందించడం విమానయానం చేయించడం, వసతులు కల్పించడం, గ్రామాలలో బోర్లు వేయించితాగునీరు ఇవ్వడం, రైతుల కోరిక మేరకు వ్యవసాయ పొలాలకు మట్టిని కొట్టించడం మొదలైన వాటిలో నిరుపేదలకు నేనున్నానంటూ ఆపన్నహస్తం ఇచ్చి అండగా నిలిచిన బంగ్లా లక్ష్మి కాంత్‌రెడ్డి తమ సేవా పయనానికి గౌరవం లభించే అద్భుతమైన ఘట్టానికి చేరుకున్నారన్నారు.

# ఖాతాలలో ‘రైతు భరోసా’ జమ కాలేదు!



ప్రజాపక్షం /పాన్‌గల్ : ప్రభుత్వం పెట్టుబడుల సహయం కోసం అందించే రైతు భరోసా డబ్బు లు ఖాతాలలో జమ కాలేదని మండలంలోని పలువురు రైతులు శనివారం పాన్‌గల్ మండల కేంద్రంలో రైతు వేదిక వద్ద నిరసన వ్యక్తం చేశారు. కొంత మంది రైతులకు రైతు భరోసా డబ్బులు ఖాతాల్లో జమ అయ్యాయని మరికొంత మందికి తమకున్న విస్తీర్ణానికంటే తక్కువ డబ్బులు జమ అయ్యాయని, మరి కొంత మంది రైతులకు అసలు రైతు భరోసా డబ్బులే ఖాతాలలో జమ కాలేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి రోజు రైతు వేదికల వద్దకు వెళ్లాల్సి వస్తుందని తమ ఫిర్యాదులను వ్యవసాయ అధికారులు స్వీకరిస్తున్నప్పటికి ఎలాంటి హామీ మాత్రం ఇవ్వడం లేదన్నారు. రైతు భరోసా డబ్బులు పడకపోవడానికి ఎవరి తప్పిదమొ తెలియక రైతులు అయోమయ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు కార్యదర్శి బాల్యనాయక్ , సిపిఎం మండల నాయకులు , మాజీ ఎంపీటీసీ వేణు మాట్లాడుతూ ఒక ఎకర, రెండు మూడు ఎకరాలు నుండి మొదలుకొని చాలా మంది రైతులకు రైతు భరోసా డబ్బులు ఖాతాలలో జమ కాలేదన్నారు. కొంత మంది రైతులకు నాలుగు ఎకరాలు ఉన్న రైతులకు 10 కుంటలకు మాత్రమే రైతు భరోసా డబ్బులు ఖాతాలలో జమ అ య్యాయని, మిగతా ఎకరాలకు డబ్బులు పడలేదన్నారు. మండలంలో చాలా మంది రైతులు రెండు ఎకరాలు , నాలుగు ఎకరాలు, 5 ఎకరాలు లోపు ఉన్న రైతులకు నూటికి 30 శాతం మందికి రైతు భరోసా పథకంకు సంబంధించిన డబ్బులు ఖాతాలో జమకాలేదని అన్నారు. ప్రతి రైతుకు రైతు భరోసా డబ్బులు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులు పాల్గొన్నారు.



# స్థానికం

REGIONAL NEWS

నల్లగొండ, సూర్యాపేట యాదాద్రి, గద్వాల

## ఎసిబికి చిక్కిన ధరణి ఆపరేటర్ విజేతరెడ్డి



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** హుజూర్‌నగర్ తహసిల్దార్ కార్యాలయంలో శనివారం అవినీతి నిరోధక శాఖ అధికారులు దాడులు చేశారు. అవినీతి నిరోధక శాఖ డిఎస్‌పి జగదీష్ చందర్ మాట్లాడుతూ హుజూర్‌నగర్ మండలం కరక్కాయలగూడెం గ్రామానికి చెందిన తోట రాంబాబు అనే రైతు పొలం రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకున్న అనంతరం తన వ్యవసాయ భూమికి సంబంధించిన రిజిస్ట్రేషన్ ప్రొసిడెంట్ పేపర్స్ కోసం కార్యాలయానికి వెళ్లగా అక్కడ పనిచేస్తున్న భూభారతి ఆపరేటర్ విజేతరెడ్డి రూ.20వేలు లంచం అడగ్గ, రైతు రూ.12వేలకు ఒప్పందం చేసుకున్నారు. సదరు వ్యక్తి ఏసిబి అధికారులను ఆశ్రయించడంతో ఏసిబి అధికారులు హుజూర్‌నగర్ తహసిల్దార్ కార్యాలయంలో మెరుపు దాడులు నిర్వహించడం జరిగింది. రైతు తోట రాంబాబు నుండి లంచం తీసుకుంటున్న భూభారతి ఆపరేటర్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకోవడం జరిగిందని తెలిపారు.



## పేద ప్రజల సంక్షేమమే ధ్యేయం

### ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్

**ప్రజా పక్షం/నల్లగొండ టౌన్ :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పలు అభివృద్ధి సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని డిసిసి అధ్యక్షుడు,ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ అన్నారు. శనివారం పట్టణంలోని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో జరిగిన నల్లగొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నిటిని అమలు చేస్తూ ముందుకు పోతుందని అన్నారు. బ్లాక్ కాంగ్రెస్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుల నియామకం కోసం దరఖాస్తులను స్వీకరించి సామాజిక న్యాయం పాటించి ఎంపిక చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్,కనగల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గడ్డం అనుప రెడ్డి,మాజీ జెడ్పిటిసి నర్సింగ్ శ్రీనివాస్ గౌడ్, డిసిసిబి డైరెక్టర్ పాశం సంపత్ రెడ్డి,ప్రాంతీయ రవాణా శాఖ డైరెక్టర్ కూసుకుంట్ల రాజిరెడ్డి పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం

### అదనపు కలెక్టర్ పి.రాంబాబు



**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** విద్యార్థులకి నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబు తెలిపారు. శనివారం సూర్యాపేట పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ స్టాక్ రూమ్‌లో ఉన్న బియ్యం, అలాగే స్టాక్ రిజిస్టర్ వివరాలు పరిశీలించారు. తదుపరి సూర్యాపేట పట్టణంలోని తాళ్లగడ్డలో ఉన్న టిజిఎస్‌డబ్ల్యూ ఆర్ ఈఐఎస్‌లో నిర్వహిస్తున్న హెల్త్ క్యాంపును సందర్శించారు. విద్యార్థుల హెల్త్ చెకప్ జాగ్రత్తగా చేయాలని సూచించారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో భాగంగా వండిన అన్నం నాణ్యత అలాగే స్టాక్ వివరాలు, కూరగాయలను పరిశీలించారు. ప్రధానోపాధ్యాయులు నాగమణి, టిజిఎస్ డబ్ల్యూఆర్ఈఐఎస్ ప్రిన్సిపాల్ విద్యాసాగర్, ఉపాధ్యాయులు యాదయ్య, వెంకటేశ్వర్లు, ఆర్ఐ శ్రీధర్, జడ్పిహెచ్ఎస్ జూనియర్ అసిస్టెంట్లు సోమలక్ష్మి , పాతిమా, సుల్తాన పాల్గొన్నారు.

## దరఖాస్తులను పరిష్కరించాలి



**ప్రజాపక్షం/యాదాద్రి :** భూభారతి రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి డిస్పోజల్ చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి అన్నారు. శనివారం భువనగిరి రెవిన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో భూభారతి సదస్సులో వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ భూభారతి రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి తగు సూచనలు సలహాలు తెలియజేశారు. వచ్చిన ప్రతి దరఖాస్తును భూ భారతిలో నమోదు చేయాలన్నారు. ప్రతి దరఖాస్తుకు నోటీసు జారీ చేసి విచారణ చేసిన అనంతరం భూ సమస్య దరఖాస్తులు పెండింగ్ లేకుండా వెంటనే పరిష్కరించి ఫైల్ ఎప్పటికపుడు డిస్పోజ్ చేయాలన్నారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలిస్తూ, భూ సంబంధిత సమస్యలు మార్పులు, చేర్పులు పాత రికార్డుల ఆధారంగానే పరిష్కరించాలని సూచించారు. ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ డివిజనల్ అధికారి కృష్ణా రెడ్డి, సంబంధిత అధికారులు, సిబ్బంది ఉన్నారు.

## అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు



**ప్రజాపక్షం/మోటకొండూర్ :** అర్హులందరికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరి చేయాలని, సిపిఐ శ్రేణులకు ప్రత్యేక కోటా కేటాయించి నిర్మాణానికి సహకరించాలని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యను యాదాద్రి భువనగిరి జిల్లా సిపిఐ సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ ఆధ్వర్యంలో సిపిఐ శ్రేణులు కోరారు. శనివారం యాదగిరిగుట్ట నివాసంలో కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య మాట్లాడుతూ అర్హులైన పేదలందరికి అంచెలంచెలుగా ఇందిరమ్మ ఇండ్లు నిర్మించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో కలిసి పని చేసి అధిక స్థానాలు గెలిపించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మోటకొండూర్ మండల కార్యదర్శి గాదెగాని మానిక్యం సిపిఐ కార్యవర్గ సభ్యులు బీరకాయల మల్లేష్, పల్లే వెంకన్న, నల్ల రాములు, నాయకులు బోలగాని అశోక్, మారబోయిన ఇమ్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ వడ్డీ వ్యాపారస్తుల పట్ల జాగ్రత్త

**ప్రజాపక్షం /నల్లగొండ టౌన్ :** జిల్లాలో రైతులను, అమాయక ప్రజలను టార్గెట్ చేసుకొని కొందరు మోసగాళ్లు షేర్ మార్కెట్లు, రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడులు అంటూ అధిక వడ్డీ ఇస్తామని ఆశ చూపి డబ్బులు వసూలు చేసి మోసాలకు పాల్పడుతున్నారని అలాంటి వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక వడ్డీ ఆశకు పోతే అసలుకే ఎసరు అవుతుందని జిల్లాలో ఎవరైనా అమాయక ప్రజలను, రైతులను అధిక వడ్డీ ఇస్తామని మభ్యపెట్టీ వారి వద్ద నుండి డబ్బులు వసూలు చేసి మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో కొంత మంది ప్రజలు ఇండ్ల భూములు, వ్యవసాయ భూములు, బ్యాంకులో బంగారం తాకట్టు పెట్టి డబ్బులు తీసుకొచ్చి మరి అక్రమ వ్యాపారాలకు అధిక వడ్డీ ఆశకు డబ్బులు ఇస్తున్నారని వారు మొదటగా కొంత మొత్తంలో ఇస్తూ ఆశ చూపించి పెద్ద మొత్తంలో డబ్బులు ఇవ్వగానే మోసాలకు గురి చేస్తారని అలాంటి వాటి పట్ల జాగ్రత్తగా ఉండాలని అన్నారు. ఎవరైనా ఫైనాన్స్ వ్యాపారాలు ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడితే కఠినమైన చర్యలు తీసుకుంటూ కేసులు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు.

# చట్టం రైతు చుట్టం కావాలనే సంకల్పంతో సాగు న్యాయయాత్ర

### వ్యవసాయ రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి

### 2400 కి.మీ యాత్రలో 800 గ్రామాలు పర్యటన 10వేల మంది రైతులను కలుస్తాం



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** చట్టం రైతు చుట్టం కావాలనే సంకల్పంతో సాగు న్యాయయాత్ర చేస్తున్నట్లు, రైతన్నలు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా భూభారతి చట్టం అమలు జరుగుతున్నట్లు భూ యజమానులు రైతులకు చట్టం పట్ల పూర్తి అవగాహన కల్పించేందుకు నడుం బిగించి యాత్ర చేస్తున్నట్లు వ్యవసాయ రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి స్పష్టం చేశారు. పోచంపల్లి పట్టణ కేంద్రంలో టూరిజం పార్కులో ఆయన భూభారతి రూపకర్త వ్యవసాయ రైతు కమిషన్ సభ్యులు భూమి సునీల్ తో కలిసి సాగు న్యాయ యాత్ర పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టూరిజం పార్కులోని భూదానోద్యమ పితామహుడు వినోబా భావే ప్రథమ భూదాత వెదిరే రామచంద్రారెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి ఆయన ఘనంగా నివాళులు అర్పించి వినోబా మందిరంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ భూమి సునీల్ మాట్లాడుతూ వ్యవసాయం, రైతుల భూ సమస్యలు పరిష్కరించాల్సిన బాధ్యత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలదని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలో కాంగ్రెస్ అధికారం చేపట్టిన వెంటనే భూభారతి సృష్టికర్త భూమి సునీల్ అత్యంత ప్రతిష్టాత్మకంగా బృహత్తర ప్రణాళికతో రూపొందించిన భారతిని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకు వెళ్లి ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని ఉద్దేశంతో యాత్ర చేపడుతున్నట్లు ఆయన పునరుద్ఘాటించారు.అక్టోబర్ నెల 2వ తేదీ వరకు సాగనున్న సాగు న్యాయ యాత్ర పేరిట భూమీ సునీల్ సారథ్యంలో లీఫ్ సంస్థ ఆధ్వర్యంలో రైతులకు ఉన్న చట్టాలు ఉపయోగించుకునే విధానాలను రైతులకు అవగాహన కల్పించేందుకు ప్రతి ఒక్కరి సహకారం కావాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న అతి కీలక నిర్ణయాల్లో భూభారతి చట్టం ఒకటని చెప్పారు. గత ప్రభుత్వంలో ధరణి పేరుతో తీసుకువచ్చిన చట్టం పూర్తిగా లోప బహిష్టంగా ఉందని రైతులే కాకుండా భూమి కలిగిన ప్రతి ఒక్కరూ ఎన్నో ఇబ్బందులకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. 2400 కి మీ యాత్రలో 800 గ్రామాలు తిరిగి 10వేల మంది రైతులను కలిసి భూభారత్ చట్టాల వివరాలను వివరించి అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ చైర్మన్, వ్యవసాయ రైతు కమిషన్ సభ్యులు కేవీయన్ రెడ్డి లీఫ్ సంస్థ సభ్యులు అభిలాష్ రెడ్డి, జీవన్ రెడ్డి, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు మర్రి నర్సింహారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కాక మల్లేష్ యాదవ్, మాజీ డిసిసి ఉపాధ్యక్షులు సామ మధుసూదన్ రెడ్డి, పిఎసిఎస్ వైస్ చైర్మన్ సామ మోహన్ రెడ్డి, సీనియర్ నాయకులు గోరంటి శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి తోట శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

**వ్యవసాయ చట్టాలపై అవగాహన సాగు న్యాయయాత్ర**

**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** రైతులకు వ్యవసాయ చట్టాలపై అవగాహన కల్పించడం కొరకే సాగు న్యాయాయాత్రను శనివారం భూదాన్ పోచంపల్లి లిఫ్స్ సంస్థ ఆధ్వర్యంలో ప్రారంభించామని అందులో భాగంగా తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, రైతుల సంక్షేమ చైర్మన్ ఎం.కోదండరాం, భూమి సునీల్‌తో చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీలో ఏర్పాటు చేసిన భూమికి సాగు కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం వారు రైతులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో స్థానిక మండల వ్యవసాయ అధికారి ముత్యాలు, భువనగిరి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు వెంకటేశ్వర్లు,మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

**భూ సమస్యల పరిష్కారానికి రైతులకు చట్టాలపై అవగాహన ఉండాలి**

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** భూమిసాగు యాత్రలో భాగంగా తెలంగాణ వ్యవసాయ రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి, భూమి సునీల్‌తో కలిసి తహసిల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన భూమి సాగుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి వ్యవసాయ చట్టాలపై రైతులకు అవగాహన కల్పించేందుకు ఈ యాత్ర ఉద్దేశమని రైతు కమిషన్ సభ్యుడు భూమి సునీల్ తెలిపారు. సంస్థాన్ నారాయణపురంలోని 255 సర్వే నెంబర్లలో గత ప్రభుత్వం తమకు అసైన్డ్ పట్టాలను ఇచ్చారని ఎన్నో సంవత్సరాలుగా సాగు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నామని తెలిపారు. ఇటీవల గ్రూపును ఉద్యోగం సాధించిన వ్యవసాయ శాఖ అధికారి వర్షిత్ రెడ్డిని వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో రైతు కమిషన్ సభ్యులు సెక్రెటరీ గోవింద్, ఓఎస్‌డి శ్రీహరి పాల్గొన్నారు.

# 2.784 కిలోల గంజాయిపట్టివేత

### నలుగురు అరెస్టు : కోదాడ డిఎస్‌పి శ్రీధర్‌రెడ్డి వెల్లడి



**ప్రజాపక్షం/కోదాడరూరల్:** చింతలపాలెం మండలంలోని దొండపాడు గ్రామంలో పోలీసులు తనిఖీ చేసి 2.784 కిలోల గంజాయిని పోలీసులు స్వాదీనం చేసుకుని, నలుగురి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలను శనివారం కోదాడ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో డిఎస్‌పి శ్రీధర్‌రెడ్డి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దీనికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. చింతలపాలెం మండలంలోని గాంధీనగర్‌తండా ముడావత్ అశోక్, అదే మండలంలోని దొండపాడు గ్రామానికి చెందిన కొత్తపల్లి నాగార్జున, నంబూరి రత్నాకర్‌రెడ్డి, వేముల నాగరాజు, కేతావరపు సాయి లు అనే ఐదుగురు స్నేహితులు గత మూడు సంవత్సరాలుగా గంజాయికి బానిసలయ్యారు. వీరు తాగడంతో పాటు అక్రమంగా అధిక డబ్బులు సంపాదించాలనే ఉద్దేశ్యంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అల్లూరి సీతరామరాజు జిల్లా సీలేరు గ్రామానికి ఈ నెల 21వ తేదీన వెళ్లి గుర్తు తెలియని వ్యక్తి నుండి ఐదు కిలోల గంజాయిని, కిలో రూ.2500 చొప్పున వీరు కొనుగోలు చేశారు. ఇందులో ముడావత్ అశోక్ అలియాస్ భుక్య అశోక్ మూడు కేజీల గంజాయి, కేతావరపు సాయి రెండు కేజీలు కొనుగోలు చేశారు. ఈనెల 23వ తేదీని దొండపాడు గ్రామానికి వచ్చి వారు కొనుగోలు చేసిన గంజాయిని బొడ్డు బసవయ్య కాలనీలో ఉన్న మధిర లక్ష్మారెడ్డికి చెందిన ఇంటిఖాళీ స్థలంలో గాబు కింద దాచారు. తిరిగి వీరు ఉదయం అక్కడకు చేరుకుని పంచుకున్నారు. అదే సమయంలో స్పెషల్ టాస్క్‌పోర్సు, కోదాడ రూరల్ సిఐ రజితారెడ్డి , ఎస్ఐ సందీప్‌రెడ్డి లు తమ సిబ్బందితో వెళ్లి ముడావత్ అశోక్, కొత్తపల్లి నాగార్జున, నంబూరి రత్నాకర్ రెడ్డి, వేముల నాగరాజు లను అదుపులోకి తీసుకున్నారు. వారి నుండి 2.784 కిలోల గంజాయిని స్వాదీనం చేసుకున్నారు. దీని విలువ రూ.69600 ఉటుందని చెప్పారు. మరో నేరస్తుడు కేతావరపు సాయి రెండు కిలోల గంజాయితో పోలీసులకు దొరకకుండా పరారైనట్లు తెలిపారు. గంజాయితో పాటు స్కూటి, నాలుగు సెల్‌ఫోన్లను సీజ్ చేశారు. అనంతరం కేసు నమోదు చేసి వారిని కోర్టుకు రిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రూరల్ సిఐ రజితారెడ్డి, ఎస్ఐ సందీప్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ లింగరాజు, కానిస్టేబుల్ ఐనా భాస్కర్, అమృతయ్య, శ్రీకాంత్ పాల్గొన్నారు.



## ప్రభుత్వ పాఠశాలను ప్రభుత్వ విప్ ఆకస్మిక తనిఖీ

### మధ్యాహ్న భోజన ప్రక్రియ సరిగ్గా లేదని ఇన్‌చార్జిపై మండిపాటు

**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** యాదగిరిగుట్ట పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు శనివారం మధ్యాహ్నం రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే అయిలయ్య ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాటశాలల్లో తనిఖీ చేస్తు, విద్యార్థులతో మాట్లాడుతున్న క్రమంలో తమకు వడ్డించే భోజనంలో కూరలు మంచిగా వండటం లేదని ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే ఎమ్మెల్యే వంట మనుషులను, ఇంచార్జ్‌ను మందలించి విద్యార్థుల బోజనాల్లో నాణ్యతలు పాటించాలని మందలించారు. మధ్యాహ్న భోజనం ఇంచార్జి ఎవరు అని అడుగగా అక్కడకి వచ్చిన టీచర్‌ను బీర్ల అయిలయ్య కూరలు సరిగా లేవని మండిపడ్డ క్రమంలో, ఆ టీచర్ వినూత్నమైన రీతిలో, వేలు చుపుతూ ఎమ్మెల్యే కు నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చి, ఆ టీచర్ దురుసుగా మాట్లాడిందని మండిపడ్డారు. దురుసుగా మాట్లాడిన టీచర్ పై ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఉన్నతాధికారులు దృష్టికి తీసుకొని వెళ్లి చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం క్లాస్ రూమ్ లో విద్యార్థులతో మాట్లాడి టీచర్లు రెగ్యులర్‌గా వస్తున్నారా, చదువు ఎలా చెపుతున్నారో అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో పలు సమస్యలు ఉన్నాయని విద్యార్థులు ఉపాధ్యాయులు తెలుపగా, సొంత నిధులతో వాటి మరమ్మతులు చేయించాలని స్థానిక నాయకులకు సూచించారు.

## సూర్యాపేటలో సుపారి గ్యాంగ్ హల్చల్

### పట్టుకుని పోలీసులకు సమాచారం చేరవేత

### అదుపులోకి తీసుకుని విచారణ

### ఒకరిని హత్య చేసేందుకు స్కెచ్ వేసినట్లు బహిర్గతం




**ప్రజాపక్షం/సూర్యాపేట:** సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఓ సుపారి గ్యాంగ్ శుక్రవారం రాత్రి కారులో హల్చల్ చేసింది. మద్యాన్ని పీకలదాక సేవించి కారులో హల్చల్ చేస్తుండగా స్థానికులు వారిని పట్టుకుని పోలీసులకు సమాచారం చేరవేశారు. కారులో ఉన్న ఐదుగురి వ్యక్తులను అదుపులోకి తీసుకున్న పోలీసులు కారును తనిఖీ చేయడంతో కర్రలు, ఖాళీ బీరుసీసాలు దొరికాయి. అనంతరం విచారించగా మోతె మండలం రాఘవపురం గ్రామానికి చెందిన పచ్చూరి వెంకటేశ్వర్లు పట్టణంలోని ఎక్స్‌రోడ్డు వద్ద ఉన్న మహేంద్ర ట్రాక్టర్ షోరూమ్‌లో పనిచేస్తున్నాడు. నల్లగొండకు చెందిన వంగాల కిరణ్ గౌడ్ ఆ గ్రామంలో క్రషర్‌మిల్లు ఉంది. దాని పక్కనే వెంకటేశ్వర్లుకు మూడు ఎకరాల భూమి ఉండగా, దీని విషయంలో గత కొన్ని రోజులుగా వివాదం జరుగుతుంది. ఈ క్రమంలోనే వెంకటేశ్వర్లును హత్య చేసేందుకు నార్కట్‌పల్లి మండలంలోని యల్లారెడ్డిగూడెం గ్రామానికి చెందిన మేడి శివప్రసాద్, బొడ్డుపల్లి స్వామి, బరిగెల శివశంకర్ అలియాస్ శివాజీ, మాదగిని రమేష్, చంద్ లకు లక్ష రూపాయలు ఇచ్చి సుపారి కుదర్చుకున్నాడు. ఈ క్రమంలోనే వారు కారులో సూర్యాపేటకు వచ్చినట్లు పోలీస్ విచారణలో తేలింది. ఇదే విషయాన్ని శనివారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇన్స్‌పెక్టర్ రాజశేఖర్ వెల్లడించారు. విచారణ అనంతరం వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు రిమాండ్ చేశారు. ఈ కేసును త్వరితగతిన చేధించిన పట్టణ ఎస్ఐ లు సైదులు, ఎం.ఆంజనేయులు లను అభినందించారు.

## బ్లూకోట్స్, కోర్టు డ్యూటీ విధులపై సిబ్బందికి శిక్షణ : ఎస్‌పి

**ప్రజాపక్షం/సూర్యాపేట:** ప్రజా ఫిర్యాదులపై, సంఘటనలపై త్వరితగతిన స్పందించి బాధితులకు, ప్రజలకు వేగవంతమైన సేవలు అందించడం ద్వారా పోలీస్‌శాఖపై మరింత నమ్మకం పెరుగుతుందని, సిబ్బంది పారదర్శకంగా పనిచేస్తూ జవాబుదారితనంగా ఉండాలని, అధికారులు ప్రజల నమ్మకాన్ని నిలబెట్టాలని జిల్లా ఎస్‌పి కె.నర్సింహా అన్నారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్‌స్టేషన్ బ్లూకోట్స్ సిబ్బందికి, కోర్టు విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి ఒక్కరోజు శిక్షణ లో ఆయన పాల్గొని మాట్లాడారు. పోలీస్ పని విభాగాల నిర్వహణ, పనిలో సామర్థ్యం పెంపొందించడంలో భాగంగా సిబ్బందికి నిరంతర శిక్షణ ఇవ్వడం జరుగుతుందని అన్నారు. డయల్ 100 సమాచారాన్ని నేరుగా చేరవేయడం జరుగుతుందని, వెంటనే సంబంధిత బ్లూకోట్స్ సిబ్బంది త్వరితగతిన సంఘటన స్థలానికి చేరుకుని, పరిస్థితిని అదుపులోకి తీసుకోవడం, అక్కడి పరిస్థితులను అధికారులకు చేరవేయడం చేయాలని అన్నారు. ఫిర్యాదుల నిర్వహణలో పారదర్శకంగా ఉండాలని, సమాచారాన్ని అనవసరంగా ఇతర వ్యక్తులకు ఎవ్వవద్దు అని అదేశించారు. సమస్యలు ఉంటే ఉన్నతాధికారులకు దృష్టికి తేవాలని కోరారు. ఈ శిక్షణ కార్యక్రమంలో సిసిఎస్ ఇన్స్‌పెక్టర్ శివకుమార్, బిసిఆర్‌బి ఇన్స్‌పెక్టర్ హరిబాబు, ఐటికోర్ ఆర్ఎస్ఐ రాజశేఖర్, టెక్నికల్ సిబ్బంది, బ్లూకోట్స్, కోర్టు డ్యూటి సిబ్బంది పాల్గొన్నారు.

## చౌటుప్పల్ మున్సిపాలిటీ అభివృద్ధిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్

### మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి



**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** చౌటుప్పల్ పట్టణంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పన జరగాలని మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి అన్నారు. శనివారం మునుగోడులోని క్యాంపు కార్యాలయంలో చౌటుప్పల్ మున్సిపాలిటీని అభివృద్ధి చేసుకోవడానికి అవసరమయ్యే మాస్టర్ ప్లాన్ పై హైదరాబాద్‌కు చెందిన సీనియర్ మాస్టర్ ప్లాన్ కన్సల్టెంట్ సుభాని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులకు సంబంధించిన స్టేటస్‌ను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిస్టం, వాన నీటి కాలువలు, మురుగు నీరు శుద్ధి చేసే ప్లాంట్లు, పార్కుల అభివృద్ధి, ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్ నాన్ వెజ్ మార్కెట్, నూతన మున్సిపల్ పరిపాలన భవనము, షాపింగ్ కాంప్లెక్స్‌లో నిర్మాణాల అభివృద్ధి తో పాటు సమగ్ర అభివృద్ధి పై ఫోకస్ పెట్టారు. వర్షాకాలంలో లక్కారం చెరువు నుండి వచ్చే వర్షపు వరద నీటి మళ్లింపు ఎటువైపు చేపట్టాలనే అంశంపై స్థానిక నాయకులు పలు సూచనలు చేశారు. 2011 జనాభా లెక్కల ప్రకారం నిర్ణయించిన తాగునీటి కేటాయింపుల ప్రకారం మాత్రమే ఇప్పటికీ తాగునీరు వస్తుందని, కానీ ఇటీవల గుణాత్మకంగా జనాభా పెరగడంతో ఆ త్రాగునీరు సరిపోవడంలేదని ఎమ్మెల్యే దృష్టికి స్థానిక నాయకులు తీసుకొచ్చారు. ప్రస్తుతం లక్ష జనాభా నివసిస్తున్న చౌటుప్పల్ పట్టణానికి, అదేవిధంగా మరో 30 సంవత్సరాల భవిష్యత్తుకు సరిపడే విధంగా త్రాగునీరు అందించడానికి శివన్న గూడెం రిజర్వాయర్ నుండి నీటిని తీసుకురావడానికి డిపిఆర్ సిద్ధం చేస్తున్నామని రాజ్ గోపాల్ రెడ్డి తెలిపారు. . ఈ సమీక్ష సమావేశంలో చౌటుప్పల్ మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, ఉమ్మడి నల్గొండ జిల్లా పబ్లిక్ హెల్త్ ఎస్ఈ వెంకటేశ్వరరావు, డిఈ మనోరమ, చౌటుప్పల్ మున్సిపాలిటీ లోని అన్ని వార్డుల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## పెండింగ్ కేసుల పరిష్కారానికి జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ సమన్వయ కమిటీ సమావేశం

**ప్రజాపక్షం/యాదాద్రి :** జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ, యాదాద్రి భువనగిరి అధ్యక్షులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.జయరాజు జిల్లా స్థాయి కోఆర్డినేషన్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి పి.ముక్తిదా, కార్యదర్శి, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ వి.మాధవిలత, ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి యం.ఉషశ్రీ, అదనపు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీసు లక్ష్మి నారాయణ, చౌటుప్పల్ ఎసిపి మధుసూదన్ రెడ్డి, యాదగిరిగుట్ట, ఎసిపి శ్రీనివాస్ నాయుడు పాల్గొన్నారు. ఈ సమావేశంలో కోర్టులో పెండింగులో ఉన్న క్రిమినల్ కేసుల పరిష్కారం, నాన్ బెయిలబుల్ వారంట్ల తామీలు మొదలగు అంశాలపై చర్చించి తగిన సూచనలు చేశారు. తదుపరి భువనగిరిలోని సబ్ జైలును న్యాయమూర్తులు సందర్శించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.జయరాజు ఖైదీలతో ముఖాముఖి జరిపి న్యాయ సహాయంపై వారిని విచారించి, ఎవరికైనా న్యాయ సహాయం కావాల్సిన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించి మాధక ద్రవ్య నిషేధ చట్టం క్రింద ఉన్న ముద్దాయిలను ఉద్దేశిస్తూ మాధక ద్రవ్యాలకు బానిసలుగా కావటం, వ్యాపారం చేయటం నేరమని, ఇట్టి నేరాలకు పాల్పడినవరు చట్టం నుండి తప్పించుకోలేరని తెలియచేసి, జైలులో వారికి కల్పిస్తున్న వసతులు, జైలులో ఏర్పాటుచేసిన ప్రిసన్ లీగల్ ఎయిడ్ క్లినిక్ పనితీరును సమీక్షంచారు.

## బాలల పరిరక్షణ క్షేమమే ఆశయం

**ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల ప్రతినిధి:** జోగులాంబ గద్వాల జిల్లా మనోపాడు మండలం అన్ని గ్రామాలలో నివసించే బాల బాలికలను మహిళ శిశు సంక్షేమ శాఖ వారి జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యం నుండి జిల్లా బాలల సంరక్షణ లీగల్ అధికారి ఎత్తం శివ మాట్లాడుతూ బాల బాలికలు చిన్న వయసు నుండి లక్ష్యం పెట్టుకొని చదవాలని సూచించారు. ఆడపిల్లల పై సోదరాబావం తో ఉండాలని తెలిపారు. బాలల లైంగిక వేధింపుల నిరోధక చట్టం 2012 గురించి తెలియజేస్తూ లైంగిక వేధింపుల నుంచి రక్షణ కల్పించేందుకు ఈ చట్టం రూపొందించారని, ఈ చట్టంలో బాల బాలికలకు సమానమైన రక్షణ లభిస్తుంది. సమస్య లైంగిక వేధింపులు, కుటుంబ సభ్యులు, ఇతర వ్యక్తుల చేతుల్లో బాలలు లైంగిక వేధింపులకు గురవుతున్నారు. కాబట్టి ఎవరైనా మట్టుకన్నప్పుడు ఏది సురక్షితం ఎది ఆసురక్షతం అనే విషయం తెలుసుకోవాలి. బాలల ఎవరి నుంటైనా ఇలాంటి వేధింపులకు గురవుతున్నట్లు తెలిస్తే వెంటనే 100 లేదా 1098 కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలి వారి పై చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. అదేవిధంగా చిన్న వయసులోనే పెళ్లిలు చేయడం చట్ట రీత్యా నేరం అని చెప్పారు. అయితే ఇలా బాల్య వివాహం చేస్తున్నట్లు తెలిస్తే గ్రామంలో ఉండే బాలల పరిరక్షణ కమిటీ కి లేదా 1098 కి ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు.

# రీల్

## ప్రేక్షకులకు రుణపడి ఉంటా.. మోహన్ బాబు




కన్నప్ప సినిమాను ఇంతపెద్ద హిట్ చేసిన ప్రేక్షకులకు, నా అభిమానులకు రుణపడి ఉంటానని డాక్టర్ మోహన్ బాబు అన్నారు. ఇటీవల విడుదలైన కన్నప్ప సినిమా సక్సెస్ మీట్ హైదరాబాద్‌లో శనివారం జరిగింది. ఈ సందర్భంగా మోహన్ బాబు మాట్లాడుతూ భగవంతుణ్ణి లీలావల్లే ఇదంతా జరిగిందని అన్నారు. ఇదంతా యాభై ఏళ్లుగా తనను అభిమానిస్తున్న ఫ్యాన్స్ కు ధన్యవాదాలు అని చెప్పారు. హీరోగా, విలన్ గా ఇలా అన్ని పాత్రల్లో నన్ను ఆదరిస్తున్న ప్రేక్షకులకు ధన్యవాదాలు అని తెలిపారు. ఇదంతా నా పూర్వ జన్మ సుకృతం అని మోహన్ బాబు వ్యాఖ్యానించారు. ఈ సినిమాలో నటించిన, ఈ సినిమా పూర్తి కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు అని మోహన్ బాబు అన్నారు. హీరో విష్ణు మాట్లాడుతూ ఈ సినిమాను ఆదరిస్తున్న ప్రేక్షక దేవుళ్ళకు ధన్యవాదాలు అని చెప్పారు.
ఇదంతా శివలీలగానే భావిస్తున్నాను అని అన్నారు. కన్నప్పకు ఇంత పెద్ద విజయాన్ని అందించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు అని విష్ణు చెప్పారు. ఈ సక్సెస్ మీట్‌లో దర్శకుడు ముఖేష్ కుమార్ సింగ్, శివ బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.



## 3బిహెచ్‌కె ట్రైలర్ ఆవిష్కరణ

హీరో సిద్ధార్థ్ కెరీర్‌లో 40వ చిత్రం '3బిహెచ్‌కె'. శ్రీ గణేష్ దర్శకత్వం వహించారు. ప్రముఖ నటుడు శరత్ కుమార్ కీలక పాత్ర పోషిస్తుండగా, దేవయాని, యోగి బాబు, మీతా రఘునాథ్, చైత్ర ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. శాంతి టాకీస్ బ్యానర్‌పై అరుణ్ విశ్వ నిర్మించిన ఈ చిత్రం థియేట్రికల్ ట్రైలర్ విడుదలైంది.ఇల్లు సొంతం చేసుకోవాలనే జీవితకాల కల కలిగిన మధ్యతరగతి కుటుంబ భావోద్వేగ ప్రయాణంలో ఈ ట్రైలర్ మనసుని హత్తుకుంది. జీవితంలో వైఫల్యాలు, నిరాశలను ఎదుర్కొన్న తండ్రి, కుటుంబం ఆకాంక్షలను నెరవేర్చడానికి తన కొడుకుపై తన ఆశలు పెట్టుకుంటునాడు.. అయితే, చదువు పరంగా కష్టపడుతూ, అనేక ప్రయత్నాలు చేసినప్పటికీ 34 సంవత్సరాల వయస్సులో కూడా ఉద్యోగం లేకుండా ఉన్న కొడుకు భావోద్వేగ ప్రయాణం చాలా ఎమోషనల్‌గా వుంది. ఆ కుటుంబం కల చివరకు సాకారం అవుతుందా లేదా అనేది ఈ సినిమా కథ. ఇల్లు కొనడం అనేది మధ్యతరగతి కుటుంబాల కల. ఈ కథ అందరికీ కనెక్ట్ అయ్యేలా వుంది. దర్శకుడు శ్రీ గణేష్ భావోద్వేగపరంగా హృదయాన్ని తాకే కథనంతో రోపొందించారని హీరో సిద్ధార్థ్ అన్నారు. సినిమాటోగ్రాఫర్లు దినేష్ కృష్ణన్ బి, జితిన్ స్టానిస్లాస్ విజువల్స్ మధ్యతరగతి జీవితాన్ని అందంగా చూపించాయి. ప్రతి ఫ్రేమ్ నేచురల్ గా వుంది అని ఆయన అన్నారు. అమృత్ రామ్‌నాథ్ నేపథ్య సంగీతం ఎమోషన్‌ని మరింత పెంచుతుంది. గణేష్ శివ రాసిన స్క్రీన్ ప్లే, రాకేందు మౌళి సంభాషణలు అద్భుతంగా వున్నాయి. వినోద్ రాజ్ కుమార్ ఎన్ ఆర్ట్ డైరెక్టర్. ఆర్. సిబి మారప్పన్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. అన్ని పనులు పూర్తి చేసి జూలై 4న విడుదల చేయనున్నారు.



## ఎనిమిది భాషల్లో నాని సినిమా

దసరా సినిమాతో సూపర్ దూపర్ హిట్ ఇచ్చిన శ్రీకాంత్ ఓదేలా దర్శకత్వంలో నాని రెండో సినిమా చేస్తున్నాడు. ఈ సినిమాను ఏకంగా ఎనిమిది భాషల్లో తెరకెక్కిస్తున్నారు. జూన్ 21 నుంచి ఈ సినిమాప్రారంభించారు. అయితే శనివారం నుంచి ఈ సినిమా షూటింగ్‌లో నాని పాల్గొంటున్నారు. తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ, బెంగాలీ, ఇంగ్లీష్, స్పానిష్ భాషల్లో నిర్మిస్తున్నారు. అనిరుధ్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాకు ఎస్ ఎల్ వి సి బ్యానర్ పై నిర్మిస్తున్న ఈ చిత్రానికి నవీన్ నూలి ఎడిటర్‌గా పని చేస్తున్నారు.

## 'జూనియర్' టీజర్ రిలీజ్



ప్రముఖ రాజకీయ నాయకుడు, వ్యాపారవేత్త గాలి జనార్ధన్ రెడ్డి కుమారుడు కిరీటి రెడ్డి హీరోగా పరిచయం అవుతున్నారు. , రాధా కృష్ణ దర్శకత్వం వహించిన యూత్ ఎంటర్‌టైనర్ 'జూనియర్' అనే సినిమాతో హీరోగా అరంగేట్రం చేస్తున్నాడు. వారాహి చలన చిత్రం బ్యానర్‌పై రజని కొర్రపాటి నిర్మించిన ఈ చిత్రం టీజర్‌ను రిలీజ్ చేశారు. కిరీటి ఒక కాలేజీ కుర్రాడిగా నటిస్తున్నాడు. ఎదుటి వారిని ఆకర్షించే వ్యక్తిత్వం వున్న తను హీరోయిన్ శ్రీలీలాను ఇష్టపతాడు, మొదట గొడవతో మొదలైన జర్నీ మెల్లాగా ఎట్రాక్టివ్ కెమిస్ట్రీగా మారుతుంది. టీజర్‌లో కిరీటి చెప్పిన డైలాగులు అదిరిపోయాయి. అందరినీ అలరించేలా వున్నాయి. హీరోయిన్‌గా శ్రీలీల కూల్‌గా కనిపించింది. టీజర్ చివరిలో బాస్ పాత్రతో జెనీలియా డిసౌజా కనిపించడం మరింత ఆసక్తికరంగా వుంది. వైవా హర్ష పాత్ర కామెడీగా సాగుతుంది. కె.కె. సెంథిల్ కుమార్ సినిమాటోగ్రఫీ అందించిన ఈ సినిమాకు దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందించారు. ఈ చిత్రానికి రవీందర్ ప్రొడక్షన్ డిజైన్, పీటర్ హెయిన్ హైఆక్టేన్ యాక్షన్ కొరియోగ్రఫీ, నిరంజన్ దేవరమనే ఎడిటర్. కళ్యాణ్ చక్రవర్తి త్రిపురనేని రాసిన డైలాగ్స్ రాశారు. జూనియర్ సినిమాను తెలుగు, కన్నడ, తమిళం, హిందీ, మలయాళ భాషలలో జూలై 18న విడుదల చేయనున్నారు.

## నేడు 'సింధూర సంజీవని' రక్తదాన శిబిరం




జెట్టి సినిమాతో హీరోగా సుపరిచితులైన కృష్ణ మానినేని పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారు. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అభిమానిగా విజయవాడ వరదల సమయంలో హీరో కృష్ణ చేసిన సేవా కార్యక్రమాలు ప్రశంసలు అందుకున్నాయి. అటువంటి కృష్ణ జూన్ 14 ఇంటర్నేషనల్ బ్లడ్ డొనేషన్ డేను పురస్కరించుకొని 'సింధూర సంజీవని' పేరిట ప్రతి ఏటా జూన్‌లో తన ఫ్రెండ్స్ తో బ్లడ్ డొనేషన్ చేయడానికి సంకల్పించారు. ఆ క్రమంలో భాగంగా ఆదివారం చిరంజీవి బ్లడ్ బ్యాంకులో మెగా బ్లడ్ డొనేషన్ క్యాంప్ నిర్వహించనున్నారు. తనతోపాటు మరో పదిమంది యువత బ్లడ్ డొనేషన్ క్యాంప్‌లో పాల్గొనాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.



## 'మిరపకాయ్' ట్రైలర్ విడుదల

మాస్ మహారాజ రవితేజ మళ్లీ తన అభిమానులకు ఎంటర్‌టైన్ చేయడానికి రెడీ అయ్యాడు. రవితేజ హీరోగా ఎల్లో ఫ్లవర్స్ బ్యానర్ పై నిర్మాత రమేష్ పుప్పాల నిర్మించిన చిత్రం 'మిరపకాయ్'. 2011 సంక్రాంతికి విడుదలై మ్యూజికల్ బ్లాక్ బస్టర్‌గా నిలిచిన ఈ మూవీ గురించి అందరికీ తెలిసిందే. ఈ సినిమాను దర్శకుడు హరీష్ శంకర్ తెరకెక్కించారు. ఈ రిలీజ్ చేస్తున్న సందర్భంగా ట్రైలర్ ను విడుదల చేశారు ఈ సినిమాను రీరిలీజ్ చేసేందుకు చిత్ర యూనిట్ రెడీ అవుతోంది. జులై 11న 'మిరపకాయ్' చిత్రాన్ని రీరిలీజ్ చేస్తున్నారు. హనుమాన్ మీడియా ఈ సినిమాను రీ రిలీజ్ చేస్తున్నారు, ఈ సినిమాలో అందాల భామ రిచా గంగోపాధ్యాయ్, దీక్షా సేత్ హీరోయిన్లుగా నటించారు.థమన్ ఈ సినిమాకు సంగీతాన్ని అందించారు.

## ఐకానిక్ సినిమాటోగ్రాఫర్ 'అవార్డు' అందుకున్న కిషోర్ బొయిదాపు



ప్రముఖ హీరోయిన్ హన్సిక మోత్వాని నటించిన '105 మినిట్స్' చిత్రానికిగాను సినిమాటోగ్రఫీ విభాగంలో 'ఇంటర్నేషనల్ ఐకానిక్ అవార్డ్ కెమెరామెన్ కిషోర్ బొయిదాపం ఆదుకున్నారు. సింగిల్ క్యారక్టర్‌తో.. సింగిల్ షాట్‌లో తెరకెక్కించడం '105 మినిట్స్' సినిమా ప్రత్యేకత. హైద్రాబాద్ లో లీమెరిడియన్ హోటల్‌లో జరిగిన వేడుకలో కిషోర్ ఈ ప్రతిష్టాత్మక పురస్కారం అందుకున్నారు. రవిప్రసాద్ యూనిట్‌లో కెమెరా అసిస్టెంట్ గా తన కెరీర్ ప్రారంభించిన కిషోర్... అనతికాలంలోనే అంచెలంచెలుగా కెమెరామెన్ స్థాయిని సాధించారు. 'స్లమ్ డాగ్ మిలియనీర్, మిషన్ ఇంపాజిబుల్4, లెటర్స్, సూటబుల్ బాయ్స్' వంటి హాలీవుడ్ ప్రోజెక్టులకు సెకెండ్ యూనిట్ కెమెరామెన్‌గా తన ప్రతిభ కనబరిచిన కిశోర్ ప్రఖ్యాత సినిమాటోగ్రఫర్ అనిల్ మెహతా ప్రియ శిష్యుడిగా... 'సీక్రెట్ సూపర్ స్టార్, ఏ దిల్ హై ముష్కిల్, బియాండ్ ది క్లౌడ్స్, హిందీ జెర్సీ' వంటి పలు చిత్రాలకు పనిచేశారు.
'బోయ్ మీట్స్ గర్ల్'తో కెమెరామెన్‌గా మారిన కిషోర్ సునీల్ నటిస్తున్న 'ఆన్ ది వే', ఆది సాయికుమార్ 'రుధిరాక్ష', బిగ్ బాస్ ఫేమ్ షణ్ముఖ, శివాజీ, భూమిక నటిస్తున్న ఇంకా పేరు పెట్టని చిత్రాలు షూటింగ్ దశలో ఉన్నాయి.
ముంబై నుంచి హైదరాబాద్ కు షిఫ్ట్ అయిపోయిన కిషోర్ తన ఫోకస్ ఇంకా తెలుగు సినిమాలపై మాత్రమేనని తెలిపారు.

## శ్రీలీలకు యంగ్ ఇండియన్ అవార్డు



తెలుగు సినిమాలో అతి తక్కువ సమయంలో స్టార్ హీరోలతో సినిమాలు చేస్తూ నెంబర్ వన్ స్థానానికి ఎదిగిన శ్రీలీల మోస్ట్ ఇన్ ఫ్లూయేన్షల్ యంగ్ ఇండియన్ 2025 అవార్డు ను హీరోయిన్ శ్రీలీల అందుకున్నారు ప్రముఖ బాలీవుడ్ నటుడు అమీర్ ఖాన్ చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నారు. వైద్య విద్యను అభ్యసించిన శ్రీలీల డ్యాన్సింగ్‌లో యువతను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈమె టాలెంట్ ను గుర్తించిన జీ క్యూ మోస్ట్ ఇన్ ఫ్లూయేన్షల్ యంగ్ ఇండియన్ అవార్డు ను శ్రీలీలకు అందించారు.

## 'పవర్' షూటింగ్ షురూ



టాలీవుడ్ స్క్రీన్ పైకి యంగ్ అండ్ డైనమిక్ హీరో రాబోతున్నాడు. సాయికృష్ణ హీరోగా, దర్శకుడు వెంకటరమణ పసుపులేటి రూపొందిస్తున్న సినిమా 'పవర్'. 'నాది పొగరు కాదురా... నా జాతికి ఈ దేవుడు ఇచ్చిన పవర్...' అనే పవర్‌ఫుల్ డైలాగ్‌తో సాయి కృష్ణ హీరోగా సినీ ఎంట్రీ ఇచ్చారు. మంగళగిరి పరిధిలోని ఆత్మకూరులో వంగవీటి రంగా విగ్రహం వద్ద ముహూర్తం షాట్‌తో చిత్రీకరణ ప్రారంభమైంది. ఈ చిత్రంలో అరుణ్ విజయ్, సుజన, భాగ్యశ్రీ, ప్రజ్ఞ, ప్రియతో పాటు సీనియర్ నటీనటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. హీరోగా ఈ చిత్రం టాలీవుడ్‌లో కొత్త ఒరవడిని సృష్టిస్తుందని చిత్ర దర్శకుడు వెంకటరమణ పసుపులేటి అన్నారు.

## ఎస్ఐబి మాజీ డిఎస్‌పి ప్రణీత్ ఫోన్‌లో కీలక ఆడియో

### ఎమ్మెల్సీ కవిత పిఎకు 'సిట్' నోటీసులు జారీ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర సంచలనం రేపుతున్న ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణలో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో భాగంగా బిఆర్ఎస్ ఎంఎల్‌సి కవిత వ్యక్తిగత సహాయకుడు (పిఎ)కి ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) తాజాగా నోటీసులు జారీ చేసింది. కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ ( ఎస్ఐబి) మాజీ డిఎస్‌పి ప్రణీత్ రావు ఫోన్‌లో కవిత పిఎకు సంబంధించిన కొన్ని ఆడియో రికార్డింగులను అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో పూర్తి వివరాలు రాబట్టేందుకు సిట్ ఆయనను విచారణకు పిలిచింది. ఫోన్ ట్యాపింగ్ కేసుపై దర్యాప్తును ముమ్మరం చేసిన సిట్ అధికారులు, ఇప్పటివరకు మొత్తం 618 మంది ఫోన్లను ట్యాప్ చేసినట్లు తేల్చారు. వీరిలో ఇప్పటికే 228 మంది బాధితుల వాంగ్మూలాలను నమోదు చేశారు. పలువురు విఐపిల నుంచి కూడా కీలక సమాచారం సేకరించినట్లు తెలిసింది. ప్రణీత్ రావును విచారించినప్పుడు లభించిన ఆధారాల మేరకు దర్యాప్తు పరిధిని మరింత విస్తరిస్తున్నారు. ఈ క్రమంలోనే ఎమ్మెల్సీ కవిత పీఏతో పాటు మరికొందరు బిఆర్ఎస్ నేతలకు సైతం సిట్ అధికారులు నోటీసులు పంపినట్లు సమాచారం. ఈ పరిణామంతో బిఆర్ఎస్ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. సిట్ విచారణలో ఇంకా ఎవరెవరి పేర్లు బయటకు వస్తాయోనని రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ జరుగుతోంది.

## ప్లాంట్ల ఏర్పాట్ల సన్నాహాలను 'సింగరేణి' వేగవంతం

### డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క



**ప్రజాపక్షం / హైదరాబాద్:** సింగరేణి సంస్థ చేపట్టనున్న 800 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్లు, 500 మెగావాట్ల పవన విద్యుత్తు ప్లాంట్, 500 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ పవర్ ప్లాంట్ ఏర్పాట్ల సన్నాహాలను మరింత వేగవంతం చేయాలని, కాల పరిమితిని విధించుకొని సత్వరమే ప్రాజెక్టులను చేపట్టాలని ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు ఆదేశించారు. మహాత్మా జ్యోతి రావ్ పూలే ప్రజాభవన్‌లో శనివారం సింగరేణి కాలరీస్ తన వ్యాపార విస్తరణ చర్యల్లో భాగంగా చేపట్టనున్న సోలార్ ప్లాంట్లు, పంప్డ్ స్టోరేజీ ప్లాంట్, ఇతర పునరుత్పాదక విద్యుత్తు ప్లాంట్లపై ఆయన ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం మాట్లాడుతూ సింగరేణి సంస్థ లోయర్ మానేరు డ్యామ్ రిజర్వాయర్‌పై నిర్మించనున్న 300 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్, మల్లన్న సాగర్‌పై నిర్మించతలపెట్టిన 500 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్లకు ఇరిగేషన్ శాఖ ద్వారా రావాల్సిన అనుమతులకు లేఖలు రాయాలని ఆదేశాలు ఇచ్చారు. అనుమతుల కోసం నిత్యం సంబంధిత విభాగాలతో సంప్రదింపులు జరపాలని సూచించారు. సింగరేణి సంస్థ రాష్ట్రంలోని ఐదు జిల్లాలలో ఏర్పాటు చేయ తలపెట్టిన 500 మెగావాట్ల పవన విద్యుత్తు ప్లాంట్లకు సంబంధించిన డిపిఆర్‌లను వచ్చే నెలాఖరుకల్లా పూర్తి చేయాలన్నారు. రామగుండం1 ఏరియాలో మేడిపల్లి ఓపెన్ కాస్ట్ నీటి సంపు ఆధారంగా నిర్మించ తలపెట్టిన 500 మెగావాట్ల పంపుడ్ స్టోరేజ్ పవర్ ప్లాంట్ నిర్మాణం పనులు తక్షణమే చేపట్టాలని ఆదేశించారు. అలాగే రాజస్థాన్ రాష్ట్ర విద్యుత్ ఉత్పాదన్ నిగం లిమిటెడ్‌తో కుదుర్చుకున్న ఒప్పందం మేరకు 1500 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్‌ను ఆ రాష్ట్రంలోని సోలార్ వ్యాలీలో త్వరితగతిన ఏర్పాటు చేయాలన్నారు. ఈ ఒప్పందంలో భాగంగా ఏర్పాటు చేసే 800 మెగావాట్ల థర్మల్ ప్రాజెక్టు ఏర్పాటుపైనా కూలంకశంగా చర్చించారు. రాజస్థాన్ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లేందుకు వీలుగా ఈ అంశాన్ని వీలైనంత త్వరగా మంత్రివర్గంలో ప్రవేశపెట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్, తెలంగాణ రెడ్‌కో వైస్ చైర్ పర్సన్, ఎండి అనీలా, సింగరేణి ఈడి(కోల్ మూమెంట్) ఎస్‌డిఎం సుభాని, ఈడి (ఎస్‌టిపిపి) చిరంజీవులు, జిఎంలు జానకీరామ్, శ్రీనివాసులు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## హరీష్‌రావుకు ధైర్యముంటే ఉద్యోగాల భర్తీపై బహిరంగ చర్చకు రావాలి

### కాంగ్రెస్ ఎమ్మెల్సీ డాక్టర్ బల్మూరు వెంకట్ సవాల్



**ప్రజాపక్షం / హైదరాబాద్:** మాజీ మంత్రి హరీష్‌రావుకు ధైర్యముంటే ఉద్యోగాల భర్తీ విషయంలో బహిరంగ చర్చకు రావాలని కాంగ్రెస్ ఎంఎల్‌సి డాక్టర్ బల్మూరు వెంకట్ సవాల్ చేశారు. కెసిఆర్, అప్పటి మంత్రులు చెబుతున్నట్లు బిఆర్ఎస్ ప్రభుత్వ హయంలో 1.60 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తే ఆ వివరాలు ఎందుకు మీడియాకు వెల్లడించడంలేదని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిన 18 నెలల కాలంలోనే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం భర్తీ చేసిన ఉద్యోగాలపై తాము చర్చకు సిద్ధమన్నారు. గాంధీభవన్‌లో శనివారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాలని చెప్పిన బిఆర్ఎస్ పదేళ్ల కాలంలో కనీసం 2లక్షల ఉద్యోగాలు కూడా భర్తీ చేయలేదన్నారు. జాబ్స్ నోటిఫికేషన్స్ వేసి... పరీక్షలు పెట్టలేక భర్తీ చేయకుండా వదిలేసిన చరిత్ర బిఆర్ఎస్ పాలకులదన్నారు. గత 18 నెలల కాలంలోనే ప్రజా ప్రభుత్వం 58,868 వేలకు పైగా ఉద్యోగాలు భర్తీ చేసి వారికి నియామక పత్రాలు అందజేశామన్నారు. నోటిఫికేషన్స్ వారీగా నియామల విషయంలో అనుమానాలు ఉంటే ఎవరైనా పరిశీలించుకోవచ్చన్నారు. ఏ ఉద్యోగ నియామకాల కోసమైతే నిరుద్యోగులు పోరాటం చేశారో వారినే మోసం చేసిన నీచమైన చరిత్ర మాజీ సిఎం కెసిఆర్‌దని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇంటికో ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చి అనంతరం గెలిచిన తర్వాత అసెంబ్లీలో ప్రతిపక్షంగా కాంగ్రెస్ నేతలు నిరుద్యోగుల పక్షాన ప్రశ్నిస్తే కెసిఆర్ ఎగతాళి చేసిన మాట నిరుద్యోగులు మరచిపోలేదన్నారు. మోసపోయామని తెలిసి స్వయంగా బిఆర్ఎస్ పార్టీ నేతల పేర్లు రాసి నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకుంటే అప్పటి సిఎం కెసిఆర్ కనీసం స్పందించలేదన్నారు.

## దిగుమతులపై ఆంక్షలు

(మొదటి పేజీ తరువాయి)

చెప్పాయి. భూతలం నుండి, సముద్రతలం నుండి బంగ్లాదేశ్ నుండి జరుగుతున్న దిగుమతులకు ఈ ఆంక్షలు వర్తిస్తాయి. ఐతే మహారాష్ట్రలోని ఓడరేవు ఎన్‌హావా షెవాకు మాత్రం దీన్నుండి మినహాయింపు ఉంది. శుక్రవారం ప్రభుత్వం ఈ చర్యలు ప్రకటించింది. ప్రధానమంత్రి షేక్ హసీనా పదవీచ్యుతురాలైన తర్వాత నుండీ బంగ్లాదేశ్–భారత్ మధ్య సంబంధాలు బాగా క్షీణించాయి. గడ ఏడాది ఆగస్టులో ప్రభుత్వ పతనం తర్వాత షేక్ హసీనా భారత్‌కు వచ్చి ఆశ్రయం పొందారు. అప్పటినుండీ భారతదేశంపై బంగ్లాదేశ్ తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేస్తోంది. ఐతే బంగ్లాదేశ్‌లో సరఫరాదారులు అనుసరిస్తున్న అన్యాయపూరితమైన పద్ధతులవల్ల భారతదేశంలో రైతుల జీవన పరిస్థితులకు ఎట్టి పరిస్థితుల్లోనూ హాని కలగడాన్ని ఒప్పుకోబోమని పేరు చెప్పడానికి ఇష్టపడని అధికారి ఒకరు చెప్పారు. ఎంతో సద్భావంతో భారతదేశ మార్కెట్‌ను బంగ్లాదేశ్ ప్రజలకు అందుబాటులోకి తెస్తే భారత ఆర్థిక ప్రయోజనాలకు ద్రోహం చేసేవిధంగా ఈ వ్యాపారాన్ని నష్టపరచి కించపరచే ఆచరణ చర్యలకు పాల్పడితే అందుకు దేశం సిద్ధంగా లేదని మరో అధికారి చెప్పారు. ఓడరేవుల ద్వారా భూమార్గంలో వచ్చే రెడీమేడ్ గార్మెంట్స్, ఇతర వినియోగ వస్తువులపై ఆంక్షలు విధించిన కొన్ని వారాల తర్వాత కేంద్ర ప్రభుత్వం బంగ్లాదేశ్ జనపనార, సంబంధిత ఫైబర్ ఉత్పత్తుల దిగుమతులపై ఈ ఆంక్షలు విధించింది. సఫ్తా (దక్షిణాసియా స్వేచ్ఛావాణిజ్య ప్రాంతం) నిబంధనల కింద బంగ్లాదేశ్ నుండి ఎలాంటి సుంకాలు చెల్లించకుండానే భారత్‌కు బంగ్లాదేశ్ జనపనార వస్తోంది. దీనివల్ల ఆ దేశం ఎంతో లాభపడుతోంది. సబ్సిడీపై జనపనార ఉత్పత్తులు వస్తూ ఉండటంతో దేశంలో రైతులకు నష్టం కలుగుతోంది. బంగ్లాదేశ్ ప్రభుత్వం ఇస్తున్న రాయతీల ఆధారంగా అదేపనిగా భారత్‌కు ఆ దేశం నుండి జనపనార వస్తోంది. వాళ్ళ రైతులు బాగు పడుతున్నారు.
దీంతో డిజిఎడి (యాంటీ డంపింగ్, అనుబంధ సుంకాల డైరెక్టరేట్ జనరల్ సవివరంగా దర్యాప్తు చేశారు. కానీ ఎడిడి (యాంటీ డంపింగ్ డ్యూటీ)ని మాత్రం దిగుమతులపై విధించడం వీలు కాలేదు. ఎగుమతులకు సంబంధించి బంగ్లాదేశ్‌లో అనేక అక్రమాలు జరుగుతూ ఉండటం సాధారణంగా మారిపోయిందని అధికారులు చెబుతున్నారు. అందువల్ల దేశీయ జనపనార పరిశ్రమలను రక్షించుకోవడానికి అన్యాయపూరితమైన విధానాలను అడ్డుకుని ఈ రంగంలో భారత్‌ను ఆత్మనిర్భర్ భారత్ కార్యక్రమం కింద స్వయంసమృద్ధి సాధించవలసి ఉందని అధికారులు పేర్కొన్నారు.

## పునాదులు వేసిన పివి

(మొదటి పేజీ తరువాయి)

అని కొనియాడారు. రాష్ట్రంలో మంత్రిగా, ముఖ్యమంత్రిగా, కేంద్ర మంత్రిగా, ప్రధానిగా ఆయన తీసుకువచ్చిన అనేక సంస్కరణలు సమాజానికి గొప్ప మేలు చేశాయని తెలిపారు. పివి ప్రధాన మంత్రిగా బాధ్యతలు చేపట్టే నాటికి దేశం ఆర్థిక, రాజకీయ సంక్షోభంలో ఉందని, ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని ఆయన ఈ దేశ ఆర్థిక, రాజకీయ వ్యవస్థలను గాడిలో పెట్టిన మహానీయుడన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర మాట్లాడుతూ భారత ప్రధానిగా చిన్న భిన్నమైన ఆర్థిక వ్యవస్థను ఎన్నో ఆర్థిక సంస్కరణలు తెచ్చి దేశాన్ని అన్ని రంగాల్లో ముందుంచిన మహోన్నతమైన వ్యక్తి మన తెలంగాణ ముద్దుబిడ్డ పివి నరసింహారావు అని కొనియాడారు. ఆర్థిక మేధావి, గల్లి నుంచి ఢిల్లీ పీఠానికి ఎదిగిన రాజకీయ ఎవరెస్టు శిఖరం తెలంగాణ ముద్దు బిడ్డ పివి నరసింహారావు అని మంత్రి కొండా సురేఖ అన్నారు.మాజీ ప్రధాని పివి నరసింహారావు తీసుకున్న నిర్ణయాలు ఎప్పటికీస్ఫూర్తి దాయకం ఆమె పేర్కొన్నారు.బహుముఖ ప్రజ్ఞాశాలి, దేశ రాజకీయాలలో విలక్షణ ముద్ర వేసిన అపర మేధావి మాజీ ప్రధాని పీవీ నరసింహారావు అని మంత్రి వివేక్ కొనియాడారు. భారతజాతి గర్వించదగ్గ మహోన్నతమైన వ్యక్తి మాజీ ప్రధాని పివి నరసింహారావు అని జిల్లా కలెక్టర్ హరి చందన దాసరి అన్నారు.

## కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

సాగిస్తుంటారు రైల్వే స్టేషన్‌లో త్రాగునీరు లేక పోగా మల మూత్ర విసర్జనల కోసం ప్రయాణికుల ఇబ్బందులు వర్ణాతీతంగా ఉన్న అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరించడం పలు విమర్శలకు తావిస్తోంది. పెద్దపల్లి రైల్వే స్టేషన్లో జరుగుతున్న అభివృద్ధి పనులలో రైల్వే అధికారుల నిఘ కొరవడంతో కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా నాణ్యత ప్రమాణాలు పాటించకుండా పనులను చేస్తున్నారని నిర్ణీత సమయంలో పూర్తి చేయాల్సిన పనులను తూతూ మంత్రంగా పైపై మెరుగులు మెరిపిస్తూ పలు అభివృద్ధి పనులలో భారీగా అవకతవకలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. రీ మోడలింగ్ పేరుతో రైల్వే స్టేషన్ నూతన బిల్డింగ్ పనులు ప్రారంభించి దాదాపు సంవత్సర కాలం దాటిందని, గుంతలే దర్శనమిస్తున్నాయని ఎక్సలేటర్ పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయని, రైల్వే గుడ్ షెడ్ ఆవరణలో నిర్మిస్తున్న షెడ్డు పనులు సైతం నత్తనడకన కొనసాగుతున్నాయని అధికారుల అండదండలతోనే కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా పనులు చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. కూల్చడానికే సంవత్సరకాలం కట్టడానికి ఎన్ని సంవత్సరాలో.... అమృత్ భారత్ అభివృద్ధి పనులలో పెద్దపల్లి రైల్వే స్టేషన్ పాత భవనాన్ని కూల్చడానికే సంవత్సర కాలం దాటిందని, మరి నూతన భవనాన్ని నిర్మించడానికి ఎన్ని సంవత్సరాల కాలం పడుతుందో అధికారులకు కాంట్రాక్టర్లకే తెలియాలని ప్రయాణికులు రైల్వే అధికారులపై మండిపడుతున్నారు. అమృత్ భారత్ రైల్వేస్టేషన్లో ఆధునీకరణ పనులలో అన్ని రైల్వే స్టేషన్లలో పనులు పురోగతిలో ఉండగా పెద్దపల్లిలో మాత్రం ఎందుకు ముందుకు సాగడం లేదని ఇక్కడ ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రజా ప్రతినిధులు,రైల్వే శాఖ ఉన్నత అధికారులు కాంట్రాక్టర్లపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రయాణికులు విమర్శలు గుప్పిస్తున్నారు. అమృత్ భారత్లో ఎంపికైన. మంచిర్యాల, రామగుండం, కరీంనగర్ రైల్వే స్టేషన్ల అభివృద్ధి పనులు చక చక పూర్తయి ప్రారంభోత్సవానికి సిద్ధం కాగా మరి పెద్దపల్లి రైల్వే స్టేషన్ పనులు నిలిచిపోవడం పట్ల ప్రయాణికులు అధికారులపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.కనీస సౌకర్యాలు కరువు నిఘా నేత్రాలు లేవుపెద్దపల్లి రైల్వే స్టేషన్ లో ప్రయాణికులకు కనీస సౌకర్యాలైన త్రాగునీరు, స్నానపు గదులు, మరుగుదొడ్లు కనుమరుగయ్యాయి. ముల్లె ముటా, పిల్లాపాపలతో సుదూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు భద్రత లేకుండా పోయింది.ప్రయాణికుల భద్రత నిమిత్తం పెద్దపల్లి రైల్వే జంక్షన్ అయినప్పటికీ కనీసం ఒక్క ఆర్పిఎఫ్, జిఆర్‌పి పోలీస్ కూడా విధులకు కేటాయించకపోవడం రైల్వే అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారింది. పెద్దపల్లి రైల్వే స్టేషన్‌లో ఇప్పటికే పలు దొంగతనాలు అఘాయిత్యాలు అసాంఘిక కార్యకలాపాలు చోటుచేసుకుంటున్న కనీసం స్టేషన్ ఆవరణలో నిఘా నేత్రాలు లేకపోవడం. దురదృష్టకరమని ప్రయాణికులు అధికారులపై మండిపడుతున్నారు. రైల్వే బుకింగ్ కౌంటర్ లో పదే పదే 'కృపయా జాందే మీరు నిఘా నేత్రాల నీడలో ఉన్నారు ప్రతిక్షణం ప్రయాణికుల కదలికలు గమనిస్తున్నాము' అంటూ అనౌన్స్మెంట్ రికార్డింగ్ తప్ప స్టేషన్ పరిసరాలలో ఎక్కడ నిఘా నేత్రాల జాడలేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. అధికారుల హడావిడే తప్ప అభివృద్ధి పనులలో పురోగతి శూన్యంఅమృత్ భారత్ పథకంలో పెద్దపల్లి రైల్వే స్టేషన్ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం అయినప్పటి నుంచి అధికారులు, ప్రజాప్రతినిధులు హడావిడిగా వస్తూ పోతున్నారే తప్ప అభివృద్ధి పనుల్లో మాత్రం పురోగతి లేదని స్థానిక నాయకులు ఆరోపిస్తున్నారు. దక్షిణ మధ్య రైల్వే జీఎం, డిఆర్ఎమ్, ఏడిఆర్ఎం,రైల్వే శాఖ ఉన్నత అధికారులు పలుమార్లు పెద్దపల్లి రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులను పర్యవేక్షించిన పనులు ముందుకు సాగడం లేదని పెద్దపల్లి పార్లమెంటరీ సభ్యులు గడ్డం వంశీ కృష్ణ సైతం మొన్నటికి మొన్న రైల్వే స్టేషన్ సందర్శించి అభివృద్ధి సుందరీకరణ పనులను త్వరగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించిన తూతూ మంత్రంగా పనులను ప్రారంభించి మళ్లీ పూర్తిగా పనులను నిలిపివేశారు.దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ గతవారం పెద్దపల్లి రైల్వే స్టేషన్ సందర్శనలో భాగంగా పలు సంఘాల నాయకులు, స్థానికులు పెద్దపల్లి రైల్వే స్టేషన్ అభివృద్ధి పనుల జాప్యంపై పలు వినతులు చేశారు. ఇప్పటికైనా స్థానిక ఎంపీ, ప్రజా ప్రతినిధులు, రైల్వే ఉన్నతాధికారులు స్పందించి కాంట్రాక్టర్ పై తగు చర్యలు తీసుకొని అమృత్ భారత్ అభివృద్ధి పనులను త్వరగాతిన పూర్తి చేసేలా చూడలని కోరుతున్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com